RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 19 ఏప్రిల్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:270

## రైతు భరోసా నిధులపై తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

**భూపాలపల్లి జిల్లాలో విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులు విడుదల**

**మార్చి 22న తొలి విడత నిధులు సిద్దిపేట జిల్లాలో విడుదల చేసిన సీఎం**

**రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది.**



రెండో విడత రైతు భరోసా నిధులను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. ఈ నెల 20వ తేదీన భూపాలపల్లి జిల్లా కాటారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.
రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులను వారి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. మార్చి 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడతగా 1.50 కోట్ల ఎకరాలకు రూ.3,590 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు.
ఈ క్రమంలో, రైతులు రెండో విడత రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.

## తమిళనాడులో తిరిగి డిఎంకె కూటమిదే అధికారం

### లౌకికవాదం కోసం తమిళ ప్రజలు ముందుంటారు

### తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ముఖ్యమంత్రి,డీఎంకే అధినేత స్టాలిన్ నాయకత్వంలోని కూటమి తమిళనాడులో తిరిగి మంచి మెజారిటీతో అధికారంలోకి రాబోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట జిల్లా షోలింగేర్ సర్కిల్ సమీపంలోని పండియానల్లూర్ లో ఏర్పాటుచేసిన రాహుల్ గాంధీ సభలో పాల్గొన్నారు. సభ ఏర్పాట్ల ముందు శనివారం ఉదయం రాణి పేట జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ప్రసంగించారు. లౌకిక వాదాన్ని బలోపేతం చేయడంలో సంరక్షించడంలో తమిళనాడు ప్రజలు ముందుంటారని తెలిపారు. వీరగడ్డకు, ఆత్మగౌరవానికి తమిళనాడు మారుపేరు అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని తపించే ఒక సామాన్య కార్యకర్తగా మీ అందరి ముందుకు వచ్చానని డిప్యూటీ సీఎం తెలిపారు. తమిళనాడు అంటే కేవలం ఒక రాష్ట్రం కాదు అదొక సిద్ధాంతం. పెరియార్, అన్నాదురై, కలైంజర్ కరుణానిధి వంటి గొప్ప నేతలు ఇక్కడ సామాజిక న్యాయానికి పునాది వేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఢిల్లీ పీఠంపై కూర్చున్న పెద్దలు తమిళనాడు సంస్కృతిని, భాషను, హక్కులను కాల రాయాలని చూస్తున్నారని వారిని ఎదుర్కోవాలి అంటే సెక్యులర్ శక్తుల ఐక్యత అవసరం అన్నారు. సీఎం. ఏంకే స్టాలిన్ నాయకత్వంలో తమిళనాడు అభివృద్ధి పథంలోకి దూసుకుపోతుంది, రాహుల్ గాంధీ ప్రేమ సందేశం స్టాలిన్ అభివృద్ధి నినాదం ఒకటి అయ్యాయి, డీఎంకే కూటమి గెలుపు కేవలం తమిళనాడుకే కాదు దేశానికి దిక్సూచిగా మారబోతుంది అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్ సిలిండర్, రెండు లక్షల వరకు ఒకేసారి రైతులకు రుణమాఫీ, తెల్ల రేషన్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం వంటి హామీలను అమలు చేసి చూపించామని వివరించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ డిఎంకె కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి, తమిళ ప్రజలు వేసే ఓటు కేవలం ఒక గుర్తుపై వేసే ముద్ర కాదు అది విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా వేసే ఓటు అది నియంతృత్వానికి వ్యతిరేకంగా వినిపించే ప్రజాస్వామ్య గొంతుక అన్నారు. మరోసారి తమిళనాడు తన ఆత్మ గౌరవాన్ని చాటుకోవాలి ఇక్కడ విద్వేషానికి చోటు లేదు కేవలం ప్రేమ, సమధర్మానికి మాత్రమే చోటు ఉందని నిరూపించాలి డీఎంకే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతనిర్లక్ష్యం వద్దు: రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

**కరీంనగర్‌లో ఘనంగా అరైవ్ అలైవ్ వారోత్సవాలు**

**బాధిత కుటుంబాల గాథలు విని కంటతడి పెట్టిన సభికులు.**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక” 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ పోలీసు శాఖ నిర్వహిస్తున్న



“అరైవ్ - అలైవ్” రోడ్డు భద్రత వారోత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర డీజీపీ శ్రీ శివధర్ రెడ్డి శుక్రవారం కరీంనగర్ విచ్చేశారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని అస్త్ర కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత కమిటీల ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.?ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ. సదస్సులో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ?కలచివేసిన సంఘటన: ఇటీవల సంగారెడ్డిలో రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, ఆ కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకున్న ఘటన తనను ఎంతో కలిచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరి నిర్లక్ష్యం నిండు సంసారాన్ని ఎలా రోడ్డున పడేస్తుందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని అన్నారు.?డిఫెన్సివ్ డ్రైవింగ్: వాహనదారులు కేవలం డ్రైవింగ్‌పైనే కాకుండా, చుట్టుపక్కల పరిస్థితులను గమనిస్తూ వాహనం నడపాలని అలాగే నిరంతరం “3 సెకండ్స్ బ్రేక్ రూల్” పాటించాలని సూచించారు.?కంటతడి పెట్టించిన బాధితుల గాథలు: ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల్లో తమ వారిని కోల్పోయిన కుటుంబ సభ్యులు పంచుకున్న అనుభవాలు సభికులను కంటతడి పెట్టించాయి. వారి మాటలు వాహనదారులకు ఒక ‘చెంపపెట్టు’ లా ఉండాలని, రోడ్డుపై వెళ్లేటప్పుడు బాధ్యతగా ఉండాలని డీజీపీ స్పష్టం చేశారు.బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ తరుపున నగదు అందజేశారు. అలాగే రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన లెటర్ టూ ఎ ఫాదర్ మరియు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు డీజీపీ చేతులమీదుగా అందజేశారు.సకాలంలో స్పందించి రోడ్డు ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్ ప్రమాదానికి గురైన గంటలోపు ఆసుపత్రిలో చేర్పించి వారి ప్రాణాలను కాపాడినందుకు పలువురిని డీజీపీ స్వయంగా శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ?కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా గ్రామ మరియు వార్డు స్థాయిల్లో రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు రక్షణగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.?ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా బిల్లును అడ్డుకోవడం భ్రూణహత్యే: విపక్షాలపై ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం

**నిన్న లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు**

**మహిళా రిజర్వేషన్లకు చుక్కెదురు**

**నేడు జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ**

**ఈ పాపంలో కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ ప్రధాన దోషులని తీవ్ర విమర్శ**

**దేశానికి మేలు చేసే ప్రతి సంస్కరణను కాంగ్రెస్ అడ్డుకుంటుందని ఆరోపణ**

**సంఖ్యాబలం తక్కువగా ఉన్నా మహిళా రిజర్వేషన్ కోసం పోరాటం ఆపబోమని స్పష్టీకరణ**

**విపక్షాలకు మహిళలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్య**



భారత రాజకీయాల్లో మహిళలకు చారిత్రక సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన ‘నారీ శక్తి వందన్’ సవరణను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు “గర్భంలోనే చంపేశాయని” ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లోక్‌సభలో ఈ బిల్లు వీగిపోవడంపై శనివారం సాయంత్రం జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఇది కేవలం బిల్లు ఓటమి కాదని, భారత మహిళల ఆకాంక్షలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ చారిత్రక తప్పిదంలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే పక్షాలదే ప్రధాన పాపమని నేరుగా ఆరోపించారు.
ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈ పరిణామం తనను తీవ్రంగా బాధించిందని, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం భ్రూణహత్యతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. “ఈ సవరణ ఎవరి హక్కులనూ హరించడానికి కాదు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలకు దశాబ్దాలుగా నిరాకరించిన హక్కులను అందించడానికే. మేం నిజాయతీతో, స్పష్టమైన ఉద్దేశంతో చేసిన ఈ పవిత్ర మహాయజ్ఞాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి” అని మోదీ అన్నారు.
21వ శతాబ్దంలో భారత మహిళలకు కొత్త అవకాశాలు కల్పించి, వారి పురోగతికి అడ్డంకులను తొలగించేందుకే ఈ చట్టాన్ని తీసుకొచ్చామని వివరించారు. దేశాభివృద్ధిలో మహిళలను నిజమైన భాగస్వాములుగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
కాంగ్రెస్‌కు మహిళా రిజర్వేషన్లపై మొదటి నుంచి వ్యతిరేకతే ఉందని, గతంలో జరిగిన ప్రయత్నాలను కూడా ఆ పార్టీ అడ్డుకున్న చరిత్రను ప్రధాని గుర్తుచేశారు. “ఈసారి కూడా తప్పుడు వాదనలు, పక్కదారి పట్టించే ఎత్తుగడలతో చట్టాన్ని అడ్డుకున్నారు. ఈ చర్యలతో ఆ పార్టీలు భారత మహిళల ముందు తమ నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నాయి. దశాబ్దాల నాటి తప్పులను సరిదిద్దుకునేందుకు వచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ జారవిడుచుకుంది” అని విమర్శించారు. కుటుంబ పార్టీలైన కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీలు మహిళలు రాజకీయంగా ఎదగడాన్ని సహించలేవని ఆరోపించారు.
సంస్కరణలను వ్యతిరేకించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని మోదీ విమర్శించారు. “జన్ ధన్, జీఎస్టీ, డిజిటల్ చెల్లింపులు వంటి కీలక సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించింది. సైనికుల కోసం తెచ్చిన ‘వన్ ర్యాంక్ వన్ పెన్షన్’ను 40 ఏళ్ల పాటు అడ్డుకున్న చరిత్ర వారిది. ఉగ్రవాదం, నక్సలిజంపై ఆ పార్టీ వైఖరిని దేశం మర్చిపోదు” అని మోదీ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్నజీవి అని, ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి బతుకుతోంది అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.
డీలిమిటేషన్ అంశంపై కూడా విపక్షాలు అసత్య ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించాయని మండిపడ్డారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, పైగా అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరుగుతుందని తాను హామీ ఇచ్చినా వినలేదన్నారు.
“ఈ బిల్లును అడ్డుకోవద్దని, కావాలంటే ఈ ఘనతను మీరే తీసుకోండని విపక్ష నేతలకు విజ్ఞప్తి చేసినా వారు పెడచెవిన పెట్టారు. ఇవాళ మాకు సంఖ్యాబలం తక్కువగా ఉండొచ్చు. కానీ మహిళా రిజర్వేషన్ సాధన కోసం మా పోరాటం ఆగదు. చట్టసభల్లోకి రావాలన్న మహిళల కలలను ధ్వంసం చేసిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు రాబోయే ఎన్నికల్లో దేశ మహిళలు గట్టిగా బుద్ధి చెబుతారు. వారు ఇప్పటికైనా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి” అని మోదీ హెచ్చరించారు. ఈ బిల్లును అడ్డుకున్న పాపం ఆ పార్టీలను జీవితాంతం వెంటాడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పండి...

### ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి సీఎం రేవంత్ రెడ్డి వినతి



ఢిల్లీ: బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ (ఉక్కు పరిశ్రమ) ఏర్పాటు చేయాలని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్--2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం కేంద్ర మంత్రులకు వివరించారు. తెలంగాణలో పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులను సీఎం కోరారు. అందుబాటులో ఉన్న సాంకేతికత, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న అనుకూలతల వలన దేశ పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలకు హైదరాబద్ కేంద్రంగా నిలవగలదని కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు. హైదరాబాద్‌లో హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటో, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అలాగే మెషిన్ టూల్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక పరికరాల తయారీకి ప్రత్యేక పార్క్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌ను 2034 నాటికి కాలుష్యం లేని నగరంగా మార్చే లక్ష్యంతో వాహనాలను ఈవీలుగా మార్చేందుకు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పే జాతీయ స్థాయి సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

ప్రజాబలం

19 ఏప్రిల్ 2026 ఆదివారం

# అదను చూసి దెబ్బకొట్టిన విపక్షాలు

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపు బిల్లు వీగిపోయింది. అయితే ఈ సూత్రం ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ మేధోమథనానికి దారితీసింది. బిల్లు చారిత్రాత్మకం.. దేశంలో ఉన్న మహిళలకు లభిస్తున్న గౌరవం.. ఇకపై వారు మరింత సాధికారత సాధించవచ్చు. చట్టసభల్లో మరింత సమున్నతంగా కొనసాగవచ్చు.. భారత మహిళలు మరింత అభివృద్ధి చెందుతారని ఆశిస్తున్నాం.. ఇదీ మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టసభల్లోకి వచ్చే ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ మహిళలను ఉద్దేశించి రాసిన లేఖ. ఈ బిల్లు చర్చకు వచ్చే ముందు పార్లమెంట్లో విస్తృత సమావేశం జరిగింది. అధికార పక్షం నుంచి మొదలు పెడితే ప్రతిపక్షం వరకు నాయకులు తమ తమ వాణి వినిపించారు.. దీంతో చట్టసభల్లో మహిళ బిల్లు నెగ్గుతుందని.. మహిళలకు రిజర్వేషన్ వర్తిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ చారిత్రాత్మకమైన బిల్లు వీగిపోయింది. విపక్షాల ఐక్యత ముందు నరేంద్ర మోడీ ప్రభుత్వం తలవంచింది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. విపక్షాల ఐక్యత ముందు తలవంచక తప్పలేదుఈ బిల్లు ఆమోదానికి మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలి. ఆ మెజారిటీని కూడగట్టడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైంది. దశాబ్దాలపాటు నెరవేరని కలగా ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు సహకారం కాలేదు.. శుక్రవారం పార్లమెంట్లో ఉత్కంఠ భరితమైన వాతావరణం మధ్య.. ఈ బిల్లుపై ఓటింగ్ నిర్వహించారు. సభకు మొత్తం 528 మంది హాజరయ్యారు. అనుకూలంగా 298 మంది మాత్రమే ఓటు వేశారు. మిగతా 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి నోచుకోవాలంటే కనీసం 352 మంది సభ్యులు ఆమోదం తెలపాలి. మ్యాజిక్ ఫిగర్ పొందడానికి 54 ఓట్లు అవసరం. అయితే వారంతా వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. దీంతో బిల్లును తిరస్కరించామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సభను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు.మొదటినుంచి కూడా డీలిమిటేషన్ చేపట్టాలని నిబంధన పై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ అమలుకు ముందు దీనిని చేపట్టాలనే ప్రభుత్వ నిబంధన పై మండిపడుతున్నాయి.. "ఇప్పుడు మీరెందుకు రిజర్వేషన్ అమలు చేయడం లేదు? భవిష్యత్ కాలంలో నిర్వహించే డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇది మహిళలకు గర్వభంగాన్ని కలిగించే అంశమని" విపక్షాలు కేంద్రంపై మండిపడుతున్నాయి. అంతేకాదు కీలకమైన ఓటింగ్ సమయంలో విపక్షాలు మొత్తం ఏకతాటిపైకి వచ్చాయి. అంతేకాదు, మిత్రపక్షాలను కూడా కేంద్రం ఒప్పించలేకపోవడం నరేంద్ర మోడీ వైఫల్యానికి నిదర్శనం అని విశ్లేషకులు అంటున్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయిన తర్వాత.. కేంద్రం వెంటనే అప్రమత్తమైంది. మహిళా రిజర్వేషన్లతో సంబంధం ఉన్న డీ లిమిటేషన్ బిల్లు 2026, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్టాల సవరణ బిల్లులు మొత్తం వెనక్కి తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి ప్రకటించడం విశేషం. వాస్తవానికి బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం ఒకరకంగా బలహీనతను నిరూపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.విపక్షాలు ఎన్నడూ లేనంతగా ఐక్యతను ప్రదర్శిస్తున్నాయి. దీనిని పసిగట్టడంలో అధికార పక్షం విఫలమైంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు అమలవుతాయా.. ఇంకా కొంతకాలం ఇలానే ఉంటుందా.. అనే సందిగ్ధం కొనసాగుతూనే ఉంది.కాకపోతే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు నోచుకోకపోవడంతో.. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా మహిళల ప్రభావం ఎన్నికల మీద పడుతుందని తెలుస్తోంది. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లును ఇప్పటితోనే కేంద్రం నిలిపి వేస్తుందా.. ఎన్నికలకు ముందు కొత్త సొంతం ముందుకు వస్తుందా.. విపక్షాల ఒత్తిడికి తలవంచుతుందా.. డీలిమిటేషన్ నిబంధన తొలగించి.. తాజాగా కొత్త బిల్లు ప్రవేశపెడుతుందా.. ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం లభించాల్సి ఉంది.జనాభా ప్రాతిపదికన మాత్రమే పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం దారుణంగా పడిపోతుందన్న ఆందోళనలతో కేంద్రం ప్రతిపాదించిన ఈ ప్రోరాటా పద్ధతి ఏ మేరకు సమన్యాయం చేకూరుస్తుందనే దానిపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. అమిత్ షా ప్రతిపాదించిన ఫార్ములాలోని ప్రధానాంశం ఏమిటంటే.. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలను కచ్చితంగా 50 శాతం మేర పెంచడం. దీనివల్ల రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్య నిష్పత్తి ఏమాత్రం మారదు. ఉదాహరణకు, లోక్‌సభలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 24 శాతంగా ఉంది. అన్ని రాష్ట్రాల్లోనూ సీట్లు 50 శాతం పెరిగినప్పుడు, మొత్తం సీట్ల సంఖ్య పెరిగినా దక్షిణాది రాష్ట్రాల వాటా అదే 24 శాతంగా కొనసాగుతుంది. తద్వారా జనాభా నియంత్రణ పాటించినందుకు ఏ రాష్ట్రమూ తన రాజకీయ బలాన్ని కోల్పోదని కేంద్రం భరోసా ఇస్తోంది. ఈ ప్రోరాటా పద్ధతి ఒక మధ్యేమార్గం . కేవలం 2021/2026 జనాభా లెక్కల ఆధారంగా సీట్లు కేటాయిస్తే, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరిగి, దక్షిణాది ప్రాబల్యం 18-20 శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది. కానీ, ఈ 50 శాతం పెంపుదల సూత్రం వల్ల ఉత్తరప్రదేశ్ లేదా బీహార్ వంటి రాష్ట్రాలకు అదనపు ప్రయోజనం కలగదు, అలాగే కేరళ లేదా తమిళనాడు వంటి రాష్ట్రాలకు నష్టం వాటిల్లదు. అంటే, పార్లమెంటులో ఒక బిల్లును ఆమోదించుకోవడానికి అవసరమైన ఓట్ల శాతంలో దక్షిణాది రాష్ట్రాల బలం యధాతథంగా ఉంటుంది. అయితే, ఇక్కడ ఒక చిన్న మెలిక ఉందని కొందరు నిపుణులు విశ్లేషిస్తున్నారు. శాతం పరంగా వాటా మారకపోయినా, సంఖ్యాపరంగా ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కువగా ఉంటాయి. . 2026 తర్వాత జరిగే మొదటి జనాభా గణన ఆధారంగా కొత్త నియోజకవర్గాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం కానుంది.ముందున్న రోజుల్లో డీలిమిటేషన్ అనేది కేవలం సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాకుండా, ఫెడరల్ స్ఫూర్తికి సంబంధించిన అంశంగా మారనుంది. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా, ప్రజాస్వామ్యబద్ధంగా సమాన ప్రాతినిధ్యం ఎలా కల్పిస్తారనేది ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ముందున్న పెద్ద సవాలు. ఈ ప్రక్రియపై రాజకీయ ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ భవిష్యత్తు మరియు రాష్ట్రాల హక్కుల మధ్య సమతుల్యతను కాపాడటమే ఈ పునర్విభజన అసలు లక్ష్యం కావాలని ప్రజలు కోరుకుంటున్నారుఅయితే, ఈ ప్రక్రియను రాజ్యాంగబద్ధంగా ఎలా అమలు చేస్తారు? ఆర్టికల్ 82ను ఎలా సవరిస్తారు? అనే సాంకేతిక అంశాలపై ప్రభుత్వం ఇచ్చే వివరణపైనే ఈ ఫార్ములా విజయం ఆధారపడి ఉంటుంది.

# మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గ పర్యటన







**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** జోగిపేట పాలిటెక్నిక్ కాలేజీలో సుమారు 75 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాప చేశారు పర్యటన లో బాగంగా చౌటకూర్, మండలం శివంపేట్ లోని,జోగిపేట,పాలిటెక్నిక్ కళాశాలలో న్యూలాండ్ ఫౌండేషన్ సీఎస్ఆర్ రూ.43 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన మెకానికల్ వర్క్‌షాప్ షెడ్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. పాలిటెక్నిక్ కాలేజీలో డి ఎం ఎఫ్ టి 6, లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన (హైమాస్ట్ ఎల్ఈడి) 4 స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం, 26,లక్షల రూపాయలతో తోషిబా కంపెనీ సి ఎస్ ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను మంత్రి ప్రారంభించారు

ఈసందర్భంగ మంత్రి మాట్లాడుతూ ,జోగిపేట పాలిటెక్నిక్ కాలేజీ కి ఇప్పటివరకు 2,కోట్ల 35 లక్షల 75,వేల రూపాయల సీఎస్ఆర్ నిధులను వెచ్చించి పలు అభివృద్ధి పనులను చేపట్టమన్నారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య , వైద్య,రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు, ఈ సందర్భంగా పాలిటెక్నిక్ అభివృద్ధిపై కాలేజీ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పాలిటెక్నిక్ కాలేజీలో గర్ల్స్ హాస్టల్ నిర్మాణానికి, ఇతర విభాగాల వర్క్ షెడ్ ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్ సంధ్యారాణి, న్యూ ల్యాండ్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ డివి రెడ్డి, ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆందోల్ - జోగిపేట లో 20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి

### శంకుస్థాపన చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 18 ( ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 20,కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్క్ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ మర్రి అరుణ కుమారి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లోని నాచారం పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం

### నాచారం నుంచి చిలుకానగర్ వెళ్లే దారిలో అగ్నిప్రమాదం

### గోదాములో భారీగా ఎగిసిన మంటలు

### మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



హైదరాబాద్‌లోని నాచారం పారిశ్రామిక వాడలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నాచారం నుంచి చిలుకానగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఒక కాటన్ మిల్లు గిడ్డంగిలో ఈ ప్రమాదం జరిగింది. భారీ మంటలు ఎగిసిపడటంతో గోదాములో నిల్వ ఉన్న సరుకు పూర్తిగా దగ్ధమైంది. మంటలు పక్కనే ఉన్న మ్యాట్రెస్ కంపెనీకి కూడా వ్యాపించాయి.

స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందించారు. ప్రమాదస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తోంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ అగ్నిప్రమాదం కారణంగా నాచారం నుంచి చిలుకానగర్ వెళ్లే రహదారిని మూసివేశారు.

## సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే జర్నలిస్టులు వారి కుటుంబం కోసం హెల్మెట్ ధరించాలి.

### ఎస్ ఐ లవ కుమార్.




సంగారెడ్డి జిల్లా"ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి హోప్ న్యూరో హాస్పిటల్ వైద్యుడు కృష్ణమూర్తి సహకారంతో విలేకరులకు ఎస్సై లవకుమార్ ఆధ్వర్యంలో హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించినప్పుడే మనతో పాటు మన కుటుంబం సురక్షితంగా ఉంటుందని అన్నారు. కాలంతో పాటు పరిగెడుతూ నిరంతరం నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే జర్నలిస్టులో కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సమాజంలోపాత్రికేయుల పాత్ర చాలా గొప్పదని వారు ప్రతి రోజు వార్తలు సేకరిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారదులుగా పనిచేస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు వార్తలు కవర్ చేస్తారని అన్నారు..వాహనాలు నడిపేటప్పుడు పూర్తి ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ గురించి వివరిస్తూ, డ్రైవర్ ముందుగా తన వాహనం పరిస్థితి గురించి తెలుసుకుని ఉండాలని అన్నారు. వాహనాన్ని ఎంత వేగంగా నడపడం కాకుండా ఆ వేగాన్ని నియంత్రించగలగడం ముఖ్యమని అన్నారు. అజాగ్రత్తగా వాహనం నడపడం ప్రమాదాలకు దారి తీస్తుందని అన్నారు. పత్రిక విలేఖరులకు 30 హెల్మెట్లు పంపిణీ చేశారు . హెల్మెట్ ధరించడం మరియు ట్రాఫిక్ నియమాలను పాటించడం పై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ఎస్సై శ్రీహరి, ఏఎస్ఐ రషీద్ అలీ, హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, బస్వరాజ్ పోలీస్ సిబ్బంది మండల విలేకరులు మల్లేశం, షఫీ, దాసు ప్రభాకర్ సింహ రెడ్డి, నర్సింలు తదితరులు ఉన్నారు.

## తిరుమలేశుని భక్తులకు తిరునామధారణ

### "తిరునామ"సేవలో తరిస్తున్న శ్రీవారి సేవకులు

### తిరు అంటే 'శ్రీ', నామం అంటే 'తిలకం'.

తిరునామాన్ని శ్రీనామం అని కూడా అంటారు. హైందవ సనాతన ధర్మంలో తిరునామాన్ని శుభసూచికంగా భావిస్తారు. తిరునామం సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రతీక. తిరునామాన్ని ధరించిన భక్తులకు భగవంతుడు మనకు తోడుగా, అండగా ఉన్నాడన్న భావన కలుగుతుంది. సత్ప్రవర్తనతో, భక్తిభావంతో మెలగుతారు. ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుమలలో ఇలాంటి భక్తిసంప్రదాయాన్ని పెంచేందుకు టిటిడి భక్తులకు తిరునామధారణ చేయిస్తోంది. తిరునామంలో ఎర్రటికాంతిలా కనిపించే ఆకారం ఆత్మను సూచిస్తుంది. కొంత మంది భక్తులు భుజాలు, ఛాతిపైన, వీపుపై కింది భాగాన తిరునామం ధరిస్తారు. భక్తులు కనుబొమల మధ్య నుంచి నుదుటిపై వరకు ధరిస్తారు. తిరునామం ధరించినవారు శ్రీవేంకటేశ్వరుని సేవకులని సులువుగా గుర్తించవచ్చు. నుదుటన గల ఆగ్నేయచక్రంలో తిలకధారణ చేసుకుంటే చెడుదృష్టి పడకుండా ఉంటుందని భక్తుల నమ్మకం. తిరునామం కోసం నామకోపు, ఎర్రసింధూరం వినియోగిస్తున్నారు. తిరునామం పెట్టుకుంటే చలువ చేస్తుందని కూడా కొందరు భక్తుల అభిప్రాయం. తిరునామధారణ కోసం ప్రత్యేకంగా రాగితో తయారుచేసిన కప్పు, మూడు నామాల ముద్రను ఉపయోగిస్తారు.శ్రీవారి "తిరుమణికాప్పు"శ్రీవారి మూలమూర్తికి శుక్రవారం అభిషేకం తరువాత వారానికి ఒకసారి మాత్రమే చందనం పొడి, కర్పూరం, మధ్యలో కస్తూరితో తిరునామం దిద్దుతారు. గురువారం సడలింపు(ఆభరణాలు తొలగించే) సమయంలో నేత్రాలు భక్తులకు కనిపించేలా తిరునామాన్ని కొంతమేర తగ్గిస్తారు. పవిత్రతకు ప్రతీకగా కనిపించే ఈ తిరునామం శ్రీవారి ముఖారవిందాన్ని మరింత తేజస్సుతో ఆవిష్కరిస్తూంటుంది. ఈ నామాన్ని 'తిరుమణికాప్పు' అని అంటారు. ఇందుకుగాను 16 తులాల పచ్చ కర్పూరం, ఒకటిన్నర తులం కస్తూరిని ఉపయోగిస్తారు.

## పంచాయతీరాజ్ గ్రామీణ మినిస్టర్ సీతక్క చేతుల మీదుగా అర్జీలు స్వీకరణ



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 18 రాయినిగూడెం** శనివారం ములుగు మండలం రాయినిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారి అర్జీలను స్వీకరించారు

పెద్ద ఎత్తున రాయని గూడెం ప్రజలు పాల్గొని ఊరి సమస్యలు రోడ్లు నీరు కరెంటు డ్రైనేజీ వ్యవస్థ గురించి రైతులు అర్జీ పెట్టుకున్నారు

## గోల్డెన్ అవర్ పై అవగాహన కార్యక్రమం



హైద్రాబాద్ ఏప్రిల్ 18 Arrive and Alive కార్యక్రమంలో భాగంగా, ట్రాఫిక్ ఐజూ అవినాష్ కుమార్ నేతృత్వంలో శ్రీ DCP రాములు, ACP శ్రీనివాస్ పర్యవేక్షణలో, OU సిటీ పరిధిలోని మణికేశ్వర్ నగర్ నాన్-టీచింగ్ ఫంక్షన్ హాల్‌లో గోల్డెన్ అవర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం CC Shroff Memorial Hospitaశ్రీ (డా. శశాంక్ మరియు ఆసుపత్రి సిబ్బంది) సహకారంతో నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, రోడ్ సేఫ్టీ సభ్యులు, సాధారణ ప్రజలు మరియు కాలేజీ విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.




ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ ప్రమాద బాధితుల ప్రాణాలను రక్షించడంలో "గోల్డెన్ అవర్" యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తక్షణ ప్రథమ చికిత్స అందించడం, అవసరమైనప్పుడు CPR చేయడం, గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించేందుకు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ కీలక సమయంలో సమయానికి వైద్య సహాయం అందించడం ద్వారా మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని మరియు ప్రాణ రక్షణ శాతం పెరుగుతుందని వివరించారు. అదనంగా "రహవీర్" మరియు "PM రాహత్" పథకాల గురించి కూడా అవగాహన కల్పించారు.

ఆసుపత్రి సిబ్బంది ప్రాథమిక ప్రాణరక్షణ విధానాలను ప్రదర్శిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో చిక్కలగూడ, OU సిటీ మరియు కాచిగూడ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించడాన్ని నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించిన బిజెపి

**సీఎం రేవంత్ రెడ్డి ఇంటి దగ్గర రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన బిజెపి**

**స్టేట్ మీడియా ప్యానెలిస్ట్ డా. ప్రభా గౌడ్**

**ఆమెను అడ్డుకుని అరెస్ట్ చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు**

హైద్రాబాద్ ఏప్రిల్ 18 మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించడాన్ని నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఇంటినిబిజెపి ముట్టడించింది.

సీఎం రేవంత్ రెడ్డి ఇంటి దగ్గర రోడ్డుపై బిజెపిస్టేట్ మీడియా ప్యానెలిస్ట్ డా. ప్రభా గౌడ్ బైఠాయించి నిరసనతెలిపింది. దీనితో ఆమెనుపోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.




ఈ సందర్భంగా డా.. ప్రభా గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ గారు 33% రిజర్వేషన్లతో 'మహిళా నేతృత్వంలో అభివృద్ధి'కి బాటలు వేస్తుంటే, కాంగ్రెస్ మరియు 'ఇండి' కూటమి కుట్రపూరితంగా దానిని అడ్డుకుని తమ మహిళా వ్యతిరేకతను బట్టబయలు చేసుకున్నాయని..విమర్శించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ముమ్మాటికీ మహిళా ద్రోహులు అని ఆమె మండిపడ్డారు.




మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ కూటమి కాలకూట విషం కక్కిందని, మహిళలందరినీ ఓడించినందుకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కూటమి సంబురాలు చేసుకుంటుందని.. ప్రతి తల్లి, అక్కా, చెల్లి ఇలా అందరికీ ఇది అవమానకరమైన రోజు అని అన్నారు. త్వరలోనే మహిళలంతా కలిసి కాంగ్రెస్ కూటమికి బుద్ధి చెప్పే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ దృష్టిలో మహిళలంటే కేవలం ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీలు మాత్రమే కావచ్చు అని అన్నారు.

డీలిమిటేషన్ సాకుతో, ఎక్కడ మహిళలు చట్టసభల్లోకి అడుగుపెట్టి బిజెపికి క్రెడిట్ ఇస్తారో అన్న అక్కసుతో ఈ బిల్లును నిలిపివేయడం యావత్ మహిళా లోకానికి, వారి హక్కులకు జరిగిన ఘోర అవమానం చేశారన్నారు. డూప్లికేట్ గాంధీ. స్టాలిన్, అఖిలేష్ కుటుంబాల మహిళలకు మాత్రమే పదవులుండాలా?

మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీకి మైలేజీ రావొద్దని రాత్రికి రాత్రి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కుట్ర చేశారని, 'నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తాను' అని ఒకరికొకరు డ్రామాలాడుతున్నారని అన్నారు. నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టే ప్రసక్తి లేదని డా.. ప్రభా గౌడ్ మండిపడ్డారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన






బాలానగర్, ఏప్రిల్ 18: బాలానగర్ లోని రాజు కాలని కమ్యూనిటీ హాలులో జనహిత సేవా ట్రస్ట్, హెయిల్ టాటామణి చారిటబుల్ ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి సేవలు అందించారు. వైద్య శిబిరంలో కిమ్స్ ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్, గైనకాలజి, పెడియాట్రిక్స్, జనరల్ ఫిజిషియన్ వైద్యులు, ప్రతి ఒక్కరికి బీపీ, సుగర్ పరీక్షించి మందులను కూడా ఉచితంగా అందజేశారు.

భారత్ వికాస్ పరిషత్ ద్వారా 95 మంది మహిళలకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్త హీనత ఉన్నవారికి ఐరన్ ఫోలిక్ మాత్రలను అందజేశారు.

ఈ శిబిరంలో హెయిల్ టాటామణి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కాకుమాను లూర్దు జ్యోతి, డైరెక్టర్ డాక్టర్ పొలంకి జగదీష్ కుమార్, సభ్యురాలు ప్రేమలత, జి.రాజు, అప్సా సిబ్బంది బుగ్గయ్య, రాణి,ఫిజియోథెరపిస్ట్ ఎం. శ్రీనివాస్, మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్ బి.నర్సింగ్ రావు, కిమ్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ విక్రమ్ పాల్గొన్నారు.

## దెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలోఉచిత అన్నదానం




హైదరాబాద్ ఏప్రిల్ 18 దెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు మరియు అవసరమైన వారికి ఉచితంగా భోజనం అందజేశారు.

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నదానం సేవలను పొందారు. ఆకలి బాధలను తగ్గించడం మరియు అవసరమైన వారికి సహాయం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.




సమాజ సేవలో భాగంగా ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు మరియు విద్యా కార్యక్రమాలు దెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ నిరంతరం నిర్వహిస్తుందని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వాలంటీర్లు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## సదాశివపేట పట్టణం లోని హజరత్ మహబూబ్ పాశ దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న జగ్గారెడ్డి



సదాశివపేట ఏప్రిల్ 18 సదాశివపేట పట్టణం లోని హజరత్ మహబూబ్ పాశ దర్గా లో జరిగిన ఉర్సు ఉత్సవాల్లో టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. గత మూడు రోజులు గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ దర్గా లో హజరత్ సయ్యద్ షా మహమ్మద్ సాహబ్ 422 వ ఉర్సే షరీఫ్ మరియు హజరత్ మహబూబ్ పాశ 52 వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలు సంయుక్తంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా జరిగిన కవ్వాలి కార్యక్రమం ఆహుతులను అలరించింది. కవ్వాలి కార్యక్రమం నిర్వాహకులను, దర్గా కమిటీ సభ్యులను జగ్గారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని, కవ్వాలి కార్యక్రమం బాగుందని నిర్వాహకులను అభినందించారు.

## చిన్నారి వైద్యానికి వెస్సో ట్రస్ట్ లక్ష రూపాయల ఆర్థిక సహాయం



హైద్రాబాద్ ఏప్రిల్ 18 రాయలపాడు గ్రామం, రావులపాలెం మండలం, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా నివాసి శ్రీ ర్యాలి వెంకటేశ్వర్లు (40) వృత్తి రీత్యా కార్పెంటర్. ఆయన కు ముగ్గురు కుమార్తెలు మరియు ఒక కుమారుడు. కుటుంబం మొత్తం ఆయన సంపాదన పై ఆధారపడి జీవిస్తోంది. దురదృష్టవశాత్తు, ఆయన మూడవ కుమార్తె చి.మోక్ష శ్రీవల్లి (5) తీవ్రమైన హృదయ వ్యాధి అనగా గుండె లో రంధ్రం తో బాధ పడుతోంది. ప్రస్తుతం పాప తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్) లో చికిత్స పొందుతోంది. డాక్టర్లు అత్యవసరంగా గుండె ఆపరేషన్ చేయాలని సూచించారు, దీనికి సుమారు నాలుగు లక్షలు ఖర్చు అవుతుంది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 2,39,000 రూపాయలు మంజూరు అయినప్పటికీ, రోజువారీ వేతనానికి పని చేసే తండ్రికి మిగిలిన ఖర్చును భరించే ఆర్థిక పరిస్థితి లేదు! అందువలన, వెస్సో ట్రస్ట్‌ను సంప్రదించి, తన కుమార్తె ప్రాణ రక్షణ కొరకు ఆర్థిక సహాయం అందించమని ట్రస్ట్ ను కోరారు.స్పందించినట వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో లక్ష రూపాయల ఐదు వేల నిధి సేకరించి, హైదరాబాద్ సిసిఎస్ ఈవోడబ్ల్యూ ఎసిపి కె ఎం కిరణ్ కుమార్ చేతుల మీదుగా చెక్కు ను బషీర్ బాగ్ లో లబ్ధిదారు బంధువైన శ్యామ్ కుమార్ కు అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలో వెస్సో అధ్యక్షులు బంగారు తాతారావు తో పాటు విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్ కోశాధికారి మరియు విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ సెక్రెటరీ పండూరు వి ఆర్ కె ప్రసాద్, బి జె ఎం సి తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ నాగార్జున వి వి నాగోజు, సినీ డైరెక్టర్ శ్రీరామోజు రామ్ కుమార్, మారోజు నరసింహ చారి, ఉపేంద్ర చారి, అడ్వకేట్ కోసూరి రామచంద్ర పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఒక రాజకీయ పునరేకీకరణ జరుగుతోంది.

## రేవంత్ కు హైట్ తక్కువ అనుకున్నాం, బుర్ర కూడా తక్కువనే కేటీఆర్

జగిత్యాల ఏప్రిల్ 20వ తేదీన జగిత్యాలలో నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణాన్ని సందర్శించిన తరువాత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు.

కేటీఆర్ మాట్లాడుతూ జగిత్యాలలో కోలాహలం, ఒక పండుగ వాతావరణం ఇవ్వాళ అందరికీ కనబడుతోంది. జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభమవుతుంది. జగిత్యాల నుంచే మళ్లీ పూర్వ వైభవం సాధించడానికి, కేసీఆర్ గారు ముఖ్యమంత్రి కావడానికి జగిత్యాల ప్రజల ఆశీర్వాదంతోనే కదం తొక్కుతాము. ఇవాళ వాస్తవం ఏమిటంటే రాష్ట్రంలో ఒక రాజకీయ పునరేకీకరణ జరుగుతోంది. సింహం బయటికి వస్తోంది అంటే గుంటనక్కల గుండెల్లో ఇవాళ రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు.

ముఖ్యమంత్రి, , మంత్రులు ఎంత సిల్లీ రాజకీయాలు చేస్తున్నారంటే.. కేసీఆర్ ఇక్కడికి వస్తున్నారంటే రేవంత్ మేడిగడ్డకు వెళ్తాడట. రెండున్నరేళ్లుగా మేడిగడ్డకు వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేకుండా ఉండి, అర్జెంట్గా కేసీఆర్ బహిరంగ సభ ఇక్కడ ఉంటే.. టీవీల్లో సగం కేసీఆర్ను చూపెట్టాలి, సగం రేవంత్ రెడ్డిని చూపెట్టాలి అనే కుట్రతో వెళ్తున్నాడు. పేపర్లలో సగం రేవంత్ రెడ్డిదే రాయాలి, అవతలి వైపు కేసీఆర్ది రాయాలని ఒక చిల్లర ప్రయత్నం. అంటే ఇంత కుత్సితమైన, ఇంత కుసంస్కారమైన, ఇంత చిన్న మెదడు ఉన్న ముఖ్యమంత్రి బహుశా భారతదేశంలో ఎవరూ ఉండరు.. రేవంత్ తప్ప. ఆయనకు హైట్ తక్కువ అనుకున్నాం, బుర్ర కూడా తక్కువనే నని అన్నారు.

# నత్తనడకన దిండి- చించినాడ పనులు

రాజమండ్రి, ఏప్రిల్ 18, ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ దిండి- చించినాడ గ్రామాల వద్ద వశిష్ట నదీపాయపై నిర్మించిన వంతెన మరమ్మత్తుల పేరుతో భారీవాహనాలను నిషేదించి ఇప్పటికి 8నెలలు పూర్తి కావస్తుంది.. అయినప్పటికీ మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతుండడం ప్రజలకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. అటు పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం జిల్లాలు ఇటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఉన్న విద్యాసంస్థలకు అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రతీరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన మరమ్మత్తులతో అటుగా విద్యార్థులు నడిచి వచ్చి వెళుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఇదే తరహాలో ఉద్యోగులు కూడా అనేక సమస్యలు లేవనెత్తుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు అయితే వర్ణణాతీతం అంటున్నారు..బస్సు ఎక్కి దిండి వద్ద దిగాల్సి వస్తుందని, మళ్లీ వంతెన పొడవునా నడిచి చించినాడ వెళ్లి అక్కడ బస్సు ఎక్కి వెళ్లాల్సి వస్తోందని, అదేవిధంగా సాయంత్రం తిరిగి ఇళ్లకు వస్తున్నప్పుడు చించినాడ వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి వంతెన పక్క నుంచి నడిచి మళ్లీ దిండి వద్ద బస్సు ఎక్కాల్సి వస్తోందని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.. ఇదే తరహాలో కళాశాల బస్సులు వంతెనకు ఇరువైపులా ఉంచి విద్యార్థులను తరలిస్తున్నాయి. ఈమధ్యలో వంతెన పొడవునా నడుచుకుంటూ వెళ్లడం వల్ల రెండు గంటల సమయం వృథా అవుతుందంటున్నారు విద్యార్థులు.. దీని వల్ల అలసిపోవడం, కాలేజీలకు లేట్ అవ్వడం జరుగుతుందని వివరిస్తున్నారు. ఈప్రభావం చదువుపై పడుతుందంటున్నారు...దిండి - చించినాడ వద్ద 216 జాతీయ రహదారిని కలుపుతూ ఉన్న ఈ వంతెన ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.. కేవలం పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలే కాదు విశాఖపట్నం నుంచి వచ్చిన వారు నర్సాపురం, మచిలీపట్నం, విజయవాడ వెళ్లేవారు ఎక్కువగా ఈ రహదారి ద్వారా ప్రయాణాలు సాగిస్తుంటారు.. ట్రక్కులు, గూడ్స్ వెహికల్స్ కూడా ఈ రోడ్డు ద్వారా ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి.. ఈ వంతెన మమ్మత్తులతో భారీ వాహనాలకు బ్రేక్ వేశామని చెబుతున్నా రాత్రి వేళల్లో అయితే లైట్ మోటారు వెహికల్స్‌కు కూడా అనుమతులు నిలిపివేయడం ప్రజల ఆగ్రహానికి కారణం అవుతుంది..2025 ఆగస్టు 25 నుంచి మరమ్మత్తుల నిమిత్తం ఈ వంతెనపై నిషేధం విధించారు. అప్పటి నుంచి బస్సులు, లారీలు, ఐషర్ వేన్‌లు ఇలా కొంచెం పెద్ద వాహనాలు ఏవీ రాకుండా నిషేదించారు. కార్లు, ఆటోలు, బైక్‌లకు మాత్రమే వెళ్లేందుకు అవకాశం కల్పించడగా వాటికి కూడా రాత్రివేళల్లో నిలిపివేయడంతో ఈ వంతెనపై ఏ సమయంలో ఎటువంటి ఆటంకం కలుగుతుందో తెలియని ప్రజలు ఈ మార్గంలో ప్రయాణాలు విరమించుకుంటున్నారు.. ఇప్పటివరకు వంతెన బేరింగ్ పనులు చేస్తోన్న సదరు కాంట్రాక్ట్ సంస్థ ఈ పనులను కూడా నత్తనడకన చేస్తుందని విమర్శిస్తున్నారు. మరో నెల రోజులు పైబడి వంతెన మరమ్మత్తులు జరుగుతాయని అధికారులు చెబుతున్నప్పటికీ మరో మూడు నెలల వరకు ఇదే పరిస్థితి కొనసాగేలా ఉందని ప్రజలు పెదవి విరుస్తున్నారువంతెన బేరింగ్ మరమ్మత్తు పనులు నిర్వహించే క్రమంలో వంతెన పిల్లర్ల వద్ద ఉన్న జాయింట్‌పై ఒత్తిడి పడకుండా పైన ఒక తాత్కాలిక ఇనుప వంతెన అమర్చుతున్నారు. ఇది ర్యాంప్ లు కలిగి ఎత్తుగా ఉండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయంటున్నారు. తాత్కాలిక వంతెన ర్యాంపు ఎక్కించే క్రమంలో కార్లు వేగాన్ని పెంచి వెళ్లడం వల్ల పలు ప్రమాదాలు జరిగాయని చెబుతున్నారు. 2025 ఆగస్టు 25 నుంచి ప్రారంభమైన ఈ మరమ్మత్తు పనులు పొడిగిస్తూ వస్తున్నారు.. ఇప్పటికే మూడు సార్ల వంతెనపై నిషేదాజ్ఞలు పొడిగిస్తూ వచ్చిన సదరు కాంట్రాక్టు సంస్థకు ఇచ్చిన గడువు పూర్తి అయినా ఇప్పటికీ మరమ్మత్తులు పూర్తి చేయలేని దుస్థితి కనిపిస్తోంది. కొన్ని రోజుల్లోనే పూర్తి స్థాయిలో వంతెన మరమ్మత్తులు పూర్తిచేస్తామని చెప్పుకొస్తున్నా అక్కడ పరిస్థితులను బట్టి మరో మూడు నెలలు పాటు కాలయాపన చేసేలా ఉన్నారని ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణ

శ్రీకాకుళం, ఏప్రిల్ 18, శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణ ప్రక్రియ మొదలైంది. నిపుణుల నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యింది. విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలతో ప్రత్యేకంగా ల్యాబ్ ను ఏర్పాటు చేశారు. ఉద్దాన ప్రాంత వాసుల నుంచి వ్యాధుల రాకకు కారణాలపై రక్త నమూనాలను సేకరిస్తున్నారు.కిడ్నీ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించేలా మూత్ర నమూనాల పరీక్షలో 'బయో మార్కర్స్' విధానాన్ని ఈ సారి కొత్తగా అమలు చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ద్వారా స్థానికుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు. ఇప్పటివరకు ఉద్దాన ప్రాంతంలో తీసుకున్న చర్యల గురించి పరిశోధన బృందం సభ్యులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు నివేదించారు.ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్నందున వాటి మూలాలు కనుగొనేందుకు గతేడాది నవంబరులో ఇండియన్ కౌన్సెల్ అఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్-డిపార్టుమెంట్ అఫ్ హెల్త్ రీసెర్చ్ విభాగం) మూడేళ్ల కాలపరిమితితో ప్రత్యేకంగా రూ.6.2 కోట్లను గ్రాంటు రూపంలో ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ మేరకు ఐసిఎంఆర్ సానుకూలంగా స్పందించింది. సీనియర్ నెఫ్రాలజిస్ట్ ప్రొఫెసర్ తాతపూడి రవిరాజు మెంటార్‌గా ఆంధ్ర వైద్య కళాశాల నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రసాద్ ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్‌గా పరిశోధన ప్రారంభమైంది.శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేకంగా ఏర్పడిన బృందం ఉద్దాన ప్రాంత స్థానికులను కలుసుకుంటోంది. ఇప్పటివరకు సుమారు 1,500 మంది నుంచి రక్త, మూత్ర నమూనాలను సేకరించింది. వీటిని పలాసలోని కిడ్నీ రీసెర్చ్ కేంద్రంలో తొలుత భద్రపరిచి, ఆ తర్వాత తగిన జాగ్రత్తలతో కేజీహెచ్ లో ఉన్న ల్యాబ్ కు తరలిస్తున్నారు.ఐసీఎంఆర్ ఆమోదం తెలిపిన మేరకు విశాఖ కేజీహెచ్ లో సెంట్రిఫ్యూజ్ లు, డీప్ ఫ్రీజర్లు, శాంపిల్ స్టోరేజీ సిస్టమ్స్, అనలిటకల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫీల్డ్ శాంపిలింగ్ కిట్లు ఈ ల్యాబ్ లు ఉన్నాయి. సుమారు రూ.80 లక్షలతో కొనుగోలుచేసిన అత్యాధునిక పరికరాలు/ యంత్రాలను బయో సేఫ్టీ ప్రమాణాలకు ల్యాబ్ లో ఏర్పాటయ్యాయి.

బయో మార్కర్స్ టెస్టింగ్ ద్వారా కిడ్నీ బాధితులను ప్రాథమిక దశలోనే అతి త్వరగా గుర్తించేందుకు వీలుందని మెంటార్ డాక్టర్ రవిరాజ్, ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ జి. ప్రసాద్ వెల్లడించారు. మూత్ర నమూనాలను 'బయో మార్కర్ విధానంలో పరీక్షించడంవల్ల రానున్న మూడు, నాలుగు సంవత్సరాల్లో కిడ్నీ వ్యాధుల బారినపడేందుకు అవకాశం ఉన్నట్లయితే సూక్ష్మ స్థాయిలో తెలిసిపోతుందని వివరించారు.కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మూకుమ్మడిగా ఇటువంటి పరీక్షలు చేయడం ఇదే తొలిసారి అని చెప్పారు. మూత్ర నమూనాల సేకరణలో బాధితుల కుటుంబ నేపథ్యం, ఇతర అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈ ఈ పరీక్షల ద్వారా రానున్న మూడు, నాలుగేళ్లలో కిడ్నీ సమస్య వచ్చే అవకాశం ఉందా? లేదా? వస్తే ఏ స్థాయిలో వచ్చేందుకు అవకాశాలున్నాయి? అన్న వాటిపై స్పష్టత వస్తుందని వైద్యులు వెల్లడించారు.ఈ ఫలితాల ఆధారంగా రోగులు తగిన జాగ్రత్తలతో వ్యవహరించేందుకు, వైద్యాన్ని అందించేందుకు సులువవుతుందని తెలిపారు. దీనివల్ల వ్యాధి ముదరకుండా... కిడ్నీలు చెడిపోకుండా ఉండేందుకు వీలుంది. ఆర్ఎన్ఏ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు కూడా ఈ పరిశోధనలో భాగంగా చేస్తామని తెలిపారు.

# యువనాయకత్వం...

విజయవాడ, ఏప్రిల్ 18, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇటీవల వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కూటమికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ తన వ్యూహాలను క్రమబద్ధంగా అమలు చేస్తూ ముందుకు సాగుతోంది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న పార్టీ జాతీయ ,రాష్ట్ర కమిటీలను తాజాగా ప్రకటించడం ద్వారా కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఈ ప్రక్రియలో నారా లోకేష్ కి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు ఇవ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఇప్పటికే గత మహానాడు సమయంలో లోకేష్‌కు ఈ బాధ్యతలు ఇవ్వవచ్చని చర్చలు జరిగినా, ఈసారి మహానాడు ముందుగానే అధికారికంగా ప్రకటించడం గమనార్హం. దీంతో పార్టీ వ్యవహారాలపై లోకేష్‌కు మరింత పట్టు వచ్చినట్లు స్పష్టమవుతోంది. ఈసారి మహానాడు సమావేశంలో ఆయన కొత్త హోదాలో పాల్గొనడం ద్వారా పార్టీపై తన ప్రభావాన్ని మరింత పెంచుకునే అవకాశముంది.ఇక జూన్ నెలలో టీడీపీ కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోనుండటం కూడా కీలక అంశంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి వర్గ విస్తరణ పై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. సరైన సమయం చూసుకుని ఈ మార్పులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ కమిటీలలో చేసిన మార్పుల మాదిరిగానే, ప్రభుత్వం లో కూడా కొత్త వారికి ప్రాధాన్యత ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం కూటమి మంత్రివర్గంలో ఇప్పటికే కొత్తవారికి కొంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ, రాబోయే మార్పుల్లో మరింత చురుకుగా పనిచేసే నాయకులను తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ కార్యక్రమాలను బలంగా ప్రచారం చేయగలిగే నాయకులను ఎంపిక చేయడం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. పనితీరు ఆధారంగా కొంతమంది సీనియర్ మంత్రులకు మార్పులు జరిగే అవకాశమూ ఉన్నట్లు సమాచారం. పార్టీ పదవులైనా, ప్రభుత్వ పదవులైనా యువతకు, కొత్తవారికి అవకాశాలు పెరుగుతున్నాయని అందరూ భావిస్తున్నారు. లోకేష్ తనదైన శైలిలో పార్టీపై ముద్ర వేసిన నేపథ్యంలో, ప్రభుత్వంలో కూడా మార్పులు జరిగితే తన దృక్పథాన్ని ప్రతిబింబించేలా నిర్ణయాలు తీసుకునే అవకాశముందని విశ్లేషిస్తున్నారు.అయితే ఈ మంత్రి వర్గ విస్తరణ ఎంత పెద్ద స్థాయిలో జరుగుతుందన్నది మాత్రం ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. చిన్న మార్పులు మాత్రమే చేసి ముగిస్తారా, లేక పెద్ద ఎత్తున వ్యూహరచన చేస్తారా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాల మాదిరిగా మొత్తం మంత్రివర్గాన్ని మార్చే అవకాశం తక్కువగా కనిపిస్తోంది. పరిమిత మార్పులతోనే ప్రభుత్వం ముందుకు సాగుతుందని భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, పార్టీ కమిటీల ప్రకటనతో టీడీపీ కొత్త దశలోకి అడుగుపెట్టినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు అందరి దృష్టి మంత్రి వర్గ విస్తరణపై నిలిచింది. ఈ మార్పులు ఎలా ఉంటాయి, ఎప్పుడు జరుగుతాయి అన్నదే రాబోయే రోజుల్లో ఆసక్తికర అంశంగా మారనుంది.

# కిలారు రాజేష్ కు ఎందుకంత ప్రాధాన్యం

విజయవాడ, ఏప్రిల్ 18, రాజకీయాలలో అవసరాలు మాత్రమే ఉంటాయి. ఎప్పటికీ అయ్యేది ప్రస్తుతమో అనే సామెత తీరుగానే అవి సాగిపోతుంటాయి. కానీ కొంతమంది వీటికి విరుద్ధంగా ఉంటారు. అవసరాలు కాకుండా ఆత్మీయత అనే ధోరణిలో పని చేస్తుంటారు. నాది అని కాకుండా.. మనది అనే కోణంలో అడుగులు వేస్తుంటారు. స్నేహం కోసం చివరికి తమను తాము కూడా లెక్క చేయరు. అటువంటివారు ఎటువంటి గుర్తింపును కోరుకోరు. ఎక్కడో మూలన ఉండిపోతారు. కానీ వెలుగులోకి వస్తే మాత్రం ఉదయించే సూర్యుడు కంటే ఎక్కువగా ప్రజ్వలిస్తుంటారు. ఈ ఉపమానం ఈ నాయకుడికి నూటికి నూరు శాతం సరిపోతుంది. ఆయన ఎవరు.. ఎందుకింత చర్చ జరుగుతోంది.. అనే ప్రశ్నలకు సమాధానం ఈ కథనం.ఆయన పేరు కిలారు రాజేష్. తెలుగుదేశం పార్టీలో జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. సాధారణంగా ఈ స్థాయికి రావాలంటే తెలుగుదేశం పార్టీలో చాలా కష్టపడాలి. చిన్న వయసులోనే ఆయనకు ఈ పదవి రావడం ఒకరకంగా వరమైతే.. ఆయన పడిన కష్టానికి లభించిన గౌరవం. నారా లోకేష్, కిలారు రాజేష్ మధ్య బలమైన స్నేహం ఉంది. వీరిద్దరూ ఒకే స్కూల్లో చదువుకున్నారు. అలా ఏర్పడిన స్నేహం చివరికి రాజకీయాలకు దారితీసింది. రాజకీయాలలో కూడా నాలా లోకేష్ కు నమ్మిన బంటుగా కిలారు రాజేష్ ను ఆవిర్భవించేలా చేసింది.2012లో తెలుగుదేశం పార్టీలో చేరారు రాజేష్. అప్పటికి ఇంకా తెలుగుదేశం పార్టీ అధికారం లో లేదు. తెలంగాణ ఉద్యమం వల్ల ప్రత్యేకమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇలాంటి స్థితిలో పార్టీలో ప్రవేశించిన రాజేష్.. నారా లోకేష్ కు నమ్మిన బంటుగా మారిపోయారు. 2014లో ఏపీలో తెలుగుదేశం అధికారంలోకి రావడంలో రాజేష్ కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా యువతను పార్టీకి దగ్గరగా చేశారు. నారా లోకేష్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కిలారు రాజేష్ కీలకంగా వ్యవహరించారు.2019లో పార్టీ ఓడిపోయిన తర్వాత రాజేష్ మరింత పట్టుదలతో పనిచేయడం మొదలు పెట్టారు. చంద్రబాబు జైలుకు వెళ్లడం తో లోకేష్ మీద ఒత్తిడి పెరిగిపోయింది.. ఈ నేపథ్యంలో నారా లోకేష్ కు అండగా నిలబడ్డారు రాజేష్. పార్టీ పెద్దలతో మంతనాలు జరిపారు. ఏపీలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు నారా లోకేష్ కు వివరించారు. వైసిపి చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టారు. తెర ముందుకు రాకపోయినప్పటికీ.. తెర వెనుక ఎంత చేయాలో అంతచేశారు రాజేష్. నారా లోకేష్ యువ గళం పేరుతో చేసిన పాదయాత్రకు కర్త కర్మ క్రియ రాజేష్ అంటే అతడి స్థాయి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 3000 కిలోమీటర్ల పాటు లోకేష్ పాదయాత్ర జరిగితే.. ప్రారంభం నుంచి చివరి వరకు రాజేష్ ఆయన వెంట ఉన్నారు. ప్రజా సమస్యలను గుర్తించడంలో.. ప్రజలకు నారా లోకేష్ ను మరింత చేరువ చేయడంలో రాజేష్ కీలక పాత్ర పోషించారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ రాజేష్ ఎటువంటి పదవిని కోరుకోలేదు. అధికారంలో లేనప్పుడు ఎలా అయితే ఉన్నారో.. ఇప్పుడు కూడా అలానే ఉన్నారు.అతడి నిరాడంబరతను గుర్తించిన పార్టీ సుప్రీమ్ చంద్రబాబు నాయుడు.. జనరల్ సెక్రటరీ పదవితో అతడి సేవలను గుర్తించారు.. దీంతో రాజేష్ సేవలను మరింత ఉపయోగించుకోవాలని చంద్రబాబు భావించి ఈ పదవి కట్టబెట్టారు. జనరల్ సెక్రెటరీ పదవి వచ్చినప్పటికీ రాజేష్ డౌన్ టు ఎర్త్ లాగానే ఉన్నారు. నారా లోకేష్ కు నమ్మిన బంటు లాగానే సాగుతున్నారు..విలువలు పాటించే వారికి పదవి అవసరం లేదు. పార్టీ మాత్రమే ముఖ్యం అనుకునే వారికి ఎటువంటి హోదా అవసరం లేదు. కొంతమంది ముందు గౌరవం కూడా తగ్గిపోతుంది. పదవి కూడా తన స్థాయి తగ్గించుకుంటుంది. ఎందుకంటే మహోన్నతమైన వ్యక్తిత్వం ముందు మిగతావన్నీ చిన్న ఇసుక రేణువుల మాదిరి లాంటివే కదా.. ఈ ఉపమానం నూటికి నూరు శాతం కాదు కోటి శాతం కిలారు రాజేష్ కు వర్తిస్తుంది.

# బీటెక్ రవికి తిప్పలు తప్పవా

కడప, ఏప్రిల్ 18, పులివెందుల నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ముఖ్యంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కు ఇది బలమైన కోటగా పేరుంది. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో జగన్‌ను ఓడించడం తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. గత ఎన్నికల సమయంలోనే ఈ సీటుపై టిడిపి గట్టిగా దృష్టి పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రభావం తగ్గినా, పులివెందులలో మాత్రం జగన్‌కు ఉన్న పట్టు స్పష్టంగా కనిపించింది.వచ్చే ఎన్నికల నాటికి ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ నియోజకవర్గాన్ని తమవైపు తిప్పుకోవాలని టిడిపి వ్యూహాలు రచిస్తోంది. దీనికోసం అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోంది. ముఖ్యంగా రైతులకు సాగునీటి సదుపాయం అందించేందుకు చర్యలు చేపడుతోంది. పట్టిసీమ ప్రాజెక్ట్ నుంచి కూడా నీటిని పులివెందులకు చేరవేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అదే సమయంలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది.అయితే, కేవలం అభివృద్ధి పనులు మాత్రమే సరిపోవని టిడిపి నాయకత్వం భావిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని పెంచడం, కార్యకర్తలను చైతన్యపరచడం కూడా అంతే ముఖ్యమని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే పులివెందుల ఇన్చార్జ్‌గా ఉన్న బీటెక్ రవి ( పనితీరుపై పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కడప పర్యటనలో ఆయన రవికి నేరుగా సూచనలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇంకా, మంత్రి నారా లోకేష్కూడా పార్టీ పరిస్థితిని సమీక్షించినప్పుడు పులివెందులలో పనితీరు ఆశించినంతగా లేదని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు ఇప్పటి నుంచే కఠినంగా శ్రమించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి కొంతమేర విజయం సాధించింది. ముఖ్యంగా ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపు సాధించడం, అలాగే బీటెక్ రవి కుటుంబానికి చెందిన అభ్యర్థి విజయం సాధించడం పార్టీకి కొంత ఉత్సాహాన్ని ఇచ్చింది. దీంతో నియోజకవర్గంలో తమ ప్రభావం పెరుగుతోందని టిడిపి భావిస్తోంది.అయితే, పులివెందులలో వైఎస్ కుటుంబానికి ఉన్న అనుబంధం, అభిమాన వర్గం ఇప్పటికీ బలంగా ఉంది. ఈ కారణంగా అక్కడ రాజకీయ పరిస్థితులు అంత సులభంగా మారే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే నిరంతరం ప్రజల మధ్య ఉండటం, పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేయడం అత్యంత కీలకమని టిడిపి నాయకత్వం భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో బీటెక్ రవి మరింత చురుకుగా వ్యవహరించి పార్టీ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. లేకపోతే వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం కష్టసాధ్యమవుతుందని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు. పులివెందులలో వచ్చే ఎన్నికలు ఆసక్తికర పోరాటానికి వేదిక కావడం ఖాయం అని చెప్పవచ్చు.

# సీ ఓటర్ సర్వే..

## పుంజుకోని వైసీపీ.. ఏకపక్షంగా కూటమి

విజయవాడ, ఏప్రిల్ 18, ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. జగన్మోహన్ రెడ్డి సైతం పదేపదే ఇదే హెచ్చరిస్తూ వస్తున్నారు. ఇప్పటికే రెండేళ్లు గడిచిపోయిందని.. మరో రెండేళ్లు ఇట్టే గడిచిపోతే వచ్చేది మన ప్రభుత్వమేనని గట్టిగానే చెబుతూ వచ్చారు. అయితే గతంలోనే వై నాట్ 175 అన్న నినాదం ఇచ్చి చతికిల పడింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి మరోసారి తమదే అధికారం అని చెబుతున్న మాటలు విశ్వాసానికి నోచుకోలేదు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని తెలుసుకొని మాట్లాడుతున్నారా? లేకుంటే అతి ధీమాతో ఈ వ్యాఖ్యలు చేస్తున్నారా? అనే అనుమానాలు ఉన్నాయి. సరిగ్గా ఇటువంటి సమయంలోనే సి ఓటర్ సంస్థ చేపట్టిన సర్వే సంచలనంగా మారింది.ఏపీలో ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షం పనితీరుపై గత కొద్దిరోజులుగా సర్వే చేసింది సి ఓటర్ . దానికి సంబంధించిన ఫలితాలు మైండ్ బ్లాక్ అయ్యేలా ఉన్నాయి. 2014లో తెలుగుదేశం కూటమి ఘన విజయం సాధించింది. జనసేన, బిజెపితో కలిసి పోటీ చేసింది. అప్పుడు ఆ మూడు పార్టీలకు 55.3% ఓట్లు వచ్చాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 39.4% ఓట్లు వచ్చాయి. ఎన్నికలు జరిగి దాదాపు రెండేళ్లు అవుతోంది. అయితే కూటమి ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత ప్రారంభం అయింది అని జగన్మోహన్ రెడ్డి తో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గట్టిగానే చెబుతున్నారు. ప్రజల్లోకి ఆ ప్రచారాన్ని బలంగా తీసుకెళ్తున్నారు.అయితే తాజాగా సి ఓటర్ సంస్థ ఒక సంచలన సర్వేను బయటపెట్టింది. ఇప్పటికి ఇప్పుడు ఎన్నికలు పెడితే కూటమి పార్టీలకు గతం కంటే ఎక్కువ ఓట్లు వస్తాయి అన్నది దీని సారాంశం. ఏకంగా 57.5% ఓట్లను కూటమి దక్కించుకుంటుందన్నది ఈ సర్వేలో తేలింది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 37.5% మాత్రమే ఓట్లు దక్కుతాయని తేల్చింది. ఈ లెక్కన ఆ కూటమి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య ఏకంగా 20% ఓట్ల తేడా కనిపిస్తోంది. అయితే మధ్యలో బిజెపి లేకపోయినా.. టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తే ఆ కూటమిదే విజయం అని తేల్చింది ఈ సర్వే. ప్రస్తుతం ఈ సర్వే ను వైరల్ చేస్తున్నారు టిడిపి కూటమి శ్రేణులు.అయితే ఈ సర్వే చెప్పిందని కాదు కానీ.. తెలుగుదేశం పార్టీతో జనసేన కొనసాగిన క్రమంలో ఆకూటమిదే విజయం అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇదివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి ఇదే విషయాన్ని చెప్పారు.. తాజాగా విశ్లేషకుడు ముసుగులో ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా దీనినే తేల్చారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు కరిగిపోయింది. ఆ పార్టీకి సరైన నాయకత్వం కూడా లేదు. చాలా నియోజకవర్గాల్లో ఆ పార్టీ పరిస్థితి దయనీయంగా ఉంది. ఇప్పుడు తాజా సర్వేలో అదే స్పష్టమైంది. చూడాలి మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో..

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 27 కేసులు నమోదు

## ట్రాఫిక్ అంతరాయం కలిగించిన 18 మందిపై చర్యలు

## కోర్టు ద్వారా భారీగా జరిమానాలు విధింపు

తిరుపతి : తిరుపతి పట్టణంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.- ఈ తనిఖీలలో భాగంగా త్రాగి వాహనం నడుపుతున్న వాహనదారులపై మొత్తం 27 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడమేకాక, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 18 మందిపై కూడా కేసులు నమోదు చేయయడం జరిగింది.- వాహన తనిఖీలలో పట్టుబడిన 27 మంది నిందితులను 1వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ధనలక్ష్మి ముందు హాజరు పరచగా, ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.2,70,000 జరిమానా విధించబడింది. అదేవిధంగా ట్రాఫిక్ అంతరాయం కలిగించిన 18 మందికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించబడింది.- రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, ప్రజల ప్రాణాలను రక్షించేందుకు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై ఇలాంటి కఠిన చర్యలు కొనసాగుతాయని తిరుపతి జిల్లా పోలీసులు హెచ్చరించచారు.

### పద్మారావునగర్ లో కూల్చివేతలు

సికింద్రాబాద్.. పద్మారావు నగర్ ,గాంధీ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఫుట్ పాత్ లపై వెలసిన ఆక్రమణలను జిహెచ్ఎంసి ప్రాఫిట్ అధికారులు సంయుక్తంగా తొలగించారు. పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన షెడ్లు, తాత్కాలిక దుకాణాలు, నిర్మాణ సామగ్రిని జేసీబీల సహాయంతో క్లియర్ చేశారు. ట్రాఫిక్ సమస్యలు పెరగడంతో పాటు ప్రజలు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. స్థానిక మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి...

## అత్తాపూర్ లో భారీ కూల్చివేతలు

హైదరాబాద్ అత్తాపూర్ నుండి శివరాం పల్లి వరకు అక్రమంగా నిర్మించిన ఫుట్పాత్ ఆక్రమణలపై జీహెచ్ంఎంసి అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ప్రజల నుండి స్పందన రాకపోవడంతో ఈరోజు టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తుతో కూల్చివేతలు నిర్వహించారు. ఫుట్పాత్లను ఆక్రమించడం వల్ల ప్రజలకు, ముఖ్యంగా పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇకపై ఎవరైనా మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించి తిరిగి ఫుట్పాత్లపై ఆక్రమణలు చేస్తే, వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్మాణాలను కూడా కూల్చివేస్తామని అధికారులు హెచ్చరించారు.

# టార్గెట్ వైసీపీ...

కాకినాడ, ఏప్రిల్ 18, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ నేతలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగా ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ అధికార ప్రతినిధులతో సమావేశమైన పవన్ వారికి కీలక సూచనలు చేశారు. తాను ఒక్కడినే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడం కాదు.. మిగతా పార్టీ నేతలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విమర్శలకు ఇచ్చి పడేయాలని సూచించారు. అలాగని ఇష్టారాజ్యంగా మాట్లాడవద్దని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల మాదిరిగా బూతులు వద్దని సూచించారు. కూటమి పార్టీలో జనసేన ఒక భాగస్వామ్యం అని.. కూటమి అంటే ఒక్క తెలుగుదేశం మాత్రమే కాదు అని.. అందుకే ప్రభుత్వం పై విమర్శలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తే గట్టిగానే బదులు ఇవ్వాలని పవన్ కళ్యాణ్ తాజాగా ఆదేశాలు ఇవ్వడం విశేషం.కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. మరో మూడేళ్ల గడువు మాత్రమే ఉంది. కూటమి కలిసికట్టుగా 15 సంవత్సరాలు పాటు ఉండాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అయితే జనసేనలో పవన్ ఒక్కరే మాట్లాడుతున్నారన్న విమర్శ ఉంది. పైగా కూటమిలో జనసేన నేతలు అంత కంఫర్ట్ గా లేరన్న కామెంట్స్ కూడా ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు చెక్ చెబుతూ వచ్చారు పవన్ కళ్యాణ్. కనీస స్థాయిలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఛాన్స్ ఇవ్వదలుచుకోలేదు. ముఖ్యంగా రెండు పార్టీల మధ్య చిచ్చుపెట్టేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం లేదు. జనసేన నేతలతోనే ఈ ప్రయోగాలు చేసి విఫలమైంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అటువంటి నేతలను పవన్ కళ్యాణ్ సాగనంపేసారు కూడా. చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. అది కూడా పవన్ కళ్యాణ్ హెచ్చరికతోనే. ఇష్టం ఉంటే ఉండండి.. లేకపోతే వెళ్లిపోండి అని పవన్ సూచించేసరికి.. టిడిపితో చిచ్చు పెట్టాలనుకున్న నేతలంతా జనసేనను విడిచిపెట్టి వెళ్లిపోయారు.అయితే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మొన్నటి ఎన్నికలకు ముందు, తరువాత, ఇప్పుడు అదే స్టాండ్ తో ముందుకు వెళ్తున్నారు. ఎక్కడ వెనక్కి తగ్గిన దాఖలాలు లేవు. ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీతో పొత్తు వద్దని చాలామంది నేతలు వాదించారు. అటువంటి నేతలను లెక్క చేయలేదు. వెళ్ళిపోతే వెళ్ళిపోవచ్చు అని సూచించేసరికి అప్పట్లో కొంతమంది బయటకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా చాలామంది నేతలు చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారు. అటువంటి వారికి కూడా చెక్ పెట్టేశారు పవన్ కళ్యాణ్. అయితే ఇప్పటికీ కొంతమంది జనసేన నేతల వైఖరి మారడం లేదు. తెలుగుదేశం పార్టీతో సమన్వయం చేసుకునేందుకు ఇష్టపడడం లేదు. ప్రభుత్వం అంటే కేవలం ముఖ్యమంత్రి పదవి అన్నట్టు ఉంది కొంతమంది నేతల అభిప్రాయం. అందుకే కూటమితో మమేకమై పని చేయలేకపోతున్నారు. అటువంటి వారికి గట్టి హెచ్చరికలు పంపారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏమైనా తప్పుడు మాట్లాడితే గట్టిగానే రిప్లై ఇవ్వండి.. పదునైన మాటలతో దాడి చేయండి కానీ బూతులు మాట్లాడవద్దని చెప్పారు పవన్. ఇకనైనా జనసేన నేతలు గట్టిగా మాట్లాడతారా? లేదా? అన్నది చూడాలి.

# రక్తసంబంధం వర్సెస్ రాజకీయ పంతం

హైదరాబాద్, ఏప్రిల్ 18, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ రాజకీయాలు ఇప్పుడు ఒకే రకమైన వారసత్వ యుద్ధం చుట్టూ తిరుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నా.. అగ్రనేతల కుటుంబాల్లోని అన్నాచెల్లెళ్ల మధ్య తలెత్తిన విభేదాలు పార్టీల ఉనికిని, ఉమ్మడి ఓటు బ్యాంకును ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ , తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి ఎదుర్కొంటున్న ఈ చిత్రమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యను పరిష్కారం చేసుకోవడం వారి వల్ల కావడం లేదు. తెలుగు రాజకీయాల్లో వైఎస్సార్, కేసీఆర్ కుటుంబాలకు ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అన్న వెన్నంటి నిలిచిన చెల్లెళ్లు, ఇప్పుడు అదే అన్నలకు రాజకీయంగా సవాల్ విసురుతున్నారు. ఏపీలో వైఎస్ జగన్ జైలులో ఉన్నప్పుడు షర్మిల పాదయాత్ర చేసి పార్టీని కాపాడితే, తెలంగాణలో ఉద్యమ సమయంలో కవిత సాంస్కృతిక సారథిగా నిలిచారు. అయితే, నేడు ఏపీలో జగన్-షర్మిల మధ్య ఆస్తుల గొడవలు, రాజకీయ విభేదాలు బహిరంగమై కోర్టుల వరకు వెళ్లగా.. తెలంగాణలో కేటీఆర్-కవిత మధ్య ఆధిపత్య పోరు .. కవిత సొంత పార్టీ దిశగా వెళ్లింది. వైసీపీలో జగన్, షర్మిల మధ్య పోరు కేవలం రాజకీయమైంది మాత్రమే కాదు, కుటుంబ ఆస్తుల పంపకాల్లో తలెత్తిన విభేదాలు కూడా దీనికి ఆజ్యం పోశాయి. తల్లి విజయమ్మ కూడా షర్మిల పక్షాన నిలబడటం పార్టీ కేడర్‌లో అయోమయాన్ని సృష్టించింది. అటు బీఆర్ఎస్‌లోనూ కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం జరిగిన ప్రతిసారీ కవిత వర్గం అసంతృప్తి వ్యక్తం చేయడం, తాజాగా ఆమె కొత్త పార్టీ పెట్టబోతూండటం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ సభ్యుల మధ్య ఉండే రహస్యాలు, లోపాలు రాజకీయ ప్రత్యర్థులకు బలమైన అస్త్రాలుగా మారుతున్నాయి. ఏపీలో షర్మిల చేసే విమర్శలను టీడీపీ, జనసేన తమకు అనుకూలంగా మలుచుకుంటుంటే.. తెలంగాణలో కవిత అరెస్ట్ లేదా ఆమెపై వచ్చే ఆరోపణలను కాంగ్రెస్, బీజేపీలు కేసీఆర్ , ప్రస్తుత పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి వాడుకుంటున్నాయి. "ఇంటిని చక్కదిద్దుకోలేని వారు రాష్ట్రాన్ని ఏం చక్కదిద్దుతారు అనే విమర్శలను ఈ రెండు పార్టీలు ఎదుర్కోవాల్సి వస్తోంది.ప్రాంతీయ పార్టీలు ప్రధానంగా ఒక బలమైన నాయకుడి చుట్టూ, ఆ కుటుంబం చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. అన్నాచెల్లెళ్లు విడిపోవడం వల్ల ఆ కుటుంబానికి ఉన్న సింపతీ ఓటు బ్యాంకు రెండుగా చీలిపోతుంది. ఏపీలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు జగన్, షర్మిల మధ్య నలిగిపోతుంటే.. తెలంగాణలో కేసీఆర్ వారసులుగా కేటీఆర్, కవితలో ఎవరిని నమ్మాలో తెలియక కేడర్ నిరాశలో ఉంది. ఈ చీలిక అంతిమంగా అధికార పక్షాలకు వరంగా మారుతోంది. నేతల మధ్య గొడవలు కేవలం పైస్థాయిలోనే ఉండవు, అవి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు చేరుతాయి. వారసత్వ పోరు ఎప్పుడూ ప్రాంతీయ పార్టీల బలహీనతకే దారితీసింది. అన్నాచెల్లెళ్ల ఈ సవాళ్లు సద్దుమణగకపోతే.. రెండు రాష్ట్రాల్లోనూ బీఆర్ఎస్, వైసీపీలు తమ ఉనికిని కాపాడుకోవడం కష్టతరమే. కుటుంబాల్లోని చిచ్చు.. రాజకీయంగా ప్రత్యర్థులకు పెరటిలో పండగలా మారుతుందనడంలో సందేహం లేదు.

# మహిళలను వంచించిన బీజేపీ

హైదరాబాద్ డీలిమిటేషన్ బిల్లుతో మహిళా బిల్లును కలపడంతోనే లోక్ సభలో వీగిపోయింది. బీజేపీ మహిళలను వంచించిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. 2027 సెన్సెస్ లో ఓబీసీలను లెక్కించి ఆ లెక్కల ఆధారంగా మహిళా రిజర్వేషన్లు కల్పించాలి. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని మరోసారి నిరూపితం అయ్యింది. ప్రతిపక్షాలు అడ్డుకుంటాయనే స్పష్టమైన అవగాహన ఉన్నప్పటికీ బీజేపీ కుట్ర పూరితంగా రెండు బిల్లులను కలిపి పార్లమెంట్ ముందుకు తీసుకువచ్చింది. మహిళా కోటా బిల్లుతో డెలిమిటేషన్ బిల్లును ముడి పెట్టడంతో ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి లోక్ సభలో బిల్లు వీగిపోయేలా చేశాయని అన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ ఈ ప్రయత్నం చేసింది.. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభం అప్పుడే మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టీ పాస్ చేసి దానిని సెన్సెస్ కు లింక్ చేశారు. ఇప్పుడు 2011 సెన్సెస్ అధారంగా మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశ పెడుతున్నట్టు చెప్పి మరోసారి వంచించింది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ఆడబిడ్డలు బీజేపీ మోసాన్ని గుర్తించండని ఆమె అన్నారు.

# ఏసీబీ వలలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్



కామారెడ్డిలో రూ. 2 లక్షల లంచం తీసుకుంటుండగా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ను ఏసీబీ అదుపులోకి తీసుకుంది. కామారెడ్డి జిల్లా బిచ్కుందలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ ప్రొహిబిషన్ ,,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, సత్యనారాయణ 2 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఫిర్యాదిదారుడి నుండి లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా బిచ్కుందలోని తన అద్దె నివాసంలో పట్టుబడ్డాడు, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి
## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్ర విమర్శలు

హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావును శనివారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. సీఎం నివాసాన్ని ముట్టడించేందుకు వెళ్లకుండా ఆయన నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో మహిళల గొంతు నొక్కారని, రాష్ట్రంలో తమ నిరసనలను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని ఆయన అన్నారు. 2023లో ఈ బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్, ఇప్పుడు వ్యతిరేకంగా ఓటు వేయడం వారి నిజ స్వరూపాన్ని బయటపెడుతుందని విమర్శించారు.మహిళల సాధికారతపై మాటల్లో మద్దతు ఇచ్చి, ఆచరణలో అడ్డుకోవడం కాంగ్రెస్ విధానమని ఆయన పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే సామాన్య మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు పెరుగుతాయని, అయితే కుటుంబాధిపత్య రాజకీయాలు చేసే కాంగ్రెస్‌కు ఇది ఇష్టం లేదని రాంచందర్ రావు ఆరోపించారు. గత 30 ఏళ్లుగా మహిళా బిల్లును వాయిదా వేస్తూ వస్తోందని కూడా విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తూ, మహిళల హక్కులను అడ్డుకున్న కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించరని అన్నారు.

# పాకిస్తాన్ లో రోజు ధురంధర్ సినిమానే...

లాహోర్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్) ఎవరో వస్తున్నారు.. అందరూ చూస్తుండగానే కాల్చి చంపేసి వెళ్తున్నారు. క్షణంలోనే ఇదంతా జరిగిపోతోంది. చనిపోయిన వాళ్ళు అమాయకులు కాదు. గొప్ప గొప్ప మేధావులు అంతకంటే కాదు. వారంతా ఉగ్రవాదులు. వారి నర నరాన ఉగ్రవాదాన్ని జీర్ణించుకున్నవారు.. చాందస తత్వాన్ని ఒంట పట్టించుకున్న వారు.. విద్రోహ చర్యలకు పాల్పడుతూ.. భారతదేశంలో అశాంతిని కలుగజేసిన ముష్కరులు.. అటువంటివారు ఒక్కొక్కరుగా కన్నుమూస్తున్నారు.తదేగా పాకిస్తాన్లో లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన కో ఫౌండర్ అమీర్ హంజా పై పాకిస్తాన్లో కాల్పులు జరిగాయి. దీంతో అతడు కన్నుమూశాడని వార్తలు వచ్చాయి. తీవ్రంగా గాయాలు కావడంతో.. అతడిని ఎక్కడికి తీసుకెళ్లారు.. అతడు ఏమైపోయాడు అనే అంశాలపై ఇంతవరకు క్లారిటీ రాలేదు.. కాకపోతే పాకిస్తాన్లో అమీర్ చాలా సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు. అతనికి అక్కడి ప్రభుత్వం రక్షణ కల్పిస్తోంది. పేరు మోసిన ఉగ్రవాద సంస్థకు సహ వ్యవస్థాపకుడిగా ఉన్న అతడు పాకిస్తాన్లో స్వేచ్ఛగా తలదాచుకోవడం భారత ఆరోపణలకు బలం చేకూర్చుతోంది. పాకిస్తాన్లో ప్రపంచంలో అత్యంత తీవ్రమైన ఉగ్రవాద సంస్థలకు నాయకత్వం వహిస్తున్నవారు నివాసం ఉంటున్నారు. అనేక ఆధారాలతో భారత్ దీనిని నిరూపించినప్పటికీ అమెరికా, చైనా మోకాలడ్డుతున్నాయి.పాకిస్తాన్లో తలదాచుకుంటున్న ఉగ్రవాదులు ఇటీవల కాలంలో వరుసగా కన్నుమూస్తున్నారు. మూడు సంవత్సరాలుగా లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్ బుల్ ముజాహిద్ వంటి ప్రమాదకరమైన గ్రూపులకు సంబంధించిన ఉగ్రవాదులను గుర్తు తెలియని వ్యక్తులు పాకిస్థాన్ లో మట్టుపెట్టారు.. జైషే మహమ్మద్ ఉగ్రవాద గ్రూపుకు చెందిన మహమ్మద్ తాహిర్ అన్వర్, లష్కరే తోయిబా ఉగ్రవాద గ్రూప్నకు చెందిన ఖతల్, కలుస్తాను కమాండో ఫోర్స్ చీఫ్ పరంజిత్ సింగ్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది పాకిస్థాన్ లో కాలగర్భంలో కలిసిపోయారు. ప్రమాదకరమైన ఉగ్రవాదులను అజ్ఞాత వ్యక్తులు చంపుతున్న తీరు చూస్తుంటే అది ముమ్మాటికి దురంధర్ సినిమాను గుర్తు చేస్తోంది. ఆ అజ్ఞాత వ్యక్తులు ఎవరు? వారి వెనుక ఉన్నది ఎవరు? పాకిస్తాన్లో ఎలా ప్రవేశించారు? ఉగ్రవాదులను ఎలా చంపుతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. దాని వెనుక ఉన్నది ఎవరనే విషయాన్ని ప్రముఖంగా వివరించాల్సిన పని కూడా లేదు.ఉగ్రవాదులను ఇలా ఏరి వేయడం వల్ల భారత్ ఊపిరి పీల్చుకుంటున్నది. గతంతో పోల్కి చూస్తే ఉగ్రవాదుల రాకపోకలు తగ్గిపోయాయి. సరిహద్దుల్లో భారత్ అత్యంత కట్టుదిట్టంగా పహారా కాస్తోంది. ఉగ్రవాదుల అలికిడి కనిపిస్తే చాలు మన సైన్యం దాడులు చేస్తోంది. ఏకపక్షంగా దూసుకుపోయి.. మరోసారి భారత్ మీద దాడి చేయాలని ఆలోచనను తుంచేస్తోంది.. ఒకప్పటి మాదిరిగా పాకిస్తాన్ దేశానికి భారత్ భయపడడం లేదు. చర్చల పేరుతో కాలయాపన చేయడం లేదు. గన్నుకు గన్ను.. తూటాకు తూటా.. ప్రాణానికి పదులకొద్ది ప్రాణాలు అనే సూత్రాన్ని అమలు చేస్తోంది. అందువల్లే ఉగ్రవాదుల అసలు రంగు బయటపడుతోంది.

# ప్రాణాలు తీస్తున్న స్లీపర్ బస్సులు

హైదరాబాద్, ఏప్రిల్ 18, హైదరాబాద్ మహానగరంలో నడి రోడ్డుపై స్లీపర్ బస్ తగలబడిపోయింది. ప్రయాణికులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటే కూకట్‌పల్లి-కేపీహెచ్‌బీ రహదారిపై ఈ దుర్ఘటన జరిగింది. ఇది ప్రయాణికులను, స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. ఈ ఘటన కేవలం ఒక ప్రమాదంగానే కాకుండా దేశంలో నడుస్తున్న స్లీపర్ బస్‌ల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. శుక్రవారం రాత్రి మియాపూర్ నుంచి పాలకొల్లుకు బయల్దేరిన శ్రీ దుర్గా మహేశ్వరి ట్రావెల్స్ కు చెందిన ఏసీ స్లీపర్ బస్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కేపీహెచ్‌బీ పరిధిలోని పద్మావతీ ప్లాజా బస్ స్టాప్, మెట్రో పిల్లర్ 734 సమీపంలోకి రాగానే బస్ డ్రైవర్ క్యాబిన్ నుంచి దట్టమైన పొగలు రావడం గమనించాడు. వెంటనే డ్రైవర్, సహాయకుడు అప్రమత్తమయ్యారు. బస్‌ను పక్కకు నిలిపివేసి అందులోని 18 మంది ప్రయాణికులను వెంటనే కిందకు దించేశారు. ప్రయాణికులు కిందకు దిగిన కొద్ది నిమిషాల్లోనే మంటలు బస్ అంతటా వ్యాపించి, వాహనం పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేసినప్పటికీ బస్ పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినప్పటికీ బస్ అస్థిపంజరంలా మారిపోయింది.

ప్రాథమిక సమాచారం మేరకు ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ లేదా ఏసీ యూనిట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలే ఈ ప్రమాదానికి కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా స్లీపర్ బస్‌ల డిజైన్‌పై తీవ్ర విమర్శలు ఉన్నాయి. వీటిని కొన్ని దేశాలు డెత్ బస్‌లుగా అభివర్ణిస్తారు. స్లీపర్ బస్సుల్లో బెర్త్‌ల మధ్య ఉండే గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉంటాయి. ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులు త్వరగా బయటకు రావడానికి వీలుపడదు. సాధారణ బస్సులతో పోలిస్తే స్లీపర్ బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు అందుబాటులో ఉండం తక్కువ. పైగా ఉన్న ఎగ్జిట్‌లు కూడా బెర్త్‌ల వల్ల మూసుకుపోయే అవకాశం ఉంది. కూకట్‌పల్లి ఘటనలో డ్రైవర్ అప్రమత్తమవ్వడం, ప్రయాణికులు మెళకువగా ఉండటం వల్ల పెను ప్రమాదం తప్పింది. కాని గతంలో జరిగిన ప్రమాదాలు చూస్తే ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండటం వల్ల ఏదైనా జరిగితే వెంటనే స్పందించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. పై బెర్త్‌ల నుంచి కిందకు దిగి బయటకు రావడం అత్యవసర సమయంలో కష్టమవుతుంది. భారత్‌లో స్లీపర్ బస్సులు విరివిగా వాడుకలో ఉన్నప్పటికీ అనేక అభివృద్ధి చెందిన దేశాలు వీటిని నిషేధించాయి. చైనా ప్రభుత్వం వీటిని 2012లోనే నిషేధించింది. ఉత్పత్తి, రిజిస్ట్రేషన్లపై పూర్తిగా బ్యాన్ వేశారు. 2012, 2011లో జరిగిన ఘోర ప్రమాదాల్లో దాదాపు 77 మంది చనిపోయారు. దీంతో చైనా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జర్మనీలో కూడా 2006 నుంచి స్లీప్ కోచ్‌లను నిషేధించారు. బస్ కదులుతున్నప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని అక్కడి రూల్. అయితే స్లీపర్ పొజిషన్‌లో అది వీలుపడదని తేలడంతో బ్యాన్ వేశారు యూకేలో 2000 నుంచి నిషేధం ఉంది. కేవలం కొన్ని ప్రత్యేక టూరిస్ట్ కోచ్‌లకు మాత్రమే పరిమిత అనుమతి ఉంది. వియత్నాంలో పూర్తిగా నిషేధం లేకపోయినా కొండ ప్రాంతాల్లో, కొన్ని ప్రధాన హైవేలపై స్లీపర్ బస్‌ల రాకపోకలపై కఠిన ఆంక్షలు విధించారు. భారత్‌లో చాలా ప్రాంతాల్లో స్లీపర్ బస్‌లు ప్రమాదాల బారిన పడుతున్నాయి. రోజూ ఏదో ప్రాంతంలో స్లీపర్ బస్‌లు ప్రమాదానికి గురి అవుతున్న వార్తలు చూస్తున్నాం. మేజర్ యాక్సిడెంట్ జరిగినప్పుడు అధికారులు, ప్రభుత్వాలు హడావిడి చేయడమే తప్ప వాటిపై సీరియస్‌గా చర్యలు తీసుకున్న ఒక్క ఘటన కూడా లేదు. దీంతో ఉల్లంఘనలు, ప్రమాదాలు సర్వసాధారణమైపోయాయి. పీహెచ్‌బీ ఘటనలో 18 మంది ప్రాణాలతో బయటపడటం కేవలం డ్రైవర్ సమయస్ఫూర్తి వల్ల జరిగిన అదృష్టం మాత్రమే. కానీ ప్రతి సారీ అదృష్టం తోడు ఉండకపోవచ్చు. అందుకే ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని సరైన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అమరనాథ్ రిజిస్ట్రేషన్ షురూ...

శ్రీనగర్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్) దేశంలోని అత్యంత ముఖ్యమైన మతపరమైన యాత్రలలో ఒకటైన పవిత్ర అమర్‌నాథ్ యాత్ర 2026 కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏప్రిల్ 15న ప్రారంభమైంది. ఈ సంవత్సరం ఈ యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 28 వరకు 57 రోజుల పాటు కొనసాగుతుంది. యాత్ర విజయవంతంగా, సురక్షితంగా జరిగేలా చూసేందుకు, ఈసారి అమర్‌నాథ్ పుణ్యక్షేత్ర బోర్డు పలు ముఖ్యమైన ఏర్పాట్లు, మార్గదర్శకాలను జారీ చేసింది. రిజిస్ట్రేషన్ జరిగిన మొదటి రోజే బ్యాంకుల వద్ద పొడవైన క్యూలు కనిపించాయి.ప్రతి సంవత్సరం లక్షలాదిభక్తులు శివ దర్శనం కోసం ఈ కఠినమైన పర్వత యాత్రను చేపడతారు. దీని ఫలితంగా, అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను తప్పనిసరి చేయడంతో పాటు, భద్రత, ఆరోగ్య చర్యలను మరింత కఠినతరం చేశారు. ఈసారి అమర్‌నాథ్ యాత్ర కోసం రెండు సాంప్రదాయ మార్గాలను ఏర్పాటు చేశారు.

మొదటి మార్గం

48 కిలోమీటర్ల పొడవైన నున్వాన్-పహల్గామ్ మార్గం, ఇది పహల్గామ్ గుండా వెళుతుంది . ఈ మార్గం పొడవైనప్పటికీ, ఎత్తు క్రమంగా పెరుగుతూ ఉంటుంది, కాబట్టి దీనిని సాంప్రదాయమైనదిగా, సాపేక్షంగా సురక్షితమైనదిగా పరిగణిస్తారు.

రెండవ మార్గం

దగ్గరి దారి అయినప్పటికీ కష్టతరమైన 14-కిలోమీటర్ల బాల్టాల్ మార్గం, ఇది బాల్టాల్ వద్ద ప్రారంభమవుతుంది. ఈ మార్గం తక్కువ ప్రయాణ సమయాన్ని అందిస్తుంది, కానీ ఇందులో నిటారుగా ఉండే ఎత్తులు , అధిక ప్రమాదం ఉంటాయి.

ఆన్‌లైన్ - ఆఫ్‌లైన్ ఎంపికలు రెండూ అందుబాటులో ఉన్నాయి

భక్తులు అమర్‌నాథ్ పుణ్యక్షేత్ర బోర్డు అధికారిక వెబ్‌సైట్ , మొబైల్ యాప్ ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 550కి పైగా బ్యాంకు శాఖల ద్వారా ఆఫ్‌లైన్ నమోదు సౌకర్యం కూడా అందుబాటులో ఉంది.ఈ బ్యాంకులలో స్టేట్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, యెస్ బ్యాంక్ , జమ్మూ అండ్ కాశ్మీర్ బ్యాంక్ ఉన్నాయి. యాత్రలో పాల్గొనడానికి తప్పనిసరి ఆరోగ్య ధృవీకరణ పత్రం (సిహెచ్‌సి) అవసరం. ఈ ధృవీకరణ పత్రాన్ని అధీకృత వైద్యుడు ఏప్రిల్ 8, 2026న లేదా ఆ తర్వాత జారీ చేయాలి. ఈ కష్టతరమైన ఎత్తైన మార్గంలో ఉన్న ఆరోగ్య ప్రమాదాల దృష్ట్యా ఈ చర్య చాలా అవసరమని నిర్వాహకులు భావిస్తున్నారు. ఇది కాకుండా, ప్రయాణికుల స్థానాన్ని గుర్తించడం ద్వారా వారి భద్రతను నిర్ధారించేందుకు, ప్రతి ప్రయాణికుడికి ఆర్‌ఎఫ్ఐడి కార్డును కూడా తప్పనిసరి చేశారు.

నమోదు రుసుము: ఒక్కొక్కరికి ?150

వయోపరిమితి: 13 నుంచి 70 సంవత్సరాలు

6 వారాల కంటే ఎక్కువ గర్భవతిగా ఉన్న మహిళలు ప్రయాణించడానికి అనుమతి లేదు.

తప్పనిసరి పత్రాలు: అసలు ఫోటో గుర్తింపు కార్డు , వైద్య ధృవీకరణ పత్రం

యాత్ర తేదీకి ఏడు రోజుల ముందు వరకు మాత్రమే నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు స్పష్టం చేశారు. నమోదు చేసుకోని యాత్రికులను ప్రయాణానికి అనుమతించరు.యాత్ర సమయంలో భద్రతా సంస్థలు, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, ఇతర బలగాలను మోహరిస్తారు. ఏవైనా అత్యవసర పరిస్థితులకు తక్షణమే స్పందించేందుకు పర్వత మార్గాల వెంబడి వైద్య బృందాలు, సహాయక బృందాలు, సహాయ కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తారు.2026 అమర్‌నాథ్ యాత్రకు సన్నాహాలు ముమ్మరమయ్యాయి. యాత్రికులకు సౌకర్యాలు మెరుగుపరచడంపై యంత్రాంగం దృష్టి సారిస్తుండగా, భద్రత, ఆరోగ్య ప్రమాణాలను కఠినంగా అమలు చేస్తూ యాత్ర సురక్షితంగా, క్రమబద్ధంగా జరిగేలా చూసేందుకు కూడా కృషి చేస్తోంది. యాత్రికులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అన్ని మార్గదర్శకాలను పాటించాలని సూచించారు.

## లైక్స్ కోసం బైక్ స్టంట్స్.. యువకుడి అరెస్ట్

సోషల్ మీడియాలో లైకుల కోసం ప్రమాదకర బైక్ స్టంట్లు చేసిన యువకుడిపై కంకిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఇడుపుగల్లు, గోశాల పరిసరాల్లో కాలేజీ విద్యార్థులు, చిన్నపిల్లలు వెళ్లే సమయంలో బైక్‌పై విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడు.వాహన నంబర్ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని బైక్‌ను సీజ్ చేశారు.రహదారులపై ఇలాంటి ప్రమాదకర స్టంట్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సందీప్ హెచ్చరించారు.

# బీజేపీని ముంచేస్తున్న సొంత నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 18, తెలంగాణ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదగాలని కలలు కంటున్న భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు బయటి ప్రత్యర్థుల కంటే లోపలి శత్రువులే ఎక్కువయ్యారు. కొత్త రక్తాన్ని ఎక్కించుకుని పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన సమయంలో.. కొందరు నేతలు చేరికలకు బ్రేక్ వేస్తున్నారు. కొత్త వాళ్లు వస్తే తమ ఉనికికి ఎక్కడ ముంపు ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. దీంతో నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి.రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు పగ్గాలు చేపట్టినప్పటి నుండి పార్టీని ఒకతాటిపైకి తెచ్చేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఆయన నిరంతరం జిల్లాల్లో పర్యటిస్తూ, కార్యకర్తలను కలుస్తూ పార్టీలో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో అధ్యక్షుడు పడుతున్న కష్టానికి ఇతర ముఖ్య నాయకుల నుండి ఆశించిన మద్దతు లభించడం లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీని తమ సొంత సంస్థగా భావించి పని చేయాల్సిన అగ్ర నేతలు, కేవలం తమ వ్యక్తిగత అజెండాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, దీనివల్ల సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చర్చించుకుంటున్నాయి.ఏ పార్టీలోనైనా పాత వారు, కొత్తగా వచ్చిన వారి మధ్య చిన్నపాటి ఘర్షణలు సహజం. కానీ తెలంగాణ బీజేపీలో ఈ అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఇతర పార్టీల నుండి వచ్చిన సీనియర్ నేతలకు, పార్టీని నమ్ముకున్న పాత కాపులకు మధ్య సయోధ్య కుదరడం లేదు. బయటకు అందరూ నవ్వుతూ కనిపిస్తున్నా, లోపల మాత్రం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, ఎదుటివారిని తక్కువ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కవరింగ్ రాజకీయాల వల్ల పార్టీ ఎదుగుదల కుంటుపడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణలో రాజకీయ పరిస్థితులు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని భావించి, కాషాయ తీర్థం పుచ్చుకోవాలని భావిస్తున్న పెద్ద తలకాయలు ఇప్పుడు వెనకడుగు వేస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పార్టీలో ఉన్న నేతలేనని తెలుస్తోంది. ఎవరైనా కొత్త నేతలు పార్టీలోకి వస్తామంటే, ప్రస్తుతం ఉన్న నాయకులు వారిని ప్రోత్సహించాల్సింది పోయి, "మాకే దిక్కు లేదు, మమ్మల్ని ఇక్కడ ఎవరూ గౌరవించడం లేదు, మీరు వచ్చి ఏం చేస్తారు?" అంటూ భయపెట్టి నిరుత్సాహపరుస్తున్నారట. ఈ పరిస్థితి వల్ల పార్టీలోకి రావాలనుకున్న వారు పెనం మీద నుంచి పొయ్యిలో పడటం ఎందుకని భావిస్తూ ఇతరప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు.బీజేపీలో నెలకొన్న ఈ వింత పరిస్థితికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఉదాహరణగా నిలుస్తున్నారు. ఆయన బీజేపీలో చేరడం ఖాయమని, కేవలం ముహూర్తం మాత్రమే బాకీ ఉందని పార్టీ నేతలే స్వయంగా ప్రచారం చేశారు. కానీ అనూహ్యంగా ఆయన కమలాన్ని కాదని గులాబీ గూటికి చేరుకున్నారు. ఆయన పార్టీ మారడానికి బీజేపీలోని అంతర్గత కుమ్ములాటలు, నాయకుల మధ్య ఉన్న విభేదాలే ప్రధాన కారణమని ఇప్పుడు పార్టీలో చర్చ మొదలైంది. ఒక సీనియర్ నేతను కూడా పార్టీలోకి ఆహ్వానించి, నిలబెట్టుకోలేని స్థితిలో తెలంగాణ బీజేపీ ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇతర రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని చేర్చుకుని, వారికి ఉన్నత పదవులు ఇచ్చి పార్టీని అధికారంలోకి తెస్తున్న హైకమాండ్ వ్యూ హాలుతెలంగాణలో మాత్రం రివర్స్ అవుతున్నాయి. క్షేత్రస్థాయిలో క్యాడర్ సిద్ధంగా ఉన్నా, నాయకుల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల పార్టీకినష్టంజరుగుతోంది. ఇప్పటికైనా అగ్ర నాయకత్వం జోక్యం చేసుకుని ఈ అంతర్గత విబేధాలను పరిష్కరించకుంటే, అధికారంలోకి రావాలన్న కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# బ్రాహ్మణుల్లోనే కులాంతర వివాహాలు

హైదరాబాద్, ఏప్రిల్ 18, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-2024)లో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. కులాంతర వివాహాలు ఎక్కువగా చేసిన కుటుంబాలలో బ్రాహ్మణులు అత్యధికంగా ఉన్నారని తేలింది. ఆ తర్వాత బీసీ/ఎస్సీ క్రైస్తవులు, రాజులు ఉన్నారు.కాపులు, బ్రాహ్మణులతోపాటు బీసీ-ఏలు కూడా కులాంతర వివాహాలలో ఎక్కువ వాటాతో ఉన్నారు. ఏదేమైనప్పటికీ.. వెలమ, రెడ్డి వంటి అగ్రవర్ణాలు కులాంతర వివాహాల రేటును చాలా తక్కువగా కలిగి ఉన్నాయి. ఇది రాష్ట్ర సగటు కంటే చాలా తక్కువగా ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని ఇండిపెండెంట్ ఎక్స్పర్ట్ వర్కింగ్ గ్రూప్ (ఐఈడబ్ల్యూజీ) తెలిపింది.కులాంతర వివాహాలు సామాజిక అడ్డంకులను బలహీనపరుస్తాయి. పెరుగుతున్న సామాజిక చలనశీలతను సూచిస్తాయి, ముఖ్యంగా వ్యక్తిగత ఏజెన్సీ పరంగా, మహిళలు తమ భాగస్వాములను ఎన్నుకోవడంలో ఎక్కువ స్వేచ్ఛను ఉపయోగిస్తున్నారు.కులాంతర వివాహాలతో బ్రాహ్మణులు అత్యధికంగా (12 శాతం), బీసీ-సీ, ఎస్సీ క్రైస్తవులు (9.9 శాతం), రాజులు (8.7 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అగ్రవర్ణాల్లో వధువుల కొరతతోనే కులాంతర వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిసింది. కులాంతర వివాహాల ప్రాబల్యం సమాజం గురించి కూడా చర్చకు దారితీస్తోంది. అధిక పట్టణీకరణ, విద్య కూడా కులాంతర వివాహాలు చేసుకోవడానికి ఓ కారణంగా ఉన్నాయి.కులాంతర వివాహాలకు ఒక ముఖ్యమైన అంశం పట్టణ నివాసం కావచ్చు అని నిపుణులు చెబుతున్నారు. 90 శాతం మంది బ్రాహ్మణులు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని వెల్లడైంది. దీంతో వివాహంలో కుల అడ్డంకులను పెద్దగా పట్టించుకోవడం లేదు.మరోవైపు ఎస్టీ కోలాం(2.6 శాతం), బీసీ-డీ మాలి (2.6 శాతం), ఎస్టీ గోండులు (2.8 శాతం) వంటి కులాలు కులాంతర వివాహాలలో అతి తక్కువ వాటా కలిగి ఉన్నాయి. అయితే దీనికి కూడా పలు కారణాలు ఉన్నాయి. అందుకే కులాంతర వివాహాలకు సంబంధించి వీరు ప్రభావితం అవుతున్నారు. భౌగోళికంగా ఒంటరితనం, పట్టణాలకు దూరంగా ఉండటం, సాంప్రదాయ నిబంధనలకు కట్టుబడి ఉండటం దీనికి కారణమని తెలిపింది. రెడ్డీలు, వెలామాలతో సహా భూ యాజమాన్యంలోని ఫార్వర్డ్ కులాల మధ్య కులాంతర వివాహాల తక్కువగానే జరుగుతున్నాయి. ఆర్థిక పురోగతి, పట్టణీకరణ కొంతమందికి వివాహంలో కుల అడ్డంకులను తొలగిస్తున్నాయి. అయితే కొన్ని కులాల్లో లోతుగా పాతుకుపోయిన ఆలోచనలు, ఇతర కారణాలతో కులాంతర వివాహాలు చేసుకోవడం లేదు. 2024-25లో తెలంగాణ సామాజిక-ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల (ఎస్ఈఈఈపీసీ) సర్వే-2024 నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 15న ఈ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో విడుదల చేసింది

# రేవంత్... నేషనల్ స్ట్రాటజిస్ట్..

హైదరాబాద్, ఏప్రిల్ 18, ఒకప్పుడు కాంగ్రెస్ అంటే ఢిల్లీ నుండి వచ్చే ఆదేశాల కోసం రాష్ట్ర నేతలు వేచి చూసే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చే సలహాలు, ఆయన రూపొందించే వ్యూహాలు ఇప్పుడు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కి దిక్సూచిగా మారుతున్నాయి. కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే వంటి అగ్రనేతలకు నమ్మకమైన 'నేషనల్ స్ట్రాటజిస్ట్'గా రేవంత్ రెడ్డి ఎదిగిన తీరు ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.రాజకీయాల్లో ప్రత్యర్థి వేసే ఎత్తుగడలకు ప్రతిస్పందించడం ఒక ఎత్తు అయితే, ప్రత్యర్థిని తన దారిలోకి తెచ్చుకోవడం మరో ఎత్తు. రేవంత్ రెడ్డి సరిగ్గా ఇదే చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో "బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుంది" అనే నినాదాన్ని ఆయన క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లారు. ఈ ఒక్క వ్యూహం దేశవ్యాప్తంగా బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది. రాజ్యాంగ రక్షణ, సామాజిక న్యాయం వంటి అంశాలను కాంగ్రెస్ ప్రధాన ఎజెండాగా మార్చడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, దూకుడుతో కూడిన ఎజెండాను సెట్ చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు.నియోజకవర్గాల పునర్విభజన అంశం ప్రస్తుతం ఉత్తరాది ? దక్షిణాది రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతోంది. జనాభా నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గుతాయన్న ఆందోళనలో రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్ మోడల్'ను తెరపైకి తెచ్చారు. ఉత్తరాది రాష్ట్రాలకు కోపం రాకుండా, అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు గండి పడకుండా ఆయన ప్రతిపాదించిన ఈ వినూత్న ఫార్ములా ఇప్పుడు కాంగ్రెస్ అధికారిక విధానంగా మారుతోంది. సంక్లిష్టమైన సమస్యలకు సరళమైన, ఆమోదయోగ్యమైన పరిష్కారాలు చూపడం ద్వారా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఒక 'థింక్ ట్యాంక్'గా మారారు.రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో 'స్టార్ క్యాంపెయినర్'గా దూసుకుపోతున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక వంటి కీలక విషయాల్లో రేవంత్ చొరవ చూపడం ఆయన స్థాయికి నిదర్శనం. గతంలో అహ్మద్ పటేల్ వంటి నేతలు పోషించిన వ్యూహాత్మక పాత్రను రేవంత్ రెడ్డి భర్తీ చేస్తున్నారనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. దక్షిణ భారతదేశంలో బీజేపీని నిలువరించాలంటే రేవంత్ లాంటి దూకుడున్న నేత అవసరమని ఏఐసీసీ గట్టిగా నమ్ముతోంది.ప్రస్తుతం రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో ఒక స్వర్ణయుగం నడుస్తోంది. అటు రాష్ట్రంలో తిరుగులేని నాయకుడిగా పాలన సాగిస్తూనే, ఇటు కేంద్రంలో మోదీ సర్కార్‌ను సూటిగా ప్రశ్నించే గొంతుకగా మారారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన కేవలం ఒక ముఖ్యమంత్రి మాత్రమే కాదు, రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల్లో భారీ మార్పులకు శ్రీకారం చుట్టే ఒక బలమైన 'పొలిటికల్ అస్సెట్'. రేవంత్ రెడ్డి రూపొందిస్తున్న ఈ 'తెలంగాణ మోడల్' వ్యూహాలు రేపు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పూర్వవైభవానికి పునాది వేస్తాయనడంలో సందేహం లేదు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్- నిలిచిపోయిన రిటర్న్స్.. రీసేల్ మార్కెట్ వెలవెల!

హైదరాబాద్, ఏప్రిల్ 18, హైదరాబాద్ నగరం నలుమూలలా ఇప్పుడు ఆకాశహర్మ్యాలే కనిపిస్తున్నాయి. అపరిమితమైన ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ సౌలభ్యంతో బిల్డర్లు 40-50 అంతస్తుల మేర భవనాలను నిర్మిస్తున్నారు. అయితే, పైకి చూడముచ్చటగా కనిపిస్తున్న ఈ భవనాల వెనుక ధరలు, అయోమయ మౌలిక వసతులు దాగున్నాయనే చర్చ మొదలైంది.హైదరాబాద్‌లో రూ. 2 కోట్ల పైబడిన ఫ్లాట్ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ ఈ ధరలకు కేంద్రబిందువుగా మారింది. అయితే కొత్త లాంచ్‌లలో ఉన్న జోరు రీసేల్ మార్కెట్‌లో లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత వంటివి ఇన్వెస్టర్లను, గృహ కొనుగోలుదారులను కలవరపెడుతున్నాయి. 2026 మొదటి త్రైమాసికంలో కొత్త ప్రాజెక్టుల లాంచ్‌లు ఏకంగా 46శాతం పడిపోవడం మార్కెట్ మందగమనానికి సంకేతంగా కనిపిస్తోంది.ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా, ముఖ్యంగా రెడిట్ వంటి ప్లాట్‌ఫారమ్స్‌లో నెటిజన్లు లేవనెత్తుతున్న ప్రశ్నలు ఇన్వెస్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. "హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో చదరపు అడుగుకు రూ. 8,000 నుంచి రూ. 12,000 వసూలు చేస్తున్నారు. కానీ, వర్షం వస్తే ఆ రోడ్లపై నడవగలమా? డ్రైనేజీ వ్యవస్థ ఉందా? కనీసం తాగునీటి సరఫరా ఉందా?" అని కొనుగోలుదారులు నిలదీస్తున్నారు.పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో సుమారు 20,000కు పైగా లగ్జరీ యూనిట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. ఈ భారీ భవనాల్లో వేల సంఖ్యలో కుటుంబాలు చేరితే, ఇప్పటికే ఊపిరాడని ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ఆ ప్రాంత మౌలిక వసతులు ఆ భారాన్ని మోయగలవా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. సరైన రోడ్లు, డ్రైనేజీ లేని చోట రూ. 2 కోట్లు పోసి ఫ్లాట్ కొనడం 'లగ్జరీ' అనిపించుకుంటుందా లేక 'నరకం' అవుతుందా అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.రియల్ ఎస్టేట్ రంగంలో ఎప్పుడైనా రీసేల్ మార్కెట్ బలంగా ఉంటేనే ఆ రంగం ఆరోగ్యంగా ఉన్నట్టు లెక్క అని నిపుణులు చెబుతుంటారు.కానీ హైదరాబాద్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది.: మూడేళ్ల క్రితం ఒక కోటి రూపాయలు పెట్టి కొన్న ఫ్లాట్, ఈరోజు అమ్మాలంటే కొనేవారే లేరు! ఒకవేళ ఉన్నా, కొన్న ధరకే అడగడం లేదా అంతకంటే తక్కువకు బేరం చేయడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

బ్యాంకు వడ్డీలు కలుపుకుంటే, మూడేళ్ల తర్వాత ఆ ఆస్తి విలువ పెరగకపోగా, ఇన్వెస్టర్లు నికరంగా నష్టపోతున్నారు. "మా స్నేహితుడు పెట్టుబడి కోసం లగ్జరీ అపార్ట్‌మెంట్ కొన్నాడు, ఇప్పుడు బయటపడలేకపోతున్నాడు," అని ఒక బాధితుడు పేర్కొన్నాడు.నివాస యోగ్యం కాని ప్రాంతాలు: భారీ నిర్మాణాల వల్ల వచ్చే దుమ్ము, తక్కువ జనాభా వంటి కారణాలతో కొత్త కమ్యూనిటీలు కేవలం పేరుకే 'హైటెక్'గా మిగిలిపోతున్నాయని, పాత నగరంలో ఉన్న సౌకర్యం, అనుబంధం ఇక్కడ లేవని కొందరు అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్? రియల్? ఎస్టేట్- అసలు ఈ డిమాండ్‌ను నడిపిస్తోంది ఎవరు?

ధరలు ఇంతలా ఉన్నా, కొత్త లాంచ్‌లలో బుకింగ్స్ జరుగుతున్నాయని బిల్డర్లు చెబుతున్నారు. దీని వెనుక ప్రధానంగా మూడు శక్తులు ఉన్నాయి:ఐటీ రంగంలోని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, భారీగా ఈ-సాప్స్ పొందిన టెక్కీలు ఆఫీసులకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో ఈ భారీ ధరలకు వెనకాడటం లేదు.: డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం ప్రవాస భారతీయులకు కలిసి వస్తోంది. వారు హైదరాబాద్‌ను ఒక సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ జోన్‌గా చూస్తున్నారు.: తెలంగాణలో భూముల ధరలు పెరగడంతో, తమ ఊర్లలో భూములు అమ్మిన వారు ఆ డబ్బును నగరంలోని లగ్జరీ ఫ్లాట్లపై పెడుతున్నారు.: బిల్డర్లు ఎక్కువ అంతస్తులు కట్టే అవకాశం ఉండటంతో క్లబ్‌హౌస్‌లు, గ్రీన్ స్పేస్‌లు వంటి సౌకర్యాలతో ప్రాజెక్టులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

2026 మొదటి త్రైమాసికం: ఒక హెచ్చరిక!

నోబ్రోకర్ నివేదిక ప్రకారం, 2026 క్యూ1లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ భారీ కరెక్షన్‌ను చూసింది. నివాస గృహాల లాంచ్‌లు ఏకంగా 46% పడిపోయాయి. గతంలో నెలకు వేల సంఖ్యలో కొత్త యూనిట్లు మార్కెట్?లోకి వచ్చేవి, కానీ మార్చి నెలలో కొత్త సరఫరా దాదాపు శూన్యం.హైదరాబాద్‌లో 80శాతం కంటే ఎక్కువ ఫ్లాట్లు 3బీహెచ్?కే లేదా అంతకంటే పెద్దవి మాత్రమే ఉంటున్నాయి. సగటు ఫ్లాట్ సైజు 2,050 చదరపు అడుగులుగా ఉంది. సామాన్య మధ్యతరగతి వ్యక్తికి అవసరమైన 2బీహెచ్?కే లేదా చిన్న ఫ్లాట్లు మార్కెట్ నుంచి మాయమైపోతున్నాయి. దీనివల్ల దాదాపు 84% మంది కొనుగోలుదారులు "అఫర్డబిలిటీ స్ట్రెస్" (ధర భరించలేకపోవడం) ఎదుర్కొంటున్నారు.

హైదరాబాద్? రియల్? ఎస్టేట్- భవిష్యత్తు ఏంటి?

అపరిమిత ఎఫ్?ఎస్?ఐ అనేది ఒక వరంలా కనిపించినా, అది నిర్మాణ వ్యయాన్ని కూడా విపరీతంగా పెంచేస్తోంది. ఆకాశహర్మ్యాలు కట్టాలంటే కావాల్సిన ఇంజనీరింగ్ టెక్నాలజీ, సేఫ్టీ సిస్టమ్స్ వల్ల బిల్డర్లపై భారం పడుతోంది. అది తిరిగి కస్టమర్ల మీదనే పడుతోంది. మౌలిక వసతులు మెరుగుపడకుండా కేవలం భవనాలు మాత్రమే పెరిగితే, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ బబుల్ పేలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కమలం గూటికి మల్లారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 18, తెలంగాణ రాజకీయాల్లో ఆయన ఒక సంచలనం. టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కానీ రేవంత్‌రెడ్డితో ఉన్న విభేదాల కారణంగా చేరిక జరగలేదు. ఇప్పటికే ఆయన ఎవరో అర్థమై ఉంటుంది కదూ.. హా ఆయనే.. పూలమ్మిన.. పాలమ్మిన.. స్కూల్ పెట్టిన.. కాలేజీలు పెట్టిన.. ఎంపీగ గెలిచిన.. ఎమ్మెల్యేగ గెలిచిన.. మంత్రి అయినా అంటూ తన వాక్‌చాతుర్యం, బాడీ లాంగ్వేజ్‌తో ఆకట్టుకునే మల్లారెడ్డి. ప్రస్తుతం అధికారంలో లేరు. దీంతో సైలెంట్ అయ్యారు. అయితే ఇటీవల ఆయన కోడలు, మల్లారెడ్డి విద్యాసంస్థల కో చైర్‌పర్సన్ ప్రీతిరెడ్డి యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇటు సోషల్ మీడియాలో, అటు రాజకీయాల్లో ఆమె ప్రముఖంగా వినిపిస్తున్నారు. ఈ క్రమంలో మల్లారెడ్డి ప్రధాని మోదీతో భేటీకావడం ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశమైంది.ప్రీతిరెడ్డి గతంలోనే ఎంపీ పదవి కోసం ఆసక్తి చూపారు. బండి సంజయ్‌ను ఆమె కలవడం, స్వయంగా పార్లమెంటరీ స్థానం కోరుకుంటున్నట్టు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ గుర్తులోకి వచ్చాయి. మల్లారెడ్డి ఈ సమావేశంలో ప్రధానిని ఆమె పక్షాన కోరుతూ మధ్యవర్తిగా వ్యవహరించారా? ఇది ఒక వైపు లాభదాయకమైన రాజకీయ కుట్రగా కనిపిస్తోంది.ఈ భేటీ ఫలితంగా ప్రీతికి టికెట్ దక్కితే, మల్లారెడ్డి కూడా బీజేపీలో చేరే అవకాశం ఉందా? బీఆర్ఎస్‌లో ఇప్పటికే భిన్నాభిప్రాయాలు తలెత్తుతున్న నేపథ్యంలో, ఇది పార్టీ మార్పు సూచనగా కనిపిస్తుంది. బీజేపీ తెలంగాణలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలనుకుంటే, స్థానిక నాయకులను ఆకర్షించడం సహజం. అయితే, ఇది బీఆర్ఎస్‌కు మరో షాక్‌గా మారవచ్చు.ఈ సంఘటన తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. కుటుంబ ఆధారిత రాజకీయాలు ఎప్పుడూ వివాదాస్పదం. బీజేపీ ఎమ్మెల్యేలను, ఎంపీలను పెంచుకోవడం ద్వారా తన పట్టుకు బలం చేకూర్చుకుంటుందా? రానున్న రోజుల్లో ఈ చర్చలు మరింత ఉద్ధృతమవుతాయి.

# మార్కెట్ లో మ్యాంగో హవా



రంగారెడ్డి, ఏప్రిల్ 18, పండ్లకు రారాజు అయినా మామిడి సీజన్ వచ్చింది. మార్కెట్ లో మ్యాంగో హవా మొదలైంది. హైదరాబాద్ శివారు ప్రాంతమైన బాటసింగారంలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్కు మామిడి కాయల రాక క్రమంగా పెరుగుతూ ఉంది రాష్ట్రంలో అతిపెద్ద పండ్ల మార్కెట్ కావడంతో రైతులు, వర్తకులు, చిరు వ్యాపారులు, వినియోగదారులతో సందడి వాతావరణం నెలకొంది.ఈ ఏడాది ధరలు కొంత ఆశాజనకంగా ఉండటంతో క్రయ, విక్రయాలు ఊపందుకుంటున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్ లో మామిడి క్రయ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. బాటసింగారం మార్కెట్ లో మామిడి కుప్పలతో నిండిపోయాయి. ఆంధ్రప్రదేశ్ కర్ణాటక, తెలంగాణలోని అల్లాపూర్, గద్వాల్, రంగారెడ్డి నల్గొండ, వరంగల్, సూర్యాపేట్, మహబూబ్నగర్, తిమ్మాజీపేట్, కరీంనగర్, వికారాబాద్, అనంతపూర్, పరిగి, వనపర్తి, యాదగిరిగుట్ట, అంకిరావుపల్లి, చారకొండ తదితర ప్రాంతాల నుంచి మామిడి లోడ్లతో లారీలు, గూడ్స్ వాహనాలు, ఆటో ట్రాలీలు పండ్ల మార్కెట్ కు తరలివస్తున్నాయి. ఇప్పటివరకు సుమారు 2,48, 219 క్వింటాళ్లు దిగుమతులు ఎగుమతులు జరిగాయి. నాణ్యతనుబట్టి టన్నుకు సగటున రూ.30 వేల నుంచి రూ.40 వేల ధర పలు కుతోంది. మంచి రకాలకు క్వింటా 1 లక్ష పలుకుతుంది. మార్కెట్ కు వచ్చిన మామిడిని రాజస్థాన్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు.బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కు ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బెనిషాన్, తోతా పూరి, హిమాయత్, నాతి, పెద్ద రసాలు, చిన్న రసాలు, సుందరి, మల్లిక, కేసరి, దాసేరి, అప్పుసా తదితర రకాల మామిడి పండ్లు దిగుమతి అవుతున్నట్లు అధికారులు తెలిపారు. వీటిల్లో అత్య ధిక ధర హిమాయత్ రకం కిలో రూ.200 ధర పలు కుతుండగా, అత్యల్పంగా నాటి రకం కిలో రూ.8-14 ధర పలుకుతోంది. వీటిలో చెట్టుపైనే కవర్ కట్టిన పండ్లకు అధిక డిమాండ్ ఉండడంతో పాటు ధర కూడా టన్నుకు రూ. లక్ష వరకు పలుకు తోందని అధికారులు పేర్కొంటున్నారు. మార్కెట్ లో క్రయవిక్రయాలు సజావుగా సాగే విధంగా, ఎలాంటి ఇబ్బందులకు లేకుండా ఏర్పాట్లు చేశాం. మార్కెట్ ప్రాంగణంలో మామిడి పండ్లతో వచ్చే వాహనాలు సాఫీగా రాక పోకలు సాగించేలా అంతర్గత రోడ్లు నిర్మించాం. మార్కెట్ లో రైతులు, వ్యాపారులు దాహం తీర్చుకునేందుకు చల్లటి తాగునీటి యంత్రాలు ఏర్పాట్లు చేశాం.మామిడిని ప్యాకింగ్ చేసే క్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు అనుమతులు ఇచ్చిన ప్రకారమే ఇథలిన్ ప్యాకెట్లను మోతాదులో వాడే విధంగా వ్యాపారులకు సూచనలు చేశాం. నిబంధనలను అతిక్రమిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటున్నారు అధికారులు

# అడగంటుతున్న భూ గర్భజలాలు

కరీంనగర్, ఏప్రిల్ 18, వేసవిలో ఎండల తీవ్రత అంతకంతకు పెరుగుతుండగా, కరీంనగర్ జిల్లాలోని నీటివనరులన్నీ నిండుకున్నాయి. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అడుగంటి ఒండ్రు మట్టి తేలితున్నాయి. జిల్లా పరిధిలోని చిన్న, మధ్య తరహా, భారీ ప్రాజెక్టుల్లో కూడా నీటి నిల్వలు అదిగంటుతున్నాయి. ఉక్కపోత, భరించలేని వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూడా నీటిని అదే స్థాయిలో వినియోగిస్తున్నారు.ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడుతోంది. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నా రు. తమ స్థిరాస్తులు, ఆభరణాలు తనాఖా పెడుతూ, అట్టడుగుకు చేరిన నీటిని పైకి తె చ్చేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిమట్టంపై జిల్లా భూగర్భ జలవనరుల శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ ఏడాది మార్చిలో 8.10 మీటర్లు, ఏప్రిల్ లో 9.02 మీటర్ల సగటు నీటిమట్టం నమోదైంది.గత ఏడాది వేసవిలో కూడా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలమట్టంలో మార్పు వచ్చి, కొంతమేర ఉపశమనం కలిగింది. అనంతరం అసలు రెయినీ సీజన్లోనే వర్షా లు ముఖం చాటేయగా, ఎప్పటికప్పుడు భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నా యి. అడపాదడపా వర్షాలు కురిసినా వాటి తో భూగర్భజలాలు పెరగలేదని భూగర్భ జల వనరుల శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో వేసవి తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వరి పంట కు సరిపడా నీరు అందకపోవడంతో పం టలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ బావుల్లో పేరుకుపోయిన మట్టిని క్రేన్ల సహాయంతో తొలగిస్తున్నారు. నీటి నిల్వలు పెరగాలని ఆశిస్తూ పెద్ద మొ త్తంలో ఖర్చు పెట్టి బావులను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా, మరింత నీరు అం దుబాటులోకి రావాలనే ఉద్దేశంతో బావుల పక్కనే సైడ్ బోర్లు కూడా వేయిస్తున్నారు.కరీంనగర్ ఎల్ఎండీ సామర్థ్యం 24.034 టి ఎంబిసీ లు కాగా జలాశయంలో నీటి నిల్వలు 6.9 టీఎంసీలకు పడిపోవడంతో నగరంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో ప్రతిరోజూ 55 ఎంఎల్డీల నీటిని సరఫరా చేసిన నగరపాలక సంస్థ, రెండు రోజులకు ఒకసారి సరఫరా చేసేందుకు సిద్ధం అవుతుంది ఎంఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మిడ్ మానేరు నుంచి ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

# గ్యాస్ ఏజెన్సీల దందా...

వరంగల్, ఏప్రిల్ 18, హనుమకొండ జిల్లాలో గ్యాస్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు సామాన్య ప్రజలకు, చిరు వ్యాపారులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆన్లైన్ బుకింగ్ పేరుతో జాప్యం చేస్తూ.. మరోవైపు అధిక ధరలకు బ్లాక్లో సిలిండర్లను విక్రయిస్తూ ఏజెన్సీలు కాసుల వేటలో పడ్డాయనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఫలితంగా, దోపిడీ పర్వం యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయిగ్యాస్ కొరత కారణంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొంతకాలం గడువు విధిస్తూ ఆన్లైన్ బుకింగ్ విధానం వినియోగదారులకు సౌకర్యంగా ఉండాల్సింది పోయి, ఇబ్బందుల పాలయ్యేలా చేస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక సిలిండర్ బుక్ చేస్తే అది ఇంటికి చేరడానికి 20 రోజులకు పైగా సమయం పడుతోందని, దీనివల్ల సామాన్యులు కట్టెల పొయ్యి వైపు చూడాల్సిన పరిస్థితి తలెత్తుతుందని చెబుతున్నారు. వెంటనే ఈ ఆన్లైన్ విధానాన్ని పక్కన పెట్టి, పాత పద్ధతిలోనే ఇంటింటికీ సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.కొన్ని ఏజెన్సీలు, డెలివరీ బాయ్ లు అనుసరిస్తున్న కొత్త తరహా మోసం వినియోగదారులను విస్మయానికి గురిచేస్తోంది. గ్యాస్ పంపిణీ చేయకముందే వినియోగదారుల వద్ద నుంచి రకరకాల సాకులతో ఓటిపిలను సేకరిస్తున్నారు. సాఫ్ట్వేర్లో డెలివరీ అయినట్లు చూపిస్తూ.. ఆ సిలిండర్లను బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.వంట గ్యాస్ ధర అధికారికంగా రవాణా చార్జీలతో కలిపి 1000 ఉండగా, బ్లాక్లో రూ. 2 వేలకు విక్రయిస్తున్నారని, ఇక ఇదే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 1850 ఉండగా, ఏకంగా 3వేలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్యాస్ ధరల సెగ హోటల్ యజమానులకు, బజ్జీల బండి వ్యాపారులకు గట్టిగా తగులుతోంది. కమర్షియల్ గ్యాస్ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరడంతో వ్యాపారాలు సాగించడం భారంగా మారింది. పోనీ కట్టెల పొయ్యి మీద వంట చేద్దామన్నా.. కట్టెల ధరలు కూడా వేలల్లో ఉండటంతో 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' చందంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా, పౌరసరఫరాల శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్న గ్యాస్ ఏజెన్సీల గోదాములపై దాడులు నిర్వహించి, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గృహ, వాణిజ్య వినియోగదారులు కోరుతున్నారు.గ్యాస్ పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై సివిల్ సప్లై డిటి సదానందం స్పందిస్తూ.. వినియోగదారుల వద్ద నుంచి ముందస్తుగా ఓటిపిలు సేకరించడం, సిలిండర్లను బ్లాక్ మార్కెట్కు తరలించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా గ్యాస్ ఏజెన్స

## పేకాట శిబిరం పై పోలీసుల దాడి.

## నలుగురు మహిళలు సహా ఆరుగురి అరెస్ట్



పెడన: గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ ఘటన కృష్ణా జిల్లా పెడన పట్టణ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక గృహ సముదాయాల మధ్య కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు అందిన ముందస్తు సమాచారంతో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు.ఈ దాడిలో నలుగురు మహిళలతో పాటు ఇద్దరు పురుషులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 47,750 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ బషీర్ తెలిపారు. పట్టుబడిన వారు భారీ మొత్తంలో జూదం ఆడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. పట్టణంలో ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్.ఐ హెచ్చరించారు

## బీజేపీ రాష్ట్ర అద్యక్షుడి గృహ నిర్బంధం



హైదరాబాద్ హైదరాబాద్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసారు. మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్పై పోరుకు బీజేపీ సిద్ధమయింది. దాంతో ముందు జాగ్రత్తగా బీజేపీ నేతలను గృహనిర్బంధం చేస్తున్నారు. సీఎం నివాసం ముట్టడికి పిలుపునిచ్చిన రాంచందర్ రావును తార్నాక లోని అయన ఇంటి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్ను వదిలిపెట్టమని గృహనిర్బంధంలో రాంచందర్ రావు హెచ్చరించారు.

## పవన్ కల్యాణ్ ట్వీట్‌కు ప్రకాశ్ రాజ్ కౌంటర్..

## చర్చకు సిద్ధమా అంటూ చాలెంజ్

అమరావతి: 131వ రాజ్యాంగ సవరణ బిల్లు శుక్రవారం లోక్‌సభలో వీగిపోవడంపై దేశవ్యాప్తంగా రాజకీయంగా సంచలనంగా మారింది. ఈ పరిణామంపై ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ట్వీట్ పై ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ స్పందించారు. 'భారత చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం పెంచే చారిత్రాత్మక అవకాశాన్ని విపక్షాలు కావాలనే అడ్డుకున్నాయి. దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే, మహిళా సాధికారతకు బాటలు వేసే సంస్కరణలకు మద్దతు ఇచ్చే ఉద్దేశం విపక్షాలకు లేదు' అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టుపై ప్రకాశ్ రాజ్ అదే ఎక్స్ వేదికగా శనివారం రియాక్ట్ అవుతూ.. 'దయచేసి మోదీని సంతోషపెట్టడం కోసం ప్రజలను తప్పుదోవ పట్టించడం ఆపండి. మహిళా రిజర్వేషన్ బిల్లు 2023లోనే ఆమోదం పొందింది. దాన్ని ఇప్పటికైనా అమలు చేయవచ్చు. కానీ మీ గ్యాంగ్ దక్షిణ భారత రాష్ట్రాల, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యాన్ని బలహీనపరిచే డీలిమిటేషన్ బిల్లును తీసుకురావాలని చూస్తోంది. మిమ్మల్ని డిప్యూటీ ముఖ్యమంత్రిని చేసిన ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవాన్ని, రాష్ట్ర హక్కులను తాకట్టు పెట్టవద్దు' అని పోస్టు చేశారు. ఈ విషయాన్ని వివరించడానికి నేను చర్చకు సిద్ధంగా ఉన్నానని మరి మీరు సిద్దమా అని ప్రశ్నించారు.

## లోకేష్ ముఖ్యమంత్రి అవుతారు

ఒంగోలు రాబోయే రోజుల్లో కూటమి భాగస్వామ్యంతో నారా లోకేశ్ ముఖ్యమంత్రి అవుతారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి సమస్యపై లోకేశ్‌కు పూర్తి అవగాహన ఉందని ఆయన స్పష్టం చేశారు. ఒంగోలులో మెప్మా ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఎగ్ మార్ట్స్ పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం మెప్మా ద్వారా పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు.

## అసెంబ్లీ గేటు ముందు

## బీజేవైఎం అందోళన

హైదరాబాద్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ, తెలంగాణా అసెంబ్లీ గేట్-1 వద్ద బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. గోల్కొండ జిల్లా అధ్యక్షుడు నితిన్ నందకర్ సహా బీజేవైఎం నాయకులు కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది.

# కొండపల్లి మేళా ప్రారంభం

యన్టీఆర్ కొండపల్లి బొమ్మలు, కొండపల్లి కోట అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడనున్నాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హెరిటేజ్ ట్రెక్కింగ్ ద్వారా వినూత్నంగా మేళా ను కలెక్టర్ లక్ష్మీశా, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శనివారం ప్రారంభించారు. కొండపల్లి గ్రామం నుంచి ఖిల్లా పైకి ట్రెక్కింగ్ చేసారు

కలెక్టర్ లక్ష్మీ శా మాట్లాడుతూ కొండపల్లి కోట అభివృద్ధి, పర్యాటకం, వారసత్వ సంపదను కాపాడేలా కార్యక్రమాలు చేపట్టాం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి బొమ్మల కళను కాపాడటం. ఈ హస్తకళాకారులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించేలా ప్రణాళికలు సిద్దం చేశాం. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాలు చేపట్టాం. భవిష్యత్ తరాలకు మన సంస్కృతిని, సంపదను అందించడమే దీని ప్రధాన ఉద్దేశం.. గతంలో ప్రారంభించిన లేజర్ షో వంటి ప్రాజెక్టులను పునఃప్రారంభించి, కోటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఘాట్ రోడ్డు వచ్చిన తర్వాత మూతపడిన పాత నడకదారిని అటవీ శాఖ సహకారంతో పునరుద్ధరిస్తున్నాం. దీనివల్ల పర్యాటకులు ట్రెక్కింగ్ చేసే అవకాశం కలుగుతుంది. రాజధాని ప్రాంతానికి సమీపంలో ఉండటంతో, కొండపల్లి కోటను ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. శని, ఆదివారాల్లో పర్యాటకుల రద్దీకి అనుగుణంగా భద్రత మరియు సౌకర్యాలను కల్పిస్తున్నారు. రోప్వే ఏర్పాటు గురించి కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని అన్నారు.

## భోగసముద్రం చెరువులో శుభ్రత కార్యక్రమం

## పాల్గొన్న మంత్రి సవిత



పెనుకొండ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో "జలం?జీవం" అనే ప్రధాన నినాదంతో "స్వర్ణాంధ్ర?స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం భాగంగా పెనుకొండ మండలంలోని భోగసముద్రం చెరువులో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారుఏ. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని చెరువులోని చెత్తను తొలగించారు. . నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, "జలం ఉంటేనే జీవం ఉంటుంది" అనే భావనను ప్రజల్లో నాటేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. . చెరువులు, కాలువలు శుభ్రంగా ఉంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డివారి మంజునాథ్ తో పాటు నాయకులు,అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి స్వచ్ఛాంధ్ర?స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు, యువత పాల్గొని శుభ్రతకు తమ మద్దతు తెలిపారు..

## గన్నవరంలో హజ్ యాత్రను ప్రారంభించిన మంత్రి

## కొల్లు రవీంద్ర

**మైనార్టీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది**

**పవిత్ర హజ్ యాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉంది**

**పచ్చ జెండా ఊపి హజ్ యాత్రను ప్రారంభించిన మంత్రులు కొల్లు రవీంద్ర, ఎన్ఎండీ ఫరూఖ్**

ముస్లిం మైనార్టీ సోదరులు అత్యంత పవిత్రంగా భావిస్తూ, జీవితంలో ఒక్కసారైనా వెళ్లాలని కోరుకునే హజ్ యాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడ విమానాశ్రయం నుండి ఈ రోజు హజ్ యాత్రకు బయల్దేరుతున్న ముస్లిం మైనార్టీ సోదరులను కలుసుకుని, గన్నవరం ఎస్.ఎం.కన్వెన్షన్లో మైనార్టీ సంక్షేమ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఎన్.ఎం.డి.ఫరూఖ్, ఎమ్మెల్యే నజీర్, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ , నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పచ్చ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావిస్తూ, జీవితంలో ఒక్కసారి అయినా మక్కా వెళ్లాలని కోరుకుంటారు. అలాంటి హజ్ యాత్రను రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించడంతో పాటుగా, అన్ని సదుపాయాలు కల్పించడం ప్రభుత్వానికి మైనార్టీ సోదరుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1987 మంది వెళ్తుండగా, విజయవాడ పరిసర ప్రాంతాల నుండి 353 మంది యాత్రకు వెళ్తుండడం హర్షణీయం. మైనార్టీల పట్ల ప్రభుత్వం ఎప్పుడూ చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. ఇమాం, మౌజంలకు ఆర్థిక సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. త్వరలోనే మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం కూడా అందించబోతున్నాం. అమరావతిలో హజ్ భవనం నిర్మాణం చేస్తాం. ఎన్ని ఇబ్బందులున్నా.. ఎన్ని అవాంతారాలు ఎదురైనా అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్నాం. ప్రభుత్వం చేస్తున్న మంచికి ప్రజల సహకారం కూడా అవసరమని, రాష్ట్ర అభివృద్ధికి అల్లా కృప తోడుగా ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు

## మద్యం దుకాణాలను తనిఖీ చేసిన మంత్రి కొల్లు రవీంద్ర

గుంటూరు నగరంలో గత కొద్దిరోజులుగా మద్యం దుకాణాలపై వస్తున్న కథనాలపై మంత్రి కొల్లు రవీంద్ర స్పందించారు.గుంటూరు నగరంలోని నగరాలు ప్రాంతంలో ఉన్న విజయ శ్రీ వైన్స్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు మద్యం ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాల్లోని మద్యం నాణ్యతను, నిల్వలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నాణ్యమైన మద్యం మాత్రమే విక్రయించాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

## రూ 83 కోట్లతో 706 ఆలయాల నిర్మాణాలు

నెల్లూరు కూటమి పాలనలో నిధుల కొరత లేదని, 83 కోట్లతో రాష్ట్రంలోని 706 ఆలయాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోన బ్రహ్మోత్సవాల సమీక్షలో మంత్రి ఆనం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 679 భజన మందిరాలను మంజూరు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. త్వరలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మూడు సార్లు జరగడం ఆంధ్రులందరికీ గర్వకారణంగా ఉందన్నారు. 5,900 చిన్న ఆలయాల్లో ధూపదీప నైవేద్య ఖర్చుల కింద నెలకు (ఒక్కో ఆలయానికి) రూ.10 వేల చొప్పున రూ.6.17 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. కూటమి పాలనలో గ్రామాల్లోని ఆలయాలకు భక్తుల తాకిడి 70 నుంచి 75 శాతం పెరిగిందని వివరించారు. రాష్ట్రంలో జరిగే బ్రహ్మోత్సవాలకు తనతో పాటు హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కమిటీని సీఎం నియమించారని పేర్కొన్నారు.

## ఏప్రిల్ 25న ఒంటిమిట్టలో

## శ్రీ సీతమ్మవారి జయంతి మహోత్సవం

కడప ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఏప్రిల్ 25వ తేదీన శ్రీ సీతమ్మవారి జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ పర్వదినం సందర్భంగా ఆలయం భక్తి పరవశంతో నిండిపోనుంది.ఈ సందర్భంగా 25వ తేదీ శనివారం ఉదయం 5.30 గంటల నుండి 7.30 గంటల వరకు పలు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. కార్యక్రమాలు ఆలయ ప్రదక్షిణతో ప్రారంభమై, భగవత్ అనుజ్ఞ, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి విశేష ఆరాధన, అమ్మవారికి వసంతిక పూజ, సహస్రనామార్చన భక్తిశ్రద్ధలతో సాగుతాయి.తదనంతరం నివేదన, మహా మంగళహారతి, వేదస్వస్తి, సాత్తుమొర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు.ఈ పుణ్యదినాన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సీతమ్మవారి అనుగ్రహం, కృపాకటాక్షాలను పొందాలని టిటిడి ఆకాంక్షిస్తోంది.

## పెన్నానది తీరాన భక్తి వెలుగులు?

## శ్రీ నారాపుర వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వైభవోత్సవం



తిరుపతి, 2026 ఏప్రిల్ 18 జమ్మలమడుగులో ఏప్రిల్ 30 నుండి మే 10వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలుకడప జిల్లా జమ్మలమడుగులోని శ్రీ నారాపుర వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 30 నుండి మే 10వ తేదీ వరకు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 30న అంకురార్పణంతో ఈ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయి.బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు స్వామివారి వాహనసేవలు జరుగుతాయి. మే 10వ తేదీన సాయంత్రం 6 గంటలకు పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

## జలసంరక్షణ మనందరి బాధ్యత. - ఎమ్మెల్యే ఆరణి.



జల సంరక్షణ మనందరి బాధ్యత అని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం చెన్నారెడ్డి కాలనిలోని కృష్ణమ నాయుడు పుష్కరిణి జలధార - జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించి హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శనివారం రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు జలధార - జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి శనివారం ఒక నినాదంతో ముందుకు వచ్చి ప్రజల్లో శుభ్రతపై చైతన్యం కలిగితున్నామని తెలుప్పారు. ఈ నెల వర్షపు నీటి పరిరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాల పరిరక్షణ పై ప్రజలకు అవగహన కల్పిస్తున్నామని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లో అందరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇండ్లు కూడా శు భ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి మాట్లాడుతూ నీటి పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని, నీరు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ అభివృద్ధి జరిగితుందని తెలిపారు. భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వీటిపై అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కృష్ణమ నాయుడు పుష్కరిణిలో జలధార - జలహారతి కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వేసవిలో నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో పాన్ షాపులు, కిరాణా దుకాణాలలో పోలీసుల తనిఖీలు

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసీ సజ్జనార్ ఆదేశాల మేరకు నగరంలోని పాన్ షాప్ లు, కిరాణాదుకాణాలలో పోలీసులు ఏక కాలంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బ్యాండ్ చేసిన నిషేధితమైన గుట్కా ప్యాకెట్లను సిగరెట్ డబ్బాలతో పాటు మరికొన్ని వస్తువులు అక్రమంగా అమ్ముతుండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.ముఖ్యంగా స్కూల్ సమీపంలో ఉన్న పాన్ షాపులను టార్గెట్ చేసి వారి వద్ద నుండి పెద్ద ఎత్తున గుట్కాలు పాన్ మసాలాలు స్వాధీన పరుచుకొని వారిపై కేసులు నమోదు చేశారు.నిషేధిత మరక ద్రవ్యాలు,గుట్కాలు,పాన్ మసాలాలు సెల్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ హెచ్చరించారు.

## నడి రోడ్డు పై నాగు పాము

హైదరాబాద్ చంద్రయణగుట్ట డిఆర్డిఎల్ సమీపంలో ఉదయం స్కూళ్లకు ఆఫీసులకు వెళ్లే ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై విష సర్పం ఇండియన్ స్పెటికల్ కోబ్రా (నాగు పాము ) కనిపించడంతో జనాలు భయభ్రాంతులకు గురైయారు. స్థానికులు స్నేక్ క్యాచర్ మల్లేష్ నాయక్ సమాచారం అందించడం అతను చాకచక్యంగా పామును బంధించి నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేయడం ఊపిరి పీల్చుకున్నారు.

## మాజీ మేయర్ కార్తీకా రెడ్డి గృహ నిర్బంధం

హైదరాబాద్ తాము మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని చెపుతూనే కాంగ్రెస్ పార్టీ బిల్లును ఆమోదం పొందకుండా చేసిందని మాజీ మేయర్ బిజెపి సీనియర్ నాయకురాలు బండ కార్తీక రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ తీరును నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడికి తెలంగాణ బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో కార్తీక రెడ్డిని తార్నాక లోని ఆమె నివాసంలో ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లును కేవలం వ్యతిరేకించడంలేదని చెపుతూనే, అమలు దశకు వచ్చినప్పుడు దొంగనాటకాలతో అడ్డుకుందని ఆమె విమర్శించారు. సామాన్య మహిళలు రాజకీయాలలో రాకూడదని, కేవలం గాంధీ కుటుంబ మహిళలు మాత్రమే రాజకీయాలలో ఉండాలనే ఉద్దేశంతో బిల్లును వ్యతిరేచారని ఆరోపించారు. 17ఏప్రిల్ 2026 చీకటి రోజు అన్నారు...

# ధదూర్ లో మాజీ మంత్రి సబిత పర్యటన

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్

వికారాబాద్ జిల్లా ధరూర్ మండలంలోని నాగసన్పల్లి, తరిగోపుల, అల్లిపూర్ గ్రామాల్లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా జొన్న, మొక్కజొన్న పంట రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులకు తగిన మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి ఎరువులు అందించేవారని, ప్రస్తుతం రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆమె ఆరోపించారు.

నెల క్రితమే జిల్లా కలెక్టర్కు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. ఇప్పటివరకు రైతులు కేవలం 20 శాతం పంటను మాత్రమే అమ్మేందుకు సిద్ధంగా ఉంచారని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మిగతా పంట పొలాల్లోనే ఉండిపోయిందని పేర్కొన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ దీపక్ తివారితో ఫోన్లో మాట్లాడి తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నిల్వ ఉన్న పంటలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న పంటను అమ్మేందుకు గ్రామాల్లో రోడ్లపై ఎండబెట్టి సిద్ధంగా ఉంచారని చెప్పారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో వర్షాలు పడితే పంటను కుప్పలు చేసి మళ్లీ ఎండబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పంట కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఎన్ శుభప్రతిపట్టే, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు నాయుడు



నిడదవోలు మహిళా రిజర్వేషన్ బిల్లు అడ్డుకున్న విపక్షాల వైఖరికి నిరసనగా నిడదవోలులో మహిళలు, జనసేన, బీజేపీ నేతలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ర్యాలీ నిర్వహించారు. ఈ గారు. ర్యాలీలో మంత్రులు రామానాయుడు, కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, పలువురు నేతలు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు స్వయంగా ప్లకార్డు పట్టుకుని నిరసన తెలిసారు.

## పద్మారావు నగర్ లో ఎమ్మెల్యే తలసాని పర్యటన



హైదరాబాద్ పద్మారావు నగర్ ప్రాంత ప్రజలు 30 సంవత్సరాలకు పైగా ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్య నుండి శాశ్వత విముక్తి లభించబోతుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన గాంధీ హాస్పిటల్ బ్యాక్ లేన్ పద్మారావు నగర్ మెయిన్ రోడ్ లో శాంభవి అపార్ట్మెంట్ వద్ద 72 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పైప్ లైన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి గురించి అధికారులు ఎమ్మెల్యే కు వివరించారు. పైప్ లైన్ పనులకు అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ అడ్డంకిగా ఉన్నాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి పనులు సాఫీగా జరిగేలా సహకరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. తమ సమస్య శాశ్వత పరిష్కారం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరదనీటితో పద్మారావు నగర్ మెయిన్ రోడ్ నిండిపోయి ప్రజలు ఇండ్ల లో నుండి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉండేదని అన్నారు. అంతేకాకుండా డ్రైనేజీ ఓవర్ ఫ్లో తో రహదారిపై మురుగునీరు ప్రవహించి వాహనదారులు, ప్రజలు నిత్యం ఇబ్బందులు పడేవారని చెప్పారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో 72 లక్షల రూపాయలు మంజూరు చేయించి పనులు చేపట్టినట్లు వివరించారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు.

సీవరేజ్ లైన్ పనులకు శంఖుస్థాపన

హమాలీ బస్తీ లో 18 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ లైన్ పనులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శంఖుస్థాపన చేశారు. స్థానిక ప్రజలు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటిస్తున్నవారి వాహనాలకు ఛాంపియన్ స్టిక్కర్లు

వరంగల్ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో భాగంగా వరంగల్ పోలీసులు వినూత్న ప్రచారాన్ని చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న వాహనదారులను గుర్తించి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్ సీతా రెడ్డి వారి వాహనాలకు "అరైవ్-అలైవ్ ఛాంపియన్-2026" స్టిక్కర్లను అంటించి అభినందించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఛాంపియన్స్ అవ్వాలని ఏసీపీ సూచించారు

## థాయ్ ల్యాండ్ మాస్టర్ కార్డ్ ప్రకటించిన కంట్రీ క్లబ్

కంట్రీ క్లబ్ తమ ప్రత్యేక "థాయిలాండ్ మాస్టర్ కార్డ్"ను ప్రకటించింది. ఈ ప్రీమియం మెంబర్షిప్ ద్వారా థాయిలాండ్లోని ప్రముఖ పర్యాటక నగరాలైన బ్యాంకాక్, పట్టాయా, ఫుకెట్లకు సులభంగా, ప్రణాళికాబద్ధంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ కార్డ్ను బేగంపేట్లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.రాజీవ్ రెడ్డి థాయిలాండ్ మాస్టర్ కార్డ్ ను ఆవిష్కరించారు. ఈ సంర్భంగా ఫుకెట్ థీమ్తో నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందాల ముద్దుగుమ్మలు ఇండో-వెస్ట్రన్, వేర్ కలెక్షన్స్ లో వయ్యారాల నడకలతో హృయలొలికించారు. ఈ సందర్భంగా మీడియాతో రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ పర్యటన మరింత సులభంగా ఉండేందుకు. ఫ్రాంచైజీ ఆధారిత విస్తరణ వ్యూహం ద్వారా సభ్యులకు సులభమైన ప్రయాణం, దీర్ఘకాలిక విలువను అందించడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. తమ క్లబ్ . ఇప్పటికే బ్యాంకాక్, పట్టాయాలో భాగస్వామ్యంతో విస్తరణ పెంచుకున్నదన్నారు. ఇప్పుడు ఫుకెట్ను చేర్చడం ద్వారా సభ్యులకు లగ్జరీ, అడ్వెంచర్, హాస్పిటాలిటీ కలగలిపిన సమగ్ర అనుభవాన్ని అందించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం పర్యాటక రంగం ప్రపంచ ఆర్థిక వృద్ధి, సాంస్కృతిక మార్పిడి, జీవనశైలి అభివృద్ధికి కీలకంగా మారిందని ఆయన పేర్కొన్నారు. భారతదేశం వేగంగా పెరుగుతున్న అవుట్బౌండ్ ట్రావెల్ మార్కెట్గా ఎదుగుతున్న నేపథ్యంలో, ఆధునిక భారతీయ ప్రయాణికులు ప్రీమియం అయినప్పటికీ విలువైన అంతర్జాతీయ అనుభవాలను కోరుకుంటున్నారని తెలిపారు.

# ఆధ్యాత్మిక శోభతో పులకించిన హిందూ ధర్మ సమ్మేళనం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 18 ఏటూరు నాగారం .**- ఘనంగా హిందూ ధర్మ సమ్మేళనం- ఛత్రపతి శివాజీ జంక్షన్ నుంచి రామాలయం వరకు భారీ శోభాయాత్ర- గడప దాటితే అందరం హిందువులమే శ్రీశ్రీశ్రీ కృష్ణ నందగిరి స్వామి- తరలివచ్చిన హిందూ బంధువులు.. మార్మోగిన జై శ్రీరామ్ నినాదాలు.. శనివారం సాయంత్రం భక్తిభావంతో ఉప్పొంగింది. హిందూ ధర్మ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ ధర్మ సమ్మేళనం అత్యంత వైభవంగా సాగింది. సనాతన ధర్మ పరిరక్షణ, హిందూ సమాజనంలో ఏకాత్మతా భావాన్ని పెంపొందించడమే. లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలాదిగా హిందూ బంధువులు తరలివచ్చారు. సాయంత్రం 6 గంటలకు ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని చత్రపతి శివాజీ (వై- జంక్షన్) వద్ద నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం.. కాషాయ జెండాలతో, డప్పు వాయిద్యాల మధ్య యాత్ర ముందుకు సాగింది. ముఖ్య వీదుల గుండా సాగిన ఈ యాత్రలో యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జై శ్రీరామ్ నినాదాలతో ఏటూరునాగారం పురవీధులు మార్మోగాయి. అయితే, శోభాయాత్ర అనంతరం స్థానిక రామాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయం ఫంక్షన్ హాల్ ఆవరణలో జరిగిన దర్మ సమ్మేళనంలో కొత్తపల్లి కృష్ణానంద స్వామి, ఆశ్రమ పీఠాదిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణానం చరిగి స్వామి ఆశీర్వాద ప్రసంగం చేశారు. గడప లోపలే కులం- గడప దాటితే మనమందరం హిందువులం అనే నినాదంతో హిందూ సమాజం ఐక్యంగా ఉం. డాలని ఆయన పిలుపునిచ్చారు. స్వదర్మం పట్ల అంకితభావం, సేవాగుణం కలిగి ఉండాలని భక్తులకు స్వామి హితవు పలికారు అంతేకాకుండా, వరంగల్ విభాగ సంపర్క ప్రముఖ్ జూలపల్లి కరుణాకర్, ప్రముఖ న్యాయవాది, రాష్ట్ర సేవిక సమితి జిల్లా కార్యవాహిక సముద్రాల కవిత ముఖ్య వక్తలుగా హాజరై ప్రసంగించారు. జాతీయ సమైక్యతకు హిందువుల ఐకృత ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. సనాతన ధర్మంలోని గొప్పతనాన్ని, సాంస్కృతిక విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని వివరించారు. సమ్మేళనంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాలు, భక్తి గీతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి. నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ సమ్మేళన సమితి ప్రతినిధులు, వివిధ హిందూ సంఘాల నాయకులు, అన్ని గ్రామాల నుంచి తరలివచ్చిన హిందూ. బంధువులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హాట్ సమ్మర్‌లో చిల్డ్ బీర్లతో చిల్.. రికార్డుస్థాయిలో బీర్ల సేల్స్..

ఢిల్లీ: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలకే నడి నెత్తిన సూర్యారావ్ మంటెక్కించేస్తున్నాడు. ఎక్కడ చూసినా నలభై మూడు డిగ్రీలకు పైగానే టెంపరేచర్లు నమోదవుతున్నాయి. ప్రతిసారి ఏప్రిల్, మే నెలల్లో ఎండల భగ్గుమంటే, ఈసారి మార్చి నుంచే భానుడు నిప్పులు కురిపించడం మొదలెట్టాడు. జనాలు చల్లటి పానీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. మందుబాబులు మాత్రం కూల్‌గా బీర్లు తాగేస్తున్నారు. మలమలమాడే ఎండకు చిల్డ్ బేరేసి చిల్లవుతున్నారు. దాంతో బీర్ల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కేసులకు కేసులు రాగించేస్తుండటంతో? కోట్ల లీటర్ల బీరు మార్కెట్లోకి ఏరులై పారుతోంది. ఒక్క హైదరాబాద్ పరిధిలోనే రోజుకు వేలాది కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. వాతావరణానికి తోడు ఐపీఎల్ కూడా తోడుకావడంతో మ్యాచ్ చూస్తూ పీపాలకు పీపాలు లేపేస్తున్నారు. మద్యానికి బదులు బీర్లు తాగేవారు ఎక్కువయ్యారు. బీర్ డిమాండ్ వీకెండ్స్ కు రెట్టింపైంది. మున్ముందు బీర్ సేల్స్ రికార్డు స్థాయికి చేరుతాయంటున్నారు. బీర్ల సేల్స్ పెరిగేకొద్దీ అబ్కారీ శాఖ ఖజానా కళకళలాడుతోంది.దేశవ్యాప్తంగా 2026 మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు తీవ్రంగా ఉండటంతో బీర్ అమ్మకాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, అందునా తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి అమ్మకాలు నమోదయ్యాయి.


తెలంగాణలో ఈ మార్చిలో ఏకంగా 50 లక్షల కేసులకి పైగా బీర్ అమ్ముడైంది. ఇది గత ఏడాది అమ్మకాలతో పోలిస్తే 22 శాతం ఎక్కువ.ఏప్రిల్ మొదటి 13 రోజుల్లోనే దాదాపు 21 లక్షల కేసులు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం ప్రతిరోజూ సగటున 1.7 లక్షల నుంచి 1.8 లక్షల కేసుల సేల్స్ జరుగుతున్నాయి. సాధారణ రోజుల్లో రోజుకు 1.50 లక్షల కేసులు అమ్ముడైతే, ఇప్పుడు అది 2 లక్షలకు చేరింది. ఎండలు పెరిగే కొద్దీ ఇది 2.5 లక్షలకు చేరవచ్చని అంచనా.?హైదరాబాద్ వంటి నగరాల్లో ప్రీమియం,ఫారిన్ బ్రాండ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. సాధారణంగా ఏడాదికి 450-500 లక్షల కేసులు అమ్ముడవుతుంటాయి, కానీ ఈ ఏడాది అది 600 లక్షల కేసులను దాటుతుందని అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మెట్రో నగరాలైన ముంబై, బెంగళూరు, ఢిల్లీలలో కూడా బీర్ అమ్మకాలు సుమారు 15శాతం నుండి 20శాతం వరకు వృద్ధిని కనబరుస్తున్నాయి. యువతలో క్రాఫ్ట్ బీర్లు, తక్కువ ఆల్కహాల్ ఉండే బీర్ల పట్ల ఆసక్తి పెరగడం కూడా ఈ వృద్ధికి ఒక కారణంగా కనిపిస్తోంది. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఉత్పత్తికి అవసరమైన నీటి కొరత, ముడి పదార్థాల ధరల పెరుగుదల వల్ల సరఫరాపై కొంత ఒత్తిడి కూడా ఉంది. బార్‌లు, రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు బీర్ స్టాక్‌ను సిద్ధంగా ఉంచుకుంటున్నాయి. ఇప్పుడు అన్ని రకాల ప్రీమియం బ్రాండ్లు అందుబాట్లో వుండడంతో ఈ సమ్మర్ హీట్ చిల్ అవుతుందంటున్నారు వ్యాపారులు. స్టాక్ త్వరగా ఖాళీ అవుతుండటంతో డీలర్లు అడిషనల్ కార్టన్ల కోసం డిపోల చుట్టూ తిరుగుతున్నారు. మామూలుగా వారానికి ఒక్కసారి స్టాక్ తెప్పించుకునేవాళ్లు. కానీ ఇప్పుడు నాలుగు రోజులకు ఒకసారి తెప్పించాల్సిన పరిస్థితి. ఆ స్థాయిలో సేల్స్ పెరిగాయి. ఈవెంట్లు, పార్టీలకు వేసవి కాలం అనుకూలంగా మారడంతో వీకెండ్స్‌లో బీర్ డిమాండ్ మరింత పెరుగుతోందని ట్రేడర్లు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు బీర్ల అమ్మకాలు పెరుగుతున్నాయి. గత నెల నుంచే బీరు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే బీరు విక్రయాలు 30 శాతం మేరకు పెరిగాయి. వచ్చే రెండు మాసాల్లో ఎండలు మరింత పెరగనుండటతో సేల్స్ కూడా భారీగా పెరుగుతాయని అంచనా వేస్తున్నాయి ఎక్సైజ్ వర్గాలు. ఏపీలో మార్చి నెలలో 29.8 శాతం మేరకు అధికంగా బీర్లు అమ్ముడైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి వినియోగదారులు లిక్కర్ కంటే బీర్లకే మొగ్గుచూపుతున్నారు మందుబాబులు. గతేడాది ఏప్రిల్‌లో 12 వరకు 11.78 లక్షల కేసుల మద్యం అమ్మగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇప్పటి వరకు 8.52 లక్షల కేసుల మద్యమే అమ్ముడైంది. మార్చిలో సుమారు 26.11 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. గతేడాది మార్చిలో కేవలం 20 లక్షల కేసులు మాత్రమే. అంటే దాదాపు 30% వృద్ధి నమోదైంది. ఏప్రిల్ మొదటి 12 రోజుల్లోనే 9.2 లక్షల కేసుల బీర్లు సేల్ అయ్యాయి. గతేడాది ఇదే సమయానికి 8.16 లక్షల కేసులు మాత్రమే అమ్ముడయ్యాయి. తెలంగాణతో పోలిస్తే ఏపీలో బీర్ల వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ, ఈ ఏడాది వృద్ధి రేటు ఏపీలోనే ఎక్కువగా వుంది. ఎండల తీవ్రత పెరగడం వల్ల ప్రజలు లిక్కర్ నుంచి బీర్లకు షిఫ్ట్ అవ్వడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా 28.4 శాతం వృద్ధి సాధించింది. శ్రీసత్యసాయిలో 27.75 శాతం, కర్నూలులో 26.03 శాతం అమ్మకాలు పెరిగాయి.మద్యం ఆదాయం కూడా భారీగా పెరిగింది. అందులో బీర్ల వాటా గణనీయం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏపీ ప్రభుత్వం మద్యం ద్వారా సుమారు 29,042 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో కేవలం మద్యం విక్రయాల ద్వారానే ప్రభుత్వానికి దాదాపు 4,500-5,000 కోట్ల మధ్య ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా. ప్రభుత్వాలకు ఎక్సైజ్ సుంకం రూపంలో వచ్చే ఆదాయం ఈ రెండు నెలల్లో గతేడాది కంటే 15-20శాతం అధికంగా ఉండే అవకాశం ఉంది. ఏప్రిల్ నెలాఖరు వరకు ఉష్ణోగ్రతలు ఇలాగే ఉంటే, కేవలం ఏప్రిల్ నెలలోనే దేశవ్యాప్తంగా 800 నుంచి 900 మిలియన్ లీటర్ల బీర్ వినియోగం జరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలు బీర్ కంపెనీలకు, ప్రభుత్వ ఖజానాకు గోల్డెన్ పీరియడ్ గా మారాయి. తెలంగాణలో 2026 మార్చి, ఏప్రిల్ నెలల్లో మద్యం, బీర్ల అమ్మకాల ద్వారా ప్రభుత్వ ఖజానా కళకళలాడింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే అత్యధికంగా 40,209 కోట్ల ఆదాయం వచ్చింది. అందులో ఈ వేసవి కాలం సింహభాగం. మార్చి నెలలో మద్యం, బీర్ల అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి సుమారు 3,486 కోట్ల ఆదాయం వచ్చింది. మే నెలలో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో, ఏప్రిల్, మే నెలల్లో కలిపి కేవలం బీర్ల ద్వారానే ప్రభుత్వానికి 2,500 కోట్ల పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బీర్ల వినియోగం పెరగడం ఒక ఎత్తైతే, స్టాక్ అందుబాటులో ఉంచడం ఎక్సైజ్ శాఖకు సవాలుగా మారింది. దీంతో భగభగమండే ఎండలకు పోటీలకు బీర్ల ధరలు కూడా పెరగనున్నాయి. రానున్న రోజుల్లో బీర్ల ధరలు పెంచాల్సిందేనని కంపెనీలు పట్టుబడుతున్నాయి.మాడు పగిలే ఎండల్లో చల్లగా బీరు తాగి చిల్లవుతున్నోళ్ల జేబుకు త్వరలో చిల్లు పడబోతోంది. మద్యం, బీర్ల రేట్లు భారీగా పెరగబోతున్నాయి. ఇప్పటికే ధరల పెంపుదలపై మద్యం కంపెనీలు ఒత్తిడి చేయడమే కాక.. సరఫరా కూడా నిలిపివేసాయి. దీంతో త్వరలోనే తెలంగాణలో మద్యం ధరలు భారీగా పెరగబోతున్నాయి. అలాగే పాత ధరలకు విక్రయాలు నిలిపి వేయడమేకాక.. కొత్త ధరల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. ముడి సరుకుల ధరల పెరుగుదల, రవాణా భారం, ఇరాన్-అమెరికా యుద్ధ పరిణామాలతో తాము కుదేలవుతున్నామని, ధరలు పెంచకపోతే సరఫరా నిలిపివేస్తామని మద్యం తయారీ కంపెనీలు ఎక్సైజ్ శాఖకు స్పష్టం చేశాయి. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. తెలంగాణలోనే మద్యం ధరలు తక్కువగా ఉన్నాయని, తమకు మిగిలే లాభం నామమాత్రమేనని అంటున్నాయి. ఒకవేళ సరఫరా నిలిపివేయాల్సి వస్తే.. తొలుత తెలంగాణకే నిలిపివేస్తామని తేల్చిచెప్పాయి. ఈ వారం లోగా పెంపుపై స్పష్టమైన హామీ రాకపోతే.. నేరుగా ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి తమ అభిప్రాయం తెలిపాలని కంపెనీలు డిసైడయ్యాయి. ఈ పరిణామాలను చూస్తుంటే.. వచ్చే నెలలో మద్యం, బీర్ల ధరలు భారీగా పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. నిర్ణీత గడువు ముగిసినందున మద్యం ధరలు పెంచడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా.. యుద్ధం, స్టాక్ కొరతను సాకుగా చూపుతూ పనిలో పనిగా బీర్ల ధరలు కూడా పెంచుకోవడానికి ఉత్పత్తిదారులు ప్లాన్ చేస్తున్నారనే అభిప్రాయాలున్నాయి.కామన్‌గా రాష్ట్రంలో ప్రతి రెండేళ్లకోసారి మద్యం ధరలను సవరించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా 2025 ఫిబ్రవరిలో బీర్ల ధరలు పెంచినప్పటికీ.. సాధారణ మద్యం ధరల పెంపు మాత్రం పెండింగ్‌లో ఉంది. అంతకుముందు 2023 మేలో ధరలు పెంచగా, నిబంధనల ప్రకారం 2025 మే నాటికి మళ్లీ పెంచాల్సి ఉంది.కానీ స్థానిక సంస్థలు, మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అప్పట్లో జరిగిన జాప్యాన్ని కంపెనీలు ఇప్పుడు సాకుగా చూపుతున్నాయి. అంతేకాదు.. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుత వేసవిలో బీర్లకు డిమాండ్ ఉన్న క్రమంలో సప్లయ్ నిలిపివేస్తామని అల్టిమేటం ఇచ్చాయి. దీని వెనుక మద్యం, బీర్ల ధరలను ఏకకాలంలో పెంచుకునే కుట్ర ఉందన్న టాక్ నడుస్తోంది. నిజానికి లిక్కర్ ధరలను పెంచడానికి ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టింది. రిటైర్డ్ జడ్జితో కూడిన జ్యుడీషియల్ కమిటీ.. ధరల పెంపు అంశాన్ని లోతుగా పరిశీలిస్తోంది. మిగిలిన రాష్ట్రాల్లో ధరల పెంపు ఏ మేరకు ఉందనే సమాచారాన్ని తెప్పించుకుని చర్చిస్తోంది. దాదాపు మే నెలలో మద్యం ధర పెంపు పక్కాగా ఉంటుందని తెలుస్తోంది. అయితే.. ఇదే సమయంలో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా సహజ వాయువు సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో మద్యం నింపే గ్లాస్ బాటిల్స్ ఉత్పత్తి ఖర్చులు పెరిగాయంటున్నారు డిస్టిలరీల యజమానులు.ఈ అదనపు భారాన్ని తాము భరించలేకపోతున్నామని, వెంటనే మద్యం ధరలు పెంచాలని ఎక్సైజ్ అధికారులను కోరుతున్నారు.గత ఏడాది ఫిబ్రవరిలోనే ప్రభుత్వం బీర్ల ధరలను 15 శాతం పెంచినప్పటికీ.. ప్రస్తుతం సీసాల కొరత, అల్యూమినియం క్యాన్ల రేట్లు పెరగడంతో మరోసారి ధరల పెంపు తప్పనిసరి అని వాదిస్తున్నాయి కంపెనీలు. వేసవిలో బీర్లకు డిమాండ్ 30శాతం వరకు పెరుగుతుండటంతో సరఫరా తగ్గడం మార్కెట్‌లో కొంతమేరకు కొరతకు దారితీస్తోంది. ఇదే అనువుగా భావించిన కంపెనీలు.. బీరు ధరల అంశాన్ని కూడా తెరపైకి తెచ్చాయి. మద్యం కంపెనీలు బలవంతంగా బీర్ల ధరలు పెంచుకోవడానికే సరఫరా నిలిపివేస్తామంటున్నాయని విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి 2027 ఫిబ్రవరిలో ధరలు పెంచాల్సి ఉంది. కానీ, తొమ్మిది నెలల ముందే బీర్ల ధరను పెంచుకోవడానికి తయారీ కంపెనీలు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాయి. సమ్మర్‌లో బీర్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. ప్రతి ఏటా వేసవిలో అమ్మకాలు పెరుగుతూనే ఉంటాయి. దీన్ని ఆసరాగా చేసుకుని బీర్ల ధరలను కూడా భారీగా పెంచాలని కంపెనీలు భావిస్తున్నాయి. ప్రీమియం రకం బీర్ల ధరలు ఎక్కువగా పెరిగే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం ఉన్న దాని కంటే కనీసం 10-15 శాతం పెంచాలని కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి.అటు ఆంధ్రప్రదేశ్‌లో బీర్ల ధరలు పెరిగే అవకాశం ఉంది. వేసవి కాలం కావడంతో వీటికి డిమాండ్ పెరుగుతోంది, దీనిని ఆసరాగా చేసుకుని కంపెనీలు ధరలు పెంచాలని భావిస్తున్నాయి. ప్యాకేజింగ్ మెటీరియల్స్, గాజు సీసాల ధరలు పెరగడం, రవాణా ఖర్చులు పెరగడం వల్ల బీర్ల ఉత్పత్తి వ్యయం 12-15% పెరిగింది. రికార్డ్‌స్థాయిలో బీర్ల అమ్మకాలు ఉండటంతో, ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్ యుద్ధంతో గ్యాస్ కొరత ఏర్పడటంతో గాజు సీసాల ధరలు 20% పెరిగాయి. పేపర్ కార్టన్ల రేట్లు రెట్టింపు అయ్యాయి.

లేబుల్స్, టేపుల ధరలు కూడా పెరిగాయని 'బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' తెలిపింది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద గ్యాస్ దిగుమతిదారుగా ఉన్న భారత్, మధ్యప్రాచ్యంపైనే ఎక్కువగా ఆధారపడింది. ముఖ్యంగా ఖతార్ నుంచి తన మొత్తం గ్యాస్ సరఫరాలో 40% దిగుమతి చేసుకుంటోంది. ఇరాన్ దాడితో ఖతార్ ఎగుమతులపై ప్రభావం పడి, భారత కంపెనీలకు గ్యాస్ లభ్యత కష్టమైంది. గాజు తయారీ పరిశ్రమలో కొలిములకు గ్యాస్ చాలా అవసరం. దీని కొరతతో ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ వంటి గాజు తయారీ కేంద్రాల్లో ఉత్పత్తి 40% తగ్గింది. భారత్‌లో బీర్ల అమ్మకాలు ఎక్కువగా ఉండే 'పీక్ సమ్మర్' సీజన్‌లోనే ఈ సంక్షోభం తలెత్తింది. అల్యూమినియం క్యాన్ల సరఫరాదారులు కూడా సప్లై తగ్గిస్తామని హెచ్చరించడంతో, మార్కెట్‌పై ఇది తీవ్ర ప్రభావం చూపనుంది.ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోవడంతో కార్యకలాపాలు కష్టంగా మారుతున్నాయని అసోసియేషన్ చెబుతోంది.మొత్తగా మేలో బీర్ల లవర్లకు రేట్ల షాక్ తప్పేలా లేదు.తెలుగు రాష్ట్రాల్లో బీరు ఏరులై పారుతోంది. ఎండలు పెరగడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది.రికార్డ్ స్థాయిలో అమ్మకాలు జరుగుతున్నాయి.

## రాష్ట్రవ్యాప్తంగా వెల్ఫేర్ వీక్

### సంక్షేమ కార్యక్రమాల అమలుపై సీఎస్ సమీక్ష"




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 18:**99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు శనివారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా "వెల్ఫేర్ వీక్" నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్ రోజువారీ షెడ్యూల్‌ను వివరించారు:



1. ఏప్రిల్ 20: అన్ని వెల్ఫేర్ విద్యాసంస్థల్లో వంటశాలలు, శానిటేషన్ పై సమగ్ర శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించాలి. అధికారులు విద్యాసంస్థలను సందర్శించి పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించాలి.
2. ఏప్రిల్ 21: వెల్ఫేర్ విద్యార్థుల కోసం క్విజ్, డిబెట్, చిత్రలేఖనం వంటి పోటీలతో టాలెంట్ ఫెస్ట్ నిర్వహించి సృజనాత్మకతను, మేధస్సును ప్రోత్సహించాలి.
3. ఏప్రిల్ 22: హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులపై దృష్టి పెట్టి అంచనాలు సిద్ధం చేసి, తగిన అనుమతులు తీసుకుని, వేసవి సెలవుల్లో పనులను పూర్తి చేయాలి.
4. ఏప్రిల్ 23: తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు (గ్రుపీం) నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించాలి. విద్యా ప్రతిభను ప్రోత్సహించాలి. 5. ఏప్రిల్ 24: యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, ఉపాధి అవకాశాలను పెంపొందించే ప్రభుత్వ పథకాలను వివరించాలి. 6. ఏప్రిల్ 25: విద్యార్థుల కోసం క్రీడలు, కళలు, సంగీతం, డిజిటల్ లిటరసీ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలతో సమ్మర్ క్యాంపులు నిర్వహించాలి. 7. ఏప్రిల్ 26: రాష్ట్రవ్యాప్తంగా అన్ని హాస్టళ్లలో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో "బడి బాట" కార్యక్రమం నిర్వహించాలి.

జిల్లా కలెక్టర్లు ప్రతి కార్యక్రమం అమలును క్షుణ్ణంగా పర్యవేక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఘోష్ సూచించారు.

ప్రజాప్రతినిధులను అన్ని కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని, తద్వారా విస్తృత ప్రచారం, పారదర్శకత పెరుగుతుందని ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, సి ఐ పి ఆర్,సిహెచ్. ప్రియాంక, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు।

## జిల్లాలో డయాలసిస్ కేంద్రాల విస్తరణ

### నాణ్యమైన సేవలే లక్ష్యం

### జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. ఉమా గౌరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 18:**తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు, రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ప్రతిపాదిత డయాలసిస్ కేంద్రాలు మరియు ఇప్పటికే ఉన్న కేంద్రాలలో అదనపు పడకల వివరాలు జిల్లా వారీగా అందించబడినవి. ఈ నేపథ్యంలో, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో కొత్త డయాలసిస్ కేంద్రాలు మరియు ఉన్న కేంద్రాలలో అదనపు పడకల ఏర్పాటు పై స్థల స్థాయి తనిఖీలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఈ ఆదేశాల ప్రకారం, డా. సి. ఉమా గౌరి (జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి), డా. సునీత (జిల్లా కోఆర్డినేటర్, హాస్పిటల్ సర్వీసెస్), డా. రాధ (సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, కుత్బుల్లాపూర్) కలిసి సిహెచ్‌సి ఘట్‌కేసర్ మరియు సిహెచ్‌సి శామీర్‌పేట్ కేంద్రాలను సందర్శించి డయాలసిస్ సేవల విస్తరణకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలించారు.

తనిఖీలలో మానవ వనరుల లభ్యతను ప్రధానంగా, ఇన్-హౌస్ మెడికల్ ఆఫీసర్ / ఫిజీషియన్ / అనస్తీషియాలజిస్ట్ అందుబాటులో ఉన్నారా అనే అంశాన్ని పరిశీలించగా, ఐ ఎచ్ ఎఫ్ ఎం ఎస్ సిబ్బంది అయిన సెక్యూరిటీ, పేషెంట్ కేర్ ప్రొవైడర్లు మరియు శానిటేషన్ సిబ్బంది ప్రతి షిఫ్ట్‌కు తగిన సంఖ్యలో ఉన్నారా అనే అంశాన్ని కూడా సమీక్షించారు.అలాగే మౌలిక సదుపాయాల పరంగా ప్రతి డయాలసిస్ పడకకు అవసరమైన 80--100 చదరపు అడుగుల స్థలం, సపోర్ట్ సర్వీసులకు 150--180 చదరపు అడుగుల విస్తీర్ణం, 5 పడకల యూనిట్‌కు అవసరమైన సుమారు 1200--1400 చదరపు అడుగుల స్థలాన్ని పరిశీలించారు. ఎచ్ బి వి, ఎచ్ సి వి, ఎచ్ ఐ వి వంటి అంటువ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు, అలాగే రోగులు మరియు సహాయకుల కోసం వేచిచోటు వంటి సదుపాయాలను కూడా తనిఖీ చేశారు.

అత్యవసర మరియు సాంకేతిక సదుపాయాల కింద ఆక్సిజన్ వంటి ఎమర్జెన్సీ పరికరాలు, ల్యాబొరేటరీ మరియు టీ-డయాగ్నస్టిక్స్ సౌకర్యాలు, తాగునీరు మరియు నీటి కనెక్షన్, నిరంతర విద్యుత్ సరఫరా, అలాగే ఐటీ మరియు టెలీ-మానిటరింగ్ కోసం ఇంటర్నెట్ కనెక్షన్ అందుబాటులో ఉన్నాయా అనే అంశాలను పరిశీలించారు.అదనంగా, కేంద్రాలు తక్షణ సేవల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయా, అవసరమైన మానవ వనరుల నియామకానికి పట్టే సమయం, సివిల్ వర్క్స్ అవసరాలు (చిన్న/పెద్ద మరమ్మత్తులు), ప్రస్తుత స్థితి మరియు పనులు పూర్తి చేయడానికి అవసరమైన కాలపరిమితి (టైమ్‌లైన్) వంటి అంశాలను కూడా సమగ్రంగా అంచనా వేశారు.తనిఖీల అనంతరం, సంబంధిత నివేదికలను నిర్దేశిత నమూనాలో సిద్ధం చేసి పై అధికారులకు సమర్పించనున్నారు. జిల్లాలో డయాలసిస్ సేవలను మరింత బలోపేతం చేసి, ప్రతి రోగికి సమీపంలోనే నాణ్యమైన మరియు సురక్షిత వైద్య సేవలు అందించడమే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

# రక్త దానం చేద్దాం ప్రాణాలను కాపాడుదాం.

## రక్తదాతల సేవ స్ఫూర్తి అభినందనీయం.

## జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దివాకర టి.ఎస్.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 18 ములుగు**శనివారం ములుగు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ -టి జి ఓ అసోసియేషన్, టీఎన్జీవో యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ములుగు గట్టమ్మ దేవాలయ సమీపంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం



కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.సందర్శించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనం ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు ఒక నిండు ప్రాణాన్ని నిలబెడుతుందని, రక్తదానం అనేది కేవలం ఒక కార్యక్రమంగా చూడకూడదని, అది ఒక గొప్ప సామాజిక సంస్కృతిగా మారాలని ఉద్ఘాటించారు. జీవితాలను కాపాడే మహత్తర సేవలో భాగంగా ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తం అందుబాటులో ఉండడం అత్యవసర చికిత్స లలో ఎంతో కీలకమని, ముఖ్యంగా




ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్య సేవల సమయంలో రక్తదానం ప్రాణదాతగా నిలుస్తుందని అన్నారు.

జిల్లాలోని ప్రజలు,ఉద్యోగులు, ఉపాధ్యాయులు,యువత, పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావులు రక్తదానం చేసి ఉద్యోగులకు, దాతలకు స్ఫూర్తిగా నిలిచారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, డి ఆర్ డి ఓ చంద్రశేఖర్, అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాస్, ఉద్యోగ సంఘ ప్రతినిధులు, యువత, వైద్య బృందం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా ప్రజలకు పిలుపు -- “చలో ఇందిరా పార్క్” కార్యక్రమాన్ని విజయవంతం చేద్దా



**ములుగు జిల్లా: ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 18 ములుగు**ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, అలాగే రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్ టి ఈ) చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద “చలో ఇందిరా పార్క్” పేరుతో భారీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీసీ జేఏసీ ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

ప్రస్తుతం ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల తల్లిదండ్రులపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని, చాలా కుటుంబాలు అప్పులు చేసి పిల్లలకు విద్య అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆర్ టి ఈ చట్టం ప్రకారం ప్రతి విద్యార్థికి సమాన విద్యా అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమం ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, పూర్తిగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. అందువల్ల రాజకీయాలకు అతీతంగా ములుగు జిల్లా ప్రజలు, విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అరికట్టాలని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా నాణ్యమైన విద్య అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి మండల మదన సమితి అధ్యక్షులు గోల్కొండ రాజు, బీసీ నాయకులు మెరుగు రాజు , ఎండి పాషా, నాయకుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తేది: ఏప్రిల్ 26

సమయం: ఉదయం 10:00 గంటలకు

వేదిక: ఇందిరా పార్క్, హైదరాబాద్

ప్రతి ఒక్కరూ హాజరై విద్యార్థుల భవిష్యత్తు కోసం గొంతెత్తి ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించిన ఎం ఈ ఓ

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 18 ఏటూరునాగారం** ఎటూరు నాగారం మండల కేంద్రంలోని 12వ వార్డు మానసపల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎటూర్ నాగారం ఎంఈ ఓ కొయ్యడ మల్లయ్య గారితో కలిసి వార్డ్ మెంబర్ కొయ్యల కృష్ణవేణి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.



ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, శుభ్రత మరియు మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేసి, వారి ఆరోగ్యం మరియు పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలతో కలిసి భోజనం చేయడం ద్వారా వారికి మరింత ఆత్మీయత కలిగించడమే కాకుండా, ప్రభుత్వ పథకాల అమలు సక్రమంగా జరుగుతున్నదని ధృవీకరించారు. అలాగే పాఠశాల అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు రామకృష్ణ పాల్గొన్నారు

## తప్పుడు పోస్టులపై వైఎస్ భారతీరెడ్డి లీగల్ నోటీసులు

విజయవాడవైఎస్ జగన్ భార్య భారతీ రెడ్డి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా థింక్ ఆంధ్ర, ఎం9 తప్పుడు కథనాలు, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు ఆమె లీగల్ నోటీసులు పంపించారు. గూగుల్, మెటా, ఎక్స్, యూట్యూబ్లకు వైఎస్ భారతీరెడ్డి నోటీసులు ఇచ్చారు. తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్న థింక్ ఆంధ్ర, ఎం9 న్యూస్లకు కూడా నోటీసులు ఇచ్చారు. తక్షణమే ఆ కథనాలను, పోస్టులను తొలగించాలి. ఆ కథనాలు వ్యాప్తి చేస్తున్న అకౌంట్లను బ్లాక్ చేయాలి. తప్పుడు కథనాలపై బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆమె పేర్కొన్నారు.

# రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి ముశ్నిపెల్లి కుమార్ గౌడ్, సర్పంచ్,ఇంచర్ల.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 18** ఇంచర్లములుగు జిల్లా కేంద్రంలో నిన్న కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం లో ఇంచర్ల గ్రామ సర్పంచ్ శ్రీ ముశ్నిపెల్లి కుమార్ గౌడ్ రక్తదానం చేయడం జరిగింది. దీనితో ఆయన రక్త దానం చేయడం 15 వసారి. రోడ్డు యాక్సిడెంట్ లకు గురై కొందరు, వివిధ అనారోగ్య కారణాలతో మరికొందరు సమయానికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతుండడం దురదృష్టకరం.., అలాంటి క్షతగాత్రులకు లేదా బాధితులకు సమయానికి రక్తం అందేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.




మరియు చాలామందిలో రక్తం ఇస్తే బలహీనపడతామనే అపోహ ఉంది. ఒక మనిషి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం ఇవ్వచ్చు. నిత్యం మన శరీరంలో రక్త కణాలు అభివృద్ధి చెందుతూనే ఉంటాయి కాబట్టి అలాంటి అపోహలేం లేకుండా అందరూ విధిగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి రక్తదాన శిబిరాలను నిర్వహించి బాధితులకు సరఫరా చేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారిని అభినందించారు

. ఈ కార్యక్రమంలో ఇంచర్ల గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ మాదాసు శ్రీను కూడా పాల్గొని రక్తదానం చేయడం జరిగింది.

# మణికొండ ఎస్టీపీ పనుల చిత్ర విచిత్రాలు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 18 ఏప్రియల్ 2026**బి.ఆర్.ఎస్ పార్టీ మణికొండ నాయకులు శనివారం రోజున ఈ.వి.వీ కాలనీని సందర్శించి పందెంవాగు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ మరియు పెద్ద చెరువు వద్ద నిర్మాణ పనులు, నెక్నంపూర్ చిన్న చెరువు వద్ద సెవెరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనుల పురోగతిని పరిశీలించారు. పెద్ద చెరువు డ్రెయిన్ పనులు సాధారణంగా డౌన్ స్ట్రీమ్ నుండి అప్ స్ట్రీమ్ వైపు ప్రారంభం కావాలి. అయితే ఇప్పటివరకు నాలా పనులు ప్రారంభం కాలేదు. డ్రాయింగ్స్ సిద్ధంగా లేవనే కారణంతో ఆలస్యం జరుగుతోందని తెలిసింది. 2025 ఆగస్టులోనే టెండర్లు పిలిచినప్పుడు ఇప్పటికీ డ్రాయింగ్స్ సిద్ధం కాకపోవడం విచిత్రంగా ఉంది. ప్రస్తుతం పందెం వాగు నాలా చెత్తతో నిండిపోయి ఉంది. సమీప కాలనీల డ్రెయిన్ పైపుల ఔట్ లెట్ కంటే నీటి మట్టం ఎత్తులో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కామారెడ్డి తరహాలో భారీ వర్షాలు పడితే మణికొండలోని లోతట్టు ప్రాంతాలు ముఖ్యంగా ప్రతిభ స్కూల్ దగ్గర నుంచి ఇ.వి.వి కాలనీ వరకు తీవ్ర ముంపుకు గురి అయ్యే ప్రమాదం ఎంతైనా ఉంది. ఇక ఇప్పటి వరకు రానున్న వర్షాకాలంని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టినట్టు దాఖలాలు లేవు. సాధారణంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో పనులు జరుగు తున్నప్పుడు సంబంధిత పని గురించి బోర్డుపై వివరాలు ప్రకటించడం జరుగుతుంది, కానీ జరుగుతున్న పనులపై ఎక్కడా స్పష్టమైన వివరాలు లేవు. నెక్నంపూర్ సర్వే నం. 20 లో ప్రతి పాదిత ఎస్టీపీ పనులు ఇంకా ప్రారంభం కానే కాలేదు. కనీసం మట్టి పని కూడా ప్రారంభించలేదు. చిన్న చెరువు ఎ.స్టీ.పీ పనులపై ఎలాంటి వివరాలు అందుబాటులో లేవు. పూజా బిల్డర్స్ నిర్మించిన రిటైనింగ్ వాల్ వెలుపల నుంచి ఎస్.టి.పి కి సంబంధించిన పైపులు వేయబడు తున్నాయి. ఇది బిల్డర్ యొక్క సరిహద్దు అయితే భవిష్యత్తులో నిర్వహణ సమస్యలు వస్తాయి. ఇది బఫర్ జోన్ అయితే బిల్డర్ భూమి మరియు బఫర్ జోన్ మధ్య స్పష్టమైన విభజన ఉండాలి. ఈ విషయంలో సంబంధిత అధికారులు, ముఖ్యంగా హైడ్రా అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే పనులు ప్రారంభించి, పారదర్శకంగా వివరాలు ప్రకటించి, వర్షాకాలంకు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టాలినీ. అధికారులు బాధ్యతతో వ్యవహరించాలనీ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్, యాలాల కిరణ్, భాను చందర్, జై రామ్, సుమనళిని, రాజేంద్ర ప్రసాద్, కందాడ ప్రవీణ్, చెరుకూరి బాలాజీ, వెంకట్ చకిలం డిమాండ్ చేస్తున్నారు.

# మంగ్లీపై ఆరోపణల్ని ఖండిస్తున్నాం

## ప్రధాన నిందితుల్ని విచారించి బాధితులకు న్యాయం చేయాలి

## బంజారా అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు భూక్యా హరినాయక్




**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజాబలం)**బంజారా బిడ్డ ప్రముఖ సింగర్ మంగ్లీపై కొంతమంది కావాలనే ఆరోపణలు చేస్తున్నారని వాటిని ఖండిస్తున్నామని బంజారా అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాది భూక్యా హరినాయక్ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగ్లీపై ఘోరాతిఘోరమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తప్పు జరిగిందని తెలిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి, సాక్ష్యాలను చూపాలి. కోర్టు శిక్షిస్తుంది. అలాగాకుండా వ్మీడియా సమావేశం పెట్టి చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. మంగ్లీ భవిష్యత్‌ను దెబ్బతీసేందుకు జరుగుతున్న కుట్రలో భాగమే ఇదంతా అని ఆరోపించారు. ప్రధాన నిందితుడిని విచారించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కంపెనీలో మంగ్లీ వాటా ఉందా, బోర్డు డైరెక్టర్‌గా ఉందా అనే విషయాలు తేలకుండా ఆమెపై ఎలా ఆరోపణలు చేస్తారని ప్రశ్నించారు. నిన్ను వదలనంటూ ఏకవచనంతో మాట్లాడడం సరికాదని, న్యాయవాద వృత్తికే సుబ్బారావు కళంకం తెస్తున్నాడని ఆరోపించారు. సాక్ష్యాలు ఉంటే పోలీసులకు అప్పగిస్తే వారే విచారణ జరుపుతారని అన్నారు. అలాగాకుండా బంజారా బిడ్డపై అవాస్తవమైన, అసత్యమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ధరావత్ వీరన్న మాట్లాడుతూ మంగ్లీ ప్రతిష్టను దిగజార్చేందుకు కొంతమంది కుట్ర చేస్తున్నారని అన్నారు. తానే బాధితుల తరుపున ఉంటానని మంగ్లీ చెప్పిందనే విషయం గుర్తు చేసుకోవాలన్నారు. న్యాయవాది బాణోత్ మణిమాల మాట్లాడుతూ మంగ్లీపై ఆరోపణలు బంజారా జాతికి ఘోరమైన అవమానమన్నారు బెట్టింగ్ యాప్స్‌లో ఉన్న వారిపై చర్యలు తీసుకోవడం చేతకాదని, ట్యాక్స్‌లకు కట్టకుండా తప్పించుకు తిరుగుతున్న వారిని ఏం చేయలేకపోతున్నారని, దేశంలో నెంబర్‌వన్ సింగర్‌గా ఎదుగుతున్న బంజారా బిడ్డపై మాత్రం అవాస్తవమైన ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. లంబాడీలపై ఎందుకు కక్ష్య కట్టారని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని సూచించారు. మంగ్లీపై లేనిపోని అరోపణలు చేస్తే బంజారా జాతి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో న్యాయవాదులు తేజావత్ నర్సింహ, ధరావత్ ప్రసాద్, సునావత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## మొదట డీఎస్పీగా తర్వాత యూపీసీ సీసీ 2025అల్ ఇండియా 793 ర్యాంక్ ఐపీస్ ఎంపికైన ప్రవీణ్ కుమార్‌ను అభినందించిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు, శ్రీలత దంపతులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 18** ములుగు ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రానికి చెందిన. ధైనం పెల్లి ప్రవీణ్ కుమార్ గ్రూప్ వన్ ఫలితాలలో చత్తాచాటి డిఎస్పీగా ఎంపికై శిక్షణ పొందుతున్న క్రమంలో యుపిసి సిసి 2025 ఆల్ ఇండియా 793 ర్యాంక్ ఐపీఎస్ గా ఎంపికైన ఏటూరు నాగారం గ్రామానికి చెందిన నీరు పేద కుటుంబం నుంచి ఒక ఐపీఎస్ స్థాయికి ఎదిగినందుకు ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకుల మారి లక్ష్మణ్ బాబు ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు

అలాగే మంచి స్థాయికి ఎదిగి ప్రజలలో మంచి పేరు తీసుకువచ్చి ఏటూరునాగారం పేరు నిలబెట్టాలని కోరారు

గ్రూప్-1 ఫలితాల్లో సత్తా చాటి డీఎస్పీ (DSP) స్థాయికి ఎంపికై, ప్రస్తుతం శిక్షణ పొందుతున్న తర్వాత యూపీసీ సీసీ 2025 అల్ ఇండియా 793 ర్యాంక్ ఐపీస్ (IPS) IRSకు ఎంపికైన ధైనంపెల్లి ప్రవీణ్ కుమార్‌ను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు మరియు ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత గారు సన్మానించారు. హైదరాబాద్‌లోని తమ నివాసానికి ప్రవీణ్ కుమార్‌ను ఆహ్వానించిన వారు, ఆయన సాధించిన విజయాన్ని అభినందిస్తూ శాలువా కప్పి గౌరవించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదట ఎంతో కష్టపడి డీఎస్పీగా ఎంపికై,తర్వాత యూపీసీ సీసీ 2025అల్ ఇండియా 793 ర్యాంక్ ఐపీస్ (IPS) IRS గా ఎంపికైన ధైనంపెల్లి ప్రవీణ్ కుమార్ మన ప్రాంతానికి గర్వకారణమని కొనియాడారు. ఉన్నతమైన అధికారిగా బాధ్యతలు నిర్వహించి, మన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ధైనంపెల్లి ప్రవీణ్ కుమార్ పట్టుదల నేటి యువతకు గొప్ప మార్గదర్శకమని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వారు ప్రవీణ్ కుమార్‌కు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## మర్పల్లి ఎంపీడీవో, ఏపీవో ఆదేశాల మేరకు ఫీల్డ్ విజిట్ చేసిన టిఏ, బలవంత్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో అంజిరెడ్డి, ఆదేశాల మేరకు ఫీల్డ్ విసిట్ లో పాల్గొన్న టిఏ బలవంత్ రెడ్డి,పంచలింగాల్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలను వారు చేసిన పనిని పరిశీలించిన టి.ఏ బలవంత రెడ్డి, మాస్టర్ తీసుకొని నేమ్స్ చదివి అటెండెన్స్ ఫాలో అప్ చేయడం జరిగింది అలాగే పని ప్రదేశంలో మెజర్మెంట్ పని ప్రదేశాన్ని పరిశీలించడం జరిగింది ఉపాధి హామీలో పని చేసేవారు షుగర్ గాని బీపీ గాని అనారోగ్యంగా ఉంటే పనికి వెళ్లకూడదని ప్రభుత్వ ఆదేశాల మేరకుతెలిపారు ప్రభుత్వము నిర్ణయించిన మెజర్మెంట్ ప్రకారము అందరూ పూర్తిస్థాయిలో పనిచేసే ప్రభుత్వము ఇస్తున్న రాయితీ తీసుకోవాలని ఉదయము పనికి వెళ్ళిన తర్వాత మరల రెండో ఫోటో దిగేంతవరకు ఎవరు కూడా గ్రామాల్లోకి వెళ్ళకూడదు ఎండలు విపరీతంగా ఉన్నాయి కావున ఆరోగ్యం ప్రాముఖ్యం ఆరోగ్యం తర్వాతే అన్ని కార్యక్రమాలు చేసుకోవచ్చని తెలిపారు పని స్థలంలో పనిచేసుకుంటూ అలసట అనిపించినప్పుడువిశ్రాంతి తీసుకుంటూ మరల పనిచేస్తూ ఎండలోకి వెళ్లకుండా ఉదయం పని ప్రదేశంలో పని ముగించుకొని రెండు ఫోటోలు దిగి ఇంటికి రావాలని టెక్నికల్ అసిస్టెంట్ బలవంత్ రెడ్డి తెలిపారు, ఉపాధి హామీ కూలీలను ఫొటోస్ కాం విషయానికి వస్తే ఒకరిని రెండుసార్లు నాలుగు సార్లు పదిసార్లు కూడా తీసుకునే పరిస్థితి వస్తుంది దీంతో ఫొటోస్ స్కాన్,చేసేవారు



ఇబ్బందికరంగా అనిపించిన ఎంతో ఓపిగ్గా సహనంతో ప్రతి ఒక్కరి ఫోటో తీసి అప్లోడ్ చేయడం జరుగుతుందని ఉపాధి హామీ పని ప్రదేశంలో పెద్దలు సామెల్ సంగయ్య నరేష్ లక్ష్మయ్య బిచ్చయ్య సురేష్ ఉపాధి హామీ పని వారు ఫీల్డ్అసిస్టెంట్ బి శేఖర్ ను కేసారం సంజీవులు ను ఉపాధి హామీ పని వారు అభినందించారు

## తూముకుంట జడ్పీహెచ్ఎస్ తనిఖీ

### మౌలిక సదుపాయాల అత్యవసర మెరుగుదలకు కలెక్టర్ మను చౌదరి ఆదేశాలు



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 18:**షామీర్పేట్ మండలంలోని తూముకుంట జడ్పీహెచ్ఎస్ స్కూల్ ను శనివారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కూల్లో ప్రైమరీ , హై స్కూల్ ఉన్నందున ప్రాధాన్యత క్రమంలో విద్యార్థులకు కనీస సదుపాయాలు అందించాలని అన్నారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు కావాలని ప్రిన్సిపల్ అడగగా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రతిపాదనలు పంపాలని సూచించారు. తరగతి గదులను కంప్యూటర్ ల్యాబ్ ను కలెక్టర్ పరిశీలించారు. నీటి ఎద్దడి చాలా ఉందని మున్సిపల్ వాటర్ సరిపోవడం లేదని బోర్ వేయించాలని ప్రిన్సిపల్ కోరగా సంబంధిత అధికారులకు తెలియజేసి బోర్ వేయించాలని ఆదేశించారు. అత్యవసరమైన మరమ్మత్తులు ముందుగా చేయించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయ్ కుమారి, షామీర్పేట్ తాహసిల్దార్ సుచరిత , స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహా టీవీ ఖమ్మం బ్యూరో రామకృష్ణను పరామర్శించిన డబ్ల్యూజేఐ ప్రతినిధులు

### రామకృష్ణ మామయ్య, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస రావుకు నివాళి



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా మహా టీవీ బ్యూరో ఇంచార్జ్ రామకృష్ణ మామయ్య, ఖమ్మం ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస రావుకు వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఖమ్మం జిల్లా ప్రతినిధులు నివాళు లర్పించారు. ఆయన శనివారం బ్రెయిన్ స్ట్రోక్ తో అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న యూనియన్ జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి తదితరులు ఖమ్మం శివారు ఎస్.ఆర్ హోమ్స్ లోని ఆయన ఇంటికి వెళ్ళి శ్రీనివాస రావు భౌతిక కాయాన్ని సందర్శించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం, శ్రీనివాస రావు అల్లుడు, ఖమ్మం జిల్లా మహా టీవీ బ్యూరో ఇంచార్జ్ రామకృష్ణ, అతని సోదరుడు ఖమ్మం జిల్లా టీవీ9 బ్యూరో ఇంచార్జ్ నారాయణలను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంక్షేమం

### ఇందిరమ్మ చీరలు ఇంటింటికి పంపిణీ చేసిన కార్పోరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజాబలం)** ఖమ్మం మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం లో భాగంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆదేశానుసారం 46వ డివిజన్ కార్పోరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ స్థానిక నాయకులు అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ చీరలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారత మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని, అందులో భాగంగా మహిళలకు సంబంధించి ఉచిత బస్సు, ఫ్రీ కరెంట్ బిల్లు మరియు రేషన్ కార్డులలో లేదా ఇతర పథకాలలో మహిళల పేర్లు ప్రధానంగా ఉండడం తద్వారా మహిళల పేర్లు మీద ప్రభుత్వ పథకాలను అందించడం చేస్తూ ప్రజా రంజకమైన పాలన కొనసాగిస్తుందని, ఖమ్మం నియోజకవర్గం లో మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు నాయకత్వంలో మునుపెన్నడు లేని అభివృద్ధి జరుగుతుందని, వారి సహకారంతో డివిజన్లో అభివృద్ధి సంక్షేమం కొనసాగిస్తున్నామని తెలిపారు. మహిళలందరూ కాంగ్రెస్ ప్రభుత్వం





చేపడుతున్న కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ప్రజలలో విశేషణ ఆదరణ లభిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి నగర ఓబిసి అధ్యక్షుడు బాణాల లక్ష్మణ్ నగర కార్యదర్శి దేవర వెంకన్న, నాయకులు దయ్యాల నాగేశ్వరరావు ఎమ్మే రామకృష్ణ గోనెల రవిశంకర్ కన్నం రమేష్ సెల్వం జ్ఞానేశ్వర్ నగర దీపికలు స్వప్న, ప్రియాంక, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## మర్పల్లి రోడ్డు భద్రత నిబద్ధత గురించి వివరిస్తున్న అధికారులు




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల ముందు రోడ్డు భద్రత నిబద్ధత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ అధికారులు వాహనాలు నడిపేవారు తప్పనిసరి అయితేనే రోడ్డుపైకి రావాలి వాహనాలు నడిపించేవారు తగు జాగ్రత్తలు పాటించాలి టూ వీలర్ వెహికల్ నడిపించేవారు ఎలిమెంట్ తప్పనిసరిగా ధరించాలి ఫోర్ వీలర్ వెహికల్ నడిపేవారు సీట్ బెల్టు తప్పనిసరి ధరించాలి




మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదు రోడ్డు పరిమాణం చూస్తూ నిమ్మలంగా జాగ్రత్తగా వాహనాలు నడపాలని అధికారులు సూచించారు డ్రైవింగ్ లో ఉన్నప్పుడు అతి ప్రమాదకరమైంది సెల్ఫోన్ మాట్లాడడం ఎవరైనా సరే డ్రైవింగ్ లో ఉన్నప్పుడు సెల్ఫోన్ మాట్లాడకూడదు రోడ్డుపైన దృష్టి ఉంచి సుఖ ప్రయాణం చేయాలని అధికారులు సూచించారు వెహికల్ నడిపించేవారు చట్ట విరుద్ధంగా అతివేగంగా లైసెన్సు లేకుండా మద్యం సేవించి ట్రాఫిక్ రూల్స్ ని ఉల్లంఘిస్తే చట్టపరమైన శిక్ష అర్హులు అవుతారని అధికారులు సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ ,ఎంఈఓ బి అశోక్ ,ఎస్ ఐ రవుఫ్, ఉపాధ్యాయులు విద్యార్థులు సిఆర్పి మల్లేశం రోడ్డు నిబద్ధత కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు

## మాదకద్రవ్యాల మత్తులో రెచ్చిపోయిన యువకుడు

విజయనగరం రాజాంలో గంజాయి సేవించిన యువకుడు ఇతరులపై కర్కశంగా దాడికి దిగాడు. గత రాత్రి శ్రీనివాస కాలనీలోని మురళి అనే వ్యక్తి గంజాయి మత్తులో వీరంగం సృష్టించాడు. కుటుంబ సభ్యులతో గొడవపడుతున్న మురళీని అడ్డుకున్న కిరణ్పై బ్లేడుతో దాడి చేసారు. దాంతో కిరణ్ శరీరమంతా రక్త గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మురళిపై కేసు నమోదు చేసారు.

# ఏళ్ల తరబడి నిర్మాణ దశలో ఉన్న రుక్కితండ గ్రామపంచాయతీ భవనం

## పంచాయతీరాజ్ ఏఈ, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

## సర్పంచ్ రమాదేవి, మల్లి బాబు యాదవ్

## నిర్మాణ కార్యక్రమం చేపట్టాలని

## ఎండిఓ కార్యాలయం వద్ద గ్రామ ప్రజల ఆందోళన

**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజాబలం)** ఇల్లందు నియోజక వర్గంపంచాయతీరాజ్ శాఖ అధికారులు కాంట్రాక్టర్ తో కుమ్మక్కై కామేపల్లి మండలం రుక్కి తండా గ్రామపంచాయతీ భవన నిర్మాణం బేస్ మెంట్ స్థాయిలో ఉన్నప్పటికీ బిల్లులు మంజూరు చేయడం జరిగిందని, గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ పై అధికారులపై చర్యలు తీసుకోవాలని రుక్కి తండ గ్రామ ప్రజలు శనివారం నాడు కామేపల్లిఎండిఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎండిఓ వెంటనే స్పందించి కామేపల్లి మాజీ జెడ్పిటిసి మల్లి బాబు యాదవ్ సర్పంచ్ రమాదేవి, మండల అధికారుల సమక్షంలో నాటి పంచాయతీరాజ్ ఏఈ కి ఫోన్ చేసి గ్రామపంచాయతీ కార్యాలయం యొక్క పూర్తి వివరాలను బిల్లుల మంజూరికి సంబంధించిన పత్రాలు గురించి అడగగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని సమాచారం ఈ





విషయంలో అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఏళ్ల తరబడి బేస్ మెంట్ లెవల్ లో ఉన్న భవనాన్ని వెంటనే నిర్మాణం చేయాలని రుక్కి తండా సర్పంచ్ గుగులోతు రమాదేవి, మల్లి బాబు యాదవ్ అధికారులను కోరారు. గ్రామపంచాయతీ భవనం లేక స్థానిక పాఠశాల భవనంలో సమావేశాలు చేసుకోవడం జరుగుతుందని, నిర్మాణం చేద్దామనుకుంటే స్థలదాత

అడ్డం తిరుగుతూ నాకు ఆరోజు భూమి పరిహారం కింద ఇస్తానని చెప్పి, ఏమి ఇవ్వలేదని, ఎలాంటి అగ్రిమెంటు చేయించుకోలేదని, ఆ స్థలంలో నేను ఇల్లు కట్టుకుంటానని చెబుతున్నాడని,

స్థలదాత అగ్రిమెంట్ లేకుండా గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా, పంచాయతీ భవన నిర్మాణం ఎలా చేపట్టారని, బిల్లులు ఎలా మంజూరు చేశారని రుక్కితండా గ్రామ ప్రజలు ఎండిఓ ను నిలదీయడం జరిగింది. గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కొరకు తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా గ్రామపంచాయతీభవన నిర్మాణముల కొరకు 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగింది. కానీ అధికారులు కాంట్రాక్టర్ కుమ్మక్కై పనులు నిర్లక్ష్యం చేశారని ఉన్నతాధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్మిశెట్టి సాంబయ్య, గుగులోత్ కిషన్ కురసం రామ్మూర్తి, బానోత్ అశోక్ జాటోత్ సాయికుమార్, ఉబ్బని బాబు బానోతు దాన్యా నాయక్, లాకావత్ రాములు, కురసం రవి, ముత్తబోయిన సత్యనారాయణ చిన్నబోయిన కృష్ణ, చిన్నబోయిన కుమార్, ఎజ్జు సతీష్, బొమ్మగాని సుఖేందర్, కోట రాజా గుంట్ల వెంకటేష్, కొంకట్ల భద్రయ్య, గుగులోత్ రవి మేకల మల్లికార్జునరావు లాకావత్ నెహ్రూ, లాకావత్ నరేష్ బానోత్ దేవ్ సింగ్, మాలోత్ వీరన్న మరియు తదితరులు పాల్గొన్నారు

# మంత్రిని కలిసిన అందోల్ ఫోటోగ్రాఫర్ యూనియన్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**ఆందోల్ మండల ఫోటో ఌ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ గారికి, రాష్ట్ర వైద్య ఆరోగ్య ఌ సైన్స్ ఌ టెక్నాలజీ మంత్రి ని కలిశారు.

ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ భవన నిర్మాణం/కార్యాలయం కొరకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించవలసిందిగా

మంత్రి కోరినట్లు అందోల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు.

మేము ఆందోల్ నియోజకవర్గ కేంద్రం మరియు మండల పరిధిలోని ఫోటో మరియు వీడియో గ్రాఫర్లము. గత ఎన్నో ఏళ్లుగా మా ప్రాంతంలో జరిగే అన్ని రకాల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ మరియు ప్రభుత్వ కార్యక్రమాలను మా కెమెరాల్లో బంధిస్తూ, సమాజానికి మరియు ప్రభుత్వానికి మధ్య ఒక వారధిలా ఉంటూ వృత్తిపరమైన సేవలను అందిస్తున్నాము.

ప్రస్తుతం మా ఆందోల్ మండల అసోసియేషన్లో సుమారు 250 మంది పై సభ్యులు వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నారు. అయితే, మా వృత్తిపరమైన అంశాలపై చర్చించుకోవడానికి, సభ్యుల సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడానికి, మరియు కొత్తగా వచ్చే యువతీ యువకులకు ఫోటోగ్రఫీ రంగంలో శిక్షణ తరగతులు నిర్వహించుకోవడానికి మాకు సొంతంగా ఒక కార్యాలయం లేదా సంఘ భవనం లేదు. దీనివల్ల సమావేశాలు నిర్వహించుకోవడానికి మేము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము.

కావున, పెద్దలైన మీరు దయతల్చి మా అసోసియేషన్ భవన నిర్మాణం కోసం తగిన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, మా వృత్తి కళాకారుల సంక్షేమానికి తోడ్పడవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుతున్నాము. మీరు తీసుకునే ఈ నిర్ణయం 250 కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తుంది.మా విన్నపాన్ని సానుకూలంగా స్పందించి అందోల్ లో ఫోటోగ్రాఫర్ యూనియన్ భవన నిర్మాణం త్వరలోనే స్థలం కేటాయించి చూస్తానని అని అన్నారు అని అధ్యక్షులు అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, కార్యదర్శి, యూనియన్ సభ్యులుఆందోల్ మండల ఫోటో ఌ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్, సభ్యులు పాల్గొన్నారు.

# మేడారం ప్రమాద బాధిత బాలుడికి ప్రభుత్వ సహాయం చెక్కును అందచేత.

## మంత్రి దనసరి అనసూయ సీతక్క.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 18** ములుగు మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జరిగిన ప్రమాదంలో కాలు దెబ్బతిన్న బాలుడి కుటుంబానికి దేవాదాయ శాఖ ఆర్థిక సహాయం, ఉద్యోగ భరోసా కల్పించారు.

శనివారం ములుగు జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా బాధిత బాలుడి కుటుంబానికి దేవాదాయ శాఖ తరుపున చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఈఓ ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రమాదం జరిగిన వెంటనే బాలుడిని తల్లిదండ్రులకు సమాచారం మేరకు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి అత్యంత నాణ్యమైన వైద్యం అందించడం జరిగిందని, వైద్యానికి అయిన ప్రతి ఒక్క రూపాయి ఖర్చును ప్రభుత్వమే పూర్తిగా భరించిందని తెలిపారు. బాలుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాలుడి పేరు మీదనే ఆర్థిక సహాయాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో బ్యాంకులో జమ చేయడం జరిగిందని, బాలుడి తల్లికి కుటుంబ పోషణార్థం దేవాదాయ శాఖలో, మేడారం వనదేవతల సన్నిధి ప్రాంగణంలోనే అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం కల్పించి నెలకు రూ. 18,000/- వేతనం అందజేయబడుతుందని పేర్కొన్నారు. బాలుడి గాయం నుంచి పూర్తిగా కోరుకున్న అనంతరం అతనికి నాణ్యమైన కృత్రిమ కాలు అమర్చడంతో పాటు, సౌకర్యార్థం ఒక స్కూటీ కూడా అందజేయడం జరుగుతుందని ఈఓ వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధ బోయిన జగ్గారావు, బాలుడి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏడు రోజులపాటు సంక్షేమ వారాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 18 ములుగు కాన్ఫరెన్స్ హాల్** శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్ కులములు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాలలో, విద్యాలయాలలో పారిశుద్ధ్య



పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శానిటేషన్ సమస్యలను పరిష్కరిస్తూ, షెడ్యూల్‌ను కచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

జిల్లాలో సుమారు 62 శాతం రైతుల రిజిస్ట్రీ పురోగతి సాధించామని, మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు."అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా వారాంతం మొత్తం విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో కార్యక్రమాలు పూర్తి చేశామని చెప్పారు.

మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్‌కు అనుగుణంగా పోషణ్ పక్వాడకు సంబంధించిన కార్యక్రమాలు జిల్లాలో కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో నిర్దేశిత గ్రౌండ్ లెవల్ లక్ష్యాలను చేరుకునే దిశగా వేగంగా పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే లక్ష్యాలను పూర్తిచేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను సమయానికి చేరుకునేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, తదుపరి కూడా మరింత కట్టుదిట్టంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలు ఉల్లంఘించిన క్లినిక్స్‌పై ఉక్కుపాదం

## జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. సి. ఉమా గౌరి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 18:**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో వైద్య రంగంలో జరుగుతున్న తీవ్రమైన ఉల్లంఘనలపై జిల్లా అధికార యంత్రాంగం మరింత కఠినంగా వ్యవహరిస్తోంది. సఫిల్‌గూడ, ఉత్తమ్‌నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న "శ్రీ వెంకటేశ్వర వెల్‌నెస్ సెంటర్" పై నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు పలు ఆందోళనకర అంశాలను వెలుగులోకి తీసుకువచ్చాయి.ఇదే కేంద్రం గతంలో "శ్రీ వెంకటేశ్వర స్కిన్, హెయిర్ అండ్ కాస్మెటాలజీ క్లినిక్" పేరిట నమోదు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తూ, 02.09.2024న నిర్వహించిన తనిఖీల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం మరియు అలోపతి చట్టం--2010కు వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు గుర్తించబడింది. 2019 జూలై నుండి నడుస్తున్న ఈ కేంద్రం తప్పుడు మరియు నకిలీ పత్రాలు సమర్పించినట్లు తేలడంతో అప్పట్లో సీజ్ చేయబడింది.అయితే అదే యాజమాన్యం, "శ్రీ వెంకటేశ్వర వెల్‌నెస్ సెంటర్" పేరుతో మళ్లీ రిజిస్ట్రేషన్ (రిజి. నెం: 2306/2024) పొందినప్పటికీ, ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ డా. సి. ఉమా గౌరి ఆధ్వర్యంలో నిర్వహించిన తాజా తనిఖీల్లో మరింత తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి.తనిఖీలలో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ఎస్. సుజితకు తగిన వైద్య అర్హతలు లేకపోయినా బోటాక్స్, పి.ఆర్.పి., లేజర్ హెయిర్ రిమూవల్, ఫిల్లర్స్, థ్రెడ్ లిఫ్ట్, మెసోథెరపీ వంటి సున్నితమైన వైద్య ప్రక్రియలను అనధికారికంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇవి ప్రజల ఆరోగ్యానికి ప్రత్యక్ష ప్రమాదాన్ని కలిగించే సేవలుగా అధికారులు స్పష్టం చేశారు.పేషెంట్ల నుండి ఒక్కో సిట్టింగ్‌కు రూ.18,000 వరకు వసూలు చేస్తూ, మొత్తం ప్యాకేజీల రూపంలో పెద్ద మొత్తాలను ముందుగానే వసూలు చేస్తున్నట్లు బాధితులు వెల్లడించారు. ఇది వైద్య నైతికతకు విరుద్ధమేకాకుండా, ప్రజలను ఆర్థికంగా దోపిడీ చేయడం అని అధికారులు పేర్కొన్నారు.ఈ చర్యలు నేషనల్ మెడికల్ కమిషన్ చట్టంలోని సెక్షన్లు 20, 22, 34, 54కు వ్యతిరేకంగా ఉండటంతో పాటు ప్రజల ఆరోగ్య భద్రతను తీవ్రంగా ప్రమాదంలోకి నెట్టుతున్నాయని నిర్ధారించబడింది. దీంతో ఆ కేంద్రాన్ని వెంటనే సీజ్ చేయడం జరిగింది.అదేవిధంగా, ఏఎస్ రావు నగర్‌లోని "ట్రైకోవియా హెయిర్, స్కిన్ అండ్ లేజర్ క్లినిక్" పై తనిఖీలలో, డా. నాజియా పేరుతో నడుస్తున్న ఈ కేంద్రంలో డా. ప్రణవి (బి డి ఎస్)స్కిన్ మరియు ఫేస్ సంబంధిత వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. ఆమెకు ఆ సేవలు నిర్వహించడానికి అవసరమైన అర్హతలు లేకపోవడంతో ఆ క్లినిక్‌ను కూడా సీజ్ చేశారు."కేవలం రిజిస్ట్రేషన్ ఉండటం సరిపోదు. ప్రతి వైద్య సేవలు తగిన అర్హతలు కలిగిన వైద్యులచే, చట్టబద్ధ నిబంధనల ప్రకారం మాత్రమే అందించాలి. ఉల్లంఘనలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదు" అని హెచ్చరించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com